RNI:TGTEL/25/A1970

సమగ్ర దిన పత్రిక ఈనాటి

# విజయ భారతి

www.epaper.vijayabharathidaily.com

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం..!!
విజయ భారతి
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
9666023180,8096660656

Published From : రంగారెడ్డి జిల్లా సంపుటి 01 సంచిక 26 ఎడిటర్ : కొల్లూరు కురుమ కుమార్ సోమవారం 01-09-2025 పేజీలు : 12 వెల రూ. 05

## భారత్-చైనా స్నేహగీతిక

- వివాదాలతో బంధాలు పాడుచేసుకోవద్దు
- డ్రాగన్, ఏనుగు కలిసి నాట్యం చేయాలి: జిన్ పింగ్
- మూడో దేశ కోణం నుంచి మన బంధాన్ని చూడకూడదు
- పరస్పర విశ్వాసంతో ముందుకు వెళ్లాం: మోదీ
- ఇరు దేశాల్లోని 280 కోట్ల మంది సంక్షేమానికి కృషిచేద్దామని పిలుపు



**తియాన్ జోన్ :**
చైనాలోని తియాన్జన్ వేదికగా భారత్-చైనాలు స్నేహగీతిక వినిపించాయి. సరి హద్దు వివాదాలను పక్కన పెట్టేసి అన్ని రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయించాయి. అమెరికా విధి స్తున్న అదనపు సుంకాల దెబ్బ. భారత్-చైనాను దగ్గరకు చేరుస్తోంది. చైనా డ్రాగన్, భారత ఏనుగు కలిసి నాట్యం చేయాలని చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్.. భారత ప్రధాని నరేంద్రమోదీ వద్ద ఉద్ఘాటిం చారు. షాంఘై సహకార సదస్సు (ఎస్సీవో)ను పురస్కరించుకుని చైనాలోని తియానాను చేరు కున్న ఇరువురు అగ్రనేతలు ఆదివారం చర్చలు జరి పారు. ఇరు దేశాలు మిత్రులుగా ఉండడమే సరైన ఎంపిక అవుతుందని జిన్సింగ్ పేర్కొన్నారు. సరి హద్దు వివాదాల ఆధారంగా రెండు దేశాల సంబంధాలను నిర్వచించే అవకాశం ఇవ్వకహడదని చెప్పాడు. సరిహద్దు సమస్యలకు 'సముచితమైన, సహేతుకమైన, పరస్పర అంగీకారయోగ్యమైన పరి ష్కారం' కనుగొనేందుకు కలిసి పనిచేయాలని నేత లిద్దరూ అవగాహనకు వచ్చారు. ఆర్థిక సంబం చాలు, పెట్టుబడుల్ని విస్తరిం చుకుంటూ ప్రపంచ వాణిజ్యాన్ని స్థిరపరిచేందుకు పాటుపడాలని నిర్ణ యించుకున్నారు. ప్రధానంగా పెట్టుబడులు, వాణిజ్యం పెంపొందించుకోవడంపై ఇద్దరు నేతలూ దృష్టి సారించారు. ప్రజల మధ్య సంబంధాలు, నేరుగా విమాన సేవలు, వీసా సదుపాయాలు వంటివి చర్చకు వచ్చాయి. మోదీని మరోసారి కల వడం తనకెంతో ఆనందంగా ఉందంటూ జినింగ్ ఆహ్వానం పలికారు. 'మనం శత్రువులం కాదు అనేది దృష్టిలో పెట్టుకు న్నంత కాలం ఇరు దేశాల మధ్య (మిగతా 2లో)

# కాళేశ్వరంపై సీబీఐ

- విచారణకు అప్పగించాలని అసెంబ్లీ నిర్ణయం.. సీఎం ప్రకటన
- లక్ష కోట్లు దోచుకున్న దోపిడీ దొంగ కేసీఆర్
- ప్రజాస్వామ్యం కాబట్టి నడి బజారులో ఉరి తీయలేదు
- కేంద్ర సంస్థలు, అంతర్రాష్ట్ర అంశాలు ఇమిడి ఉన్నందున సీబీఐకి అప్పగించడమే మంచిదని నిర్ణయించాం: సీఎం రేవంత్



**హైదరాబాద్ :**
కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. దీనిని సీబీఐ విచారణకు అప్పగించాలని నిర్ణయి ంచింది. బ్యారేజీలపై జస్టిస్ పినాకిచంద్ర ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. దీనిపై సమగ్రంగా చర్చించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకుంది. ఆదివారం అర్ధరాత్రి దాటాక శాసనసభలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఈ నిర్ణయాన్ని వె లువరించారు. ఈ సందర్భంగా విచారణను సీబీఐకి అప్పగించడానికి కారణాలను ఆయన వివరించారు. "కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడి గడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించేం దుకు తెలంగాణ ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. నివేదికను జూలై 31న ప్రభుత్వానికి అందిస్తే... ఆగస్టు 4న మంత్రి వర్గం ఈ నివేదికను ఆమోదించింది. తదుపరి మంత్రివ ర్గం నిర్ణయంతో అసెంబ్లీలో పెట్టి, చర్చ చేపట్టాం. కమిషన్ క్రిమినల్ చర్యలకు ఉపక్రమిం చాలని సిఫారసు చేసింది. విచారణలో అనేక లోపాలు, అవకతవకలు గుర్తించింది. నిర్లక్ష్యం, దురుద్దేశం, ఉద్దేశపూర్వకంగా వాస్తవాలు తొక్కిపె ట్టడం, ఆర్థిక అవకతవకల అంశాన్ని ప్రస్తావిం చింది. ప్లానింగ్ లేదని తేల్చింది. ఎన్‌డీఎసఏ నివేదిక ప్రకారం మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి క్వాలిటీ కంట్రోల్, నాణ్యత, నిర్వహణ సరిగ్గా లేకపోవడం వల్ల లోపాలు ఏర్పడ్డాయని ఎన్‌డీ ఎసఏ గుర్తించింది. ఈ అంశాలపై మరింత లోతుగా, మరింత సమగ్రంగా దర్యాప్తు చేయాలని ఎన్‌డీఎసఏ, కమిషన్ నివేదికలు స్పష్టం చేశాయి. ఈ ప్రాజెక్టులో అంతరాష్ట్ర అంశాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ శాఖలు, ఏజెన్సీలు పాలుపంచుకున్నాయి. ప్రాజెక్టు డిజైన్, వ్యాప్కోస్ వంటి కేంద్ర సంస్థలు, పీఎఫ్‌సీ, ఆర్‌ఈసీ ఆర్థిక సంస్థలు పాల్పంచుకున్నందున ఈ కేసును సీబీఐకి అప్పగించడం సముచిత మని నిర్ణయంతీ సుకున్నాం. అందుకే ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని సభ నిర్ణయం తీసుకుంటుంది' అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నో రకాల అంశాలు, విచారణకు అర్హమైన అంశాలు ఉన్నందున సీబీఐ విచారణకు అప్పగించాలని నిర్ణయించామన్నారు. ధవళేశ్వరంపై ప్రాజెక్టు కట్టిన సర్ ఆర్థర్ కాటన్‌ను ప్రజలు కాటన్ దొర అని దేవుడిలా పూజిస్తుంటే.. దొరగా పుట్టానని గొప్పగా చెప్పుకొనే కేసీఆర్.. తెలంగాణలో దోపిడీ దొంగగా మారారని ఆరోపించారు. కాళేశ్వరంలో ప్రాజెక్టు పేరుతో కేసీఆర్ కుటుంబం రూ.లక్ష కోట్లు దోచుకుందని, రాష్ట్రప్రజలపై లక్షన్నర కోట్ల అప్పుల భారం వేసిందని అన్నారు. ప్రజాస్వామ్య దేశమైనందున.. కేసీఆర్ చేసిన పాపాలకు నడి బజారులో ఉరి తీయలేమని, రాళ్లతో కొట్టలేమని పేర్కొన్నారు. అందరి అనుమతితో నిర్ణయం తీసుకోవాలనే ఈరోజు అర్ధరాత్రి సమావేశం పెట్టామన్నారు.

**కాళేశ్వరంపై రూ. 49835 కోట్లు అప్పు కట్టాం..**
ముఖ్యమంత్రిగా కేసీఆర్ కాళేశ్వరం కోసం రూ. 87,449 కోట్లు అప్పులు తెచ్చారని సీఎం రేవంత్ తెలిపారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, నాబార్డ్, విజయ బ్యాంకుల నుంచి 14 ఏళ్ల కాలానికి అత్యధికంగా 11.5 శాతం వడ్డీకి తెచ్చారని పేర్కొన్నారు. ఆ నిధులతోనే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కట్టారన్నారు. అసలు, వడ్డీలు కలిపి ఇప్పటివరకు రూ.49,835 కోట్లు చెల్లించామని, ఇంకా రూ.60,769 కోట్లు చెల్లించాల్సి ఉందని చెప్పారు. పెండింగులో ఉన్న పనులు పూర్తిచేయాలంటే ఇంకా రూ.47 వేల కోట్లు కావాలన్నారు. కాగా, అర్ధరాత్రి దాటిన తరువాత 1.40 గంటలకు సభను నిరవధికంగా వాయిదా వేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. (మిగతా 2లో)

# బీసీ బిల్లులకు జై

- 42% రిజర్వేషన్ బిల్లులకు శాసనసభ ఏకగ్రీవ ఆమోదం
- మరో మూడింటికి సైతం..

**హైదరాబాద్ :**
తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 50% రిజర్వేషన్ల పరిమితి నిబంధనను ఎత్తివేస్తూ.. బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచేందుకు ఉద్దేశించిన పురపాలక చట్ట సవరణ, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులకు రాష్ట్ర శాసనసభ ఆదివారం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. వీటితోపాటు మరో 3 బిల్లులనూ సభ ఆమోదించింది. పురపాలక చట్ట సవరణ బిల్లును శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును ఆ శాఖ మంత్రి సీతక్క ప్రవేశపెట్టారు. ఈ బిల్లులకు కాంగ్రెస్‌తోపాటు భారత రాష్ట్ర సమితి, భాజపా, మజ్లిస్, సీపీఐలు మద్దతు తెలిపాయి. అలాగే సంగారెడ్డి జిల్లాలో ఇంద్రేశం, జిన్నారం మున్సిపాలిటీల ఏర్పాటు.. ఇస్నాపూర్ మున్సిపాలిటీ విస్తరణపై.. తెలంగాణ పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు, మున్సిపల్ చట్ట సవరణ బిల్లు, అల్లోపతిక్ ప్రైవేట్ వైద్య సంరక్షణ సంస్థల (రిజిస్ట్రేషన్, క్రమబద్ధీకరణ) చట్టాన్ని రద్దుచేసే బిల్లులకు సైతం సభ ఆమోదం తెలిపింది. బిల్లుల ఆమోదం సందర్భంగా సభలో పలువురు మంత్రులు, వివిధ పార్టీలకు చెందిన సభ్యులు మాట్లాడారు.



**విప్లవాత్మక ర్ణయమిది: మంత్రి శ్రీధర్‌బాబు**
"ఏ ప్రభుత్వం చేయలేని విధంగా పురపాలకశాఖ పరిధిలోని స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలుచేయాలని సంకల్పిం చాం. బీసీల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు లేకపోవడంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 42% కల్పించేందుకు కార్యాచరణ చేపట్టాం. ఇది విప్లవాత్మకమైన నిర్ణయం. శాస్త్రీయంగా నియమించిన కమిషన్ చేసిన సిఫార్సుల మేరకు బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాలని.. దీనికోసం తెలంగాణ పురపాలక చట్టం-2019 నిబంధనలను సవరించాలని నిర్ణయించాం" అన్నారు.

## ఆ కళ్లు చూస్తున్నాయేమో గమనించండి

- ట్రయల్, హెూటల్ గదుల్లో రహస్య కెమెరాలు
- మహిళలు, యువతులకు బెదిరింపులు
- జాగ్రత్తలతో ముప్పు తొలగు

**అమరావతి :**
కంటికి కనపడని చోట రహస్య కెమెరాలు బిగించి.. మహిళలు, యువతులను అసభ్యంగా చిత్రీక రించడం.. వాటిని అడ్డం పెట్టుకుని డబ్బుల కోసం బ దిరించడం, వేధింపులకు దిగడం, అశ్లీల వెబ్‌సై ట్‌లకు విక్రయించడం వంటి ఘటనలు దేశం లోఎక్కడో చోట వెలుగుచూస్తూనే ఉన్నాయి. ఇలా హెూటల్ గదులు, షాపింగ్ మాల్స్‌లోని ట్రయల్, వాష్ రూంలు సహా అనేక ప్రదేశాల్లోని దృశ్యాలను రికార్డు చేసే ప్రమాదకర ధోరణి పెరుగుతోంది. ఏమరుపాటుగా ఉంటే అమాయక మహిళలు, యువతులు ఈ ఘోరాల బారిన పడే ప్రమాదముంది. జాగ్రత్త పడితే ఈ ముప్పును సులువుగానే తప్పించుకోవచ్చు.



**వీటిపై ఓ కన్నేయండి**
స్విచ్‌బోర్డులు, ఫ్యాన్లు, బల్బు, పూల కుండీలు, అలంకరణ వస్తువులు, టేబుల్ ల్యాంప్‌లు, ఫొటో ఫ్రేములు, సీలింగ్, టిష్యూ పేపర్ బాక్సు, స్మోక్ డిటెక్టర్లు తదితర వాటిల్లో రహస్య కెమెరాలను అమర్చే అవకాశాలు ఎక్కువ. కొత్త ప్రదేశాలకు వెళ్లినప్పుడు పరిసరాలన్నీ ఒకటికి రెండు సార్లు నిశితంగా గమనించాలి.

**పసిగట్టేద్దామిలా..**
ట్రయల్ రూమ్‌లు, హెూటల్ గదుల్లోకి వెళ్లినప్పుడు తొలుత లైట్లన్నీ ఆఫ్ చేసి చుట్టూ గమనించాలి. ఏ మూలనైనా ఎల్ఈడీ వెలుగు కనిపిస్తే అక్కడ రహస్య కెమెరాలున్నాయేమో పరిశీలించాలి. సాధారణంగా నైట్ విజన్ కెమెరాలకు ఎరుపు, పచ్చని రంగులతో కూడిన ఎల్ఈడీ లైట్లు ఉంటాయి. వాటిని చీకట్లో గుర్తించొచ్చు. అద్దాల వెనక రహస్య కెమెరాలు అమర్చే అవకాశాలు ఎక్కువ. వాటిని కనిపెట్టేందుకు చూపుడు వేలి కొసను అద్దానికి ఆనించాలి. మీ వేలికి, అద్దంలో ప్రతిబింబానికి మధ్య గ్యాప్ ఉంటే ఇబ్బంది ఏమీ లేనట్లే. రెండూ పరస్పరం తాకుతున్నట్లు కనిపిస్తే మాత్రం అనుమానించాల్సిందే. గదిలోని లైట్లన్నీ ఆపేసి ఫోన్ ఫ్లాష్ ఆన్ చేసి అన్నివైపులా పరిశీలించాలి. ఎక్కడి నుంచైనా (మిగతా 2లో)

## బురద జల్లేందుకే జస్టిస్ ఘోష్ నివేదిక

- కోర్టులో స్టే వస్తుందనే అత్యవసరంగా అసెంబ్లీలో పెట్టారు
- 650 పేజీల నివేదికపై అర గంటలో మాట్లాడాలా?
- మహారాష్ట్ర 152 మీటర్లకు ఒప్పుకోలేదు
- దానికితోడు నీళ్లు సరిపోవన్న కేంద్రం సూచనతో మేడిగడ్డకు మార్చాం
- కాళేశ్వరం నివేదికపై హరీశ్‌రావు

**హైదరాబాద్ :**
'ప్రభుత్వం ఆదరాబాదరాగా ఆదివారం అసెంబ్లీ పెట్టి జస్టిస్ ఘోష్ నివేదికను ప్రవేశపెట్టిందంటేనే బురద రాజకీయం చేయడానికని అర్థమవుతోంది..'అని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. 'కాంగ్రెస్ తొలి నుంచి కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తూ వచ్చింది. రాజకీయ కక్ష సాధించేందుకు నివేదికను వాడుకుంటోంది. 650 పేజీల నివేదికపై అ-రగంటలో మాట్లాడమంటున్నారు. కనీసం రెండు గంటలు అవసరం. నాలుగు రోజులైనా మాట్లాడగలను. నివేదికలోని ఒక్కో పేజీకి, ఒక్కో అక్షరానికి సమాధానం చెబుతా. నిజానిజాలు ప్రజలకు తెలియాలి' అని భారత రాష్ట్ర సమితి నేత హరీశ్‌రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికపై శాసనసభలో ఆదివారం జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు.



ఒకవైపు వరదలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. యూరియా కోసం రైతులు నానా కష్టాలు పడుతుంటే.. వాటిపై కాకుండా కాళేశ్వరం ప్రాజెక్టును ప్రభుత్వం రాజకీయ ఆయుధంగా వాడుకుంటోందని విమర్శించారు. న్యాయ కమిషన్ నిష్పక్షపాతంగా (మిగతా 2లో)

కాళేశ్వరం ప్రాజెక్టు విచారణకు ఆదేశించిన తీరు చూస్తే

## మ్యాచ్ ఫిక్సింగ్‌లా అనిపిస్తోంది

**భాజపా శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి**

**హైదరాబాద్ :**
కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్చ సందర్భంగా భాజపా శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితిలపై విమర్శలు గుప్పించారు. "ఇది కాళేశ్వరం కమిష న్ నివేదిక కాదు.. కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి కలిసి ఇచ్చినట్లు ఉంది. నివేదికలో కేసీఆర్ అవి నీతిపై ప్రస్తావన లేకపోవడం అనుమానాలు రేకెత్తిస్తోంది. ఈ కమిషన్ ఎందుకు ఏర్పాటు చేశారో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలి. విచారణకు ఆదేశించిన తీరు చూస్తే మ్యాచ్ ఫిక్సింగ్‌లా అనిపిస్తోంది. అవినీతి చేసినవారు ఎవరో తేలే వరకు ప్రజలు ఊరుకోరు. ప్రజలు కోరు కునే విధంగా విచారణ చేయించకపోవడంపై అనుమానాలు కలుగుతున్నాయి. అవినీతి చేసిన వారిపై ఏం చర్యలు తీసుకుంటారో చెప్పాలి. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని మీరే చెప్పారు.. మరి చర్యలేవి? జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక.. కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఉంది. భారత రాష్ట్ర సమితిపై కాంగ్రెస్‌కు ప్రేమ పెరుగుతోంది. ఫోన్ ట్యాపింగ్, ఓఆర్ఆర్, కాళేశ్వరం, మిషన్ కాకతీయపై తీసుకున్న చర్యలేంటి? కాళేశ్వరంపై సీబీఐ విచారణ వేస్తారా.. సిట్ విచారణ వేస్తారా? కాళేశ్వరంపై చేసిన జ్యుడీషియల్ విచారణ క్వాష్ అయ్యే పరిస్థితి ఉంది. అవినీతి చేసిన డబ్బును ఎలా తీసుకువస్తారో ప్రభుత్వం చెప్పాలి. భారత రాష్ట్రసమితితో కాంగ్రెస్‌కు లోపాయికారి ఒప్పందం ఉందని తెలుస్తోంది" అని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సభలో విరుచుకుపడ్డారు. అనంతరం భాజపా సభ్యులు తమకు కాళేశ్వరం నివేదికపై మాట్లాడేందుకు తగిన సమయం ఇవ్వలేదని వాకౌట్ చేశారు.



## రూ.లక్ష కోట్లు ఖర్చు చేసినా లక్ష ఎకరాలకు మించి నీరివ్వలేదు

- కాళేశ్వరం తప్పిదాలకు కేసీఆర్‌దే బాధ్యత అని కమిషన్ తేల్చింది
- అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్ :**
కాళేశ్వరం నిర్మాణంలో జరిగిన తప్పిదాలకు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌దే బాధ్యత అని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తేల్చిందని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరంలో లోపాలున్నాయని.. డ్యామ్‌కు, బ్యారేజీకి తేడా లేకుండా నిర్మాణం చేపట్టారని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నివేదికలో ఉందన్నారు. అధికారులు వద్దన్నా వినకుండా మేడిగడ్డలో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేశారని, మరమ్మతులు చేయకుండా కూలిపోయేందుకు కారణమయ్యారని ఆరోపించారు. ఆదివారం శాసనసభలో జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికపై లఘుచర్చను ఉత్తమ్ ప్రారంభించి మాట్లాడారు. రూ.38 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాణహిత-చేవెళ్లను నాటి ప్రభుత్వం పక్కనపెట్టి కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టిందని, అంచనా వ్యయాన్ని రూ.1.47 లక్షల కోట్లకు పెంచిందని ఆక్షేపించారు. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసిన ఈ ప్రాజెక్టుతో కొత్త, పాత ఆయకట్టు కలిపి 34 లక్షల ఎకరాలకు నీరిస్తామన్నారని... కొత్తగా లక్ష ఎకరాలకు, పాత ఆయకట్టులో మరో లక్ష ఎకరాలకు మాత్రమే నీరిచ్చారని విమర్శించారు. నాలుగేళ్లలోనే కూలిపోయిందన్నారు. "క్యాబినెట్ అనుమతి లేకుండానే నాటి ప్రభుత్వం కాళేశ్వరంపై ముందుకెళ్లింది. మేడిగడ్డ వద్ద ప్రాజెక్టును కట్టవద్దని నాటి



ప్రభుత్వ కమిటీ చెప్పింది. వాప్కోస్ కమిటీ నివేదిక రావడానికి ముందే మేడిగడ్డ బ్యారేజీ కట్టడానికి డీపీఆర్ తయారు చేయాలని అప్పటి సీఎం ఆదేశించారు. రూ.21 వేల కోట్లతో కట్టిన మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు, పంప్‌హౌస్‌లు 20 నెలలుగా నిరుపయోగమయ్యాయి. మేడిగడ్డ కూలడం... రాష్ట్ర చరిత్రలోనే అత్యంత దురదృష్టకర సంఘటన. దేశంలోనే ఇంతటి ఆర్థిక విపత్తు ఏ రాష్ట్రంలోనూ జరగలేదు' అని పేర్కొన్నారు. తన ప్రసంగానికి భారత రాష్ట్రసమితి సభ్యులు అడ్డుపడంతో.. 'మీరే డిజైన్ చేశారు. మీరే కట్టారు.


## 'భారత్ లాంటి దేశాన్ని చిన్నచూపు చూస్తారా?'



**న్యూఢిల్లీ :** భారత ప్రధాని నరేంద్ర మోదీ.. ప్రస్తుతం చైనా పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. ఇరు దేశాల మధ్య ఫుల్ స్టాప్ పడ్డ పలు ద్వైపాక్షిక ఒప్పందాల్లో భాగంగా మోదీ.. చైనాలో అడుగుపెట్టారు. ఎప్పట్నుంచో భారత్‌తో సంబంధాల కోసం ఎదురుచూస్తున్న చైనా కూడా మోదీ పర్యటనకు ఘన స్వాగతం పలికింది. ఇదిలా ఉంచితే, భారత్‌పై అక్కసు వెళ్లగక్కుతూ సుంకాలను 50 శాతం పెంచేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై చైనాకు చెందిన అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకుడు ఎయిమర్ టాన్‌జెన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రపంచ శాంతి కోసం పాటుపడుతున్నానని చెప్పుకుంటున్న ట్రంప్‌కు కనీసం బుర్ర ఉంటే భారత్‌పై ఆ విధంగా సుంకాలు విధించే వాడు కాదంటూ మండిపడ్డారు. ప్రపంచ మార్కెట్ పరంగా చూసినా, కార్మికుల పరంగా చూసినా భారత్ అతి పెద్దదని, అటువంటి దేశంపై ట్రంప్ విజ్ఞత లేకుండా వ్యవహరించి తప్పు చేశాడన్నారు . ట్రంప్ తన బెదిరింపులతో లొంగదీసుకోవాలనుకోవడం, అందులోనూ భారత్ లాంటి దేశంపై సుంకాలతో కాలు దువ్వడం వంటిది అమెరికాకే మంచిది కాదన్నారు. ప్రస్తుతం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్–మోదీల మధ్య జరుగుతున్న చర్చలతో మరో కొత్త శకం ఆరంభం కానుందన్నారు. 'అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. భారత్‌ను బలవంతంగా లొంగిపోయేలా చేయాలనుకున్నారు. రష్యా ఆయిల్ కొంటే సుంకాలు విధించడం ఏంటి?,. భారత్ లాంటి దేశాన్ని తక్కువ చేసి చూడటం సమంజసం కాదనేది నా అభిప్రాయం. తెలివైన వారు ఎవరూ కూడా ఇలా వ్యవహరించరు. ట్రంప్ చర్య సరైనది కాదు. భారత్‌కు బెదిరింపులకు ఎదురొడ్డి నిలబడే శక్తి ఉంది.. అవకాశం కూడా ఉంది' అని ఎయిమర్ టాన్‌జెన్ స్పష్టం చేశారు.

## న్యాయవాద గుమస్తాల సమస్యల పరిష్కారానికి కృషి

- స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యుల హామీ




ముప్పాళ్ల సుబ్బారావును సత్కరిస్తున్న న్యాయవాద గుమస్తాలు

**కాకినాడ :** న్యాయవాద గుమస్తాల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావు, నరహరిశెట్టి రవికృష్ణ హామీ ఇచ్చారు. నవ్యాంధ్రప్రదేశ్ అడ్వకేట్స్ క్లర్క్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎ. సుబ్బయ్య, నల్లా భాస్కరరావుల ఆధ్వర్యంలో ఆదివారం కాకినాడలో నిర్వహించిన న్యాయవాద గుమస్తాల రాష్ట్రస్థాయి సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. న్యాయవాద గుమస్తాలకు సంక్షేమనిధికి సంబంధించి డెత్ బెనిఫిట్స్‌ను రూ. 3 లక్షల నుంచి రూ. 4 లక్షలకు పెంచుతూ ఇటీవల తీర్మానించడంపై సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. మ్యాచింగ్‌గ్రాంట్ మంజూరుచేయాలని, హెల్త్‌కార్డులు, ఇళ్లు, శాశ్వత నిధిగా రూ. 30 కోట్లు మంజూరుచేయాలన్న అంశాలను ప్రభుత్వానికి నివేదించాలని సమావేశంలో నిర్ణయించారు.

## వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులకు అండగా ఉంటాం




విద్యాసాగర్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘ నాయకులు వెంకటేష్‌బాబు తదితరులు

**విజయవాడ :** వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులకు అండగా ఉంటూ వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ. విద్యాసాగర్ అన్నారు. ఆదివారం విజయవాడలోని ఎన్జీవో భవన్‌లో నిర్వహించిన ది కమర్షియల్ ట్యాక్సెస్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ కృషి చేస్తోందని చెప్పారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భవనారి వెంకటేష్‌బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో లక్షల మంది ఉద్యోగులకు అండగా ఉంటూ.. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా విద్యాసాగర్ పనిచేస్తున్నారని కొనియాడారు. సంఘానికి గడువులోగా ఎన్నికలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి కొప్పోలు సుధాకర్, కోశాధికారి రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్య ఇంజినీరింగ్‌లో పదోన్నతులు

**అమరావతి:** పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో భాగమైన ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగంలో 11 మంది సూపరింటెండింగ్ ఇంజినీర్లకు చీఫ్ ఇంజినీర్లు (సీఈ)గా ప్రభుత్వం పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. పి. సత్యనారాయణ, బి. శ్రీనివాసరావు (సీఆర్‌డీఏ), సీహెచ్ ధనుంజయ, బి. నర్సింహమూర్తి (అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్), ఎ. సుధాకర్, ఎం. గణేశ్‌బాబు (ఏపీయూఎఫ్‌ఐడీసీ), వై. కృష్ణారావు, డి. వేణుగోపాల్ (ఏపీ టిడ్కో), కె. వేణుగోపాలరావు (స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్), బి. రాజేంద్రకృష్ణ, పీవీవీ సత్యనారాయణరాజు (మహా విశాఖ నగరపాలక సంస్థ) సీఈలుగా నియమితులయ్యారు.

## రాష్ట్రంలో పెరిగిన యూరియా విక్రయాలు

గతేడాదితో పోలిస్తే 84,526 టన్నులు అధికం

**అమరావతి :** ఖరీఫ్‌లో రాష్ట్రంలో ఇప్పటివరకు 5.48 లక్షల టన్నుల యూరియా విక్రయాలు జరిగాయి. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే 84,526 టన్నులు ఎక్కువ. సెప్టెంబరు నెలకు 1.55 లక్షల టన్నుల యూరియా అవసరం కాగా.. 1.59 లక్షల టన్నుల్ని కేంద్రం కేటాయించింది. ఆగస్టు అవసరాలకు కేటాయించిన పరిమాణంలో ఇంకా 82 వేల టన్నులు రావాల్సి ఉంది. ప్రస్తుతం మార్క్‌ఫెడ్, ప్రైవేటు దుకాణాలు, పీఏసీఎస్‌లు, రైతు సేవా కేంద్రాలు, కంపెనీల గోదాములు, హోల్‌సేల్ డీలర్లతో పాటు రవాణాలో కలిపి 1,08,852 టన్నుల యూరియా ఉందని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు.

# కాళేశ్వరంపై సీబీఐ


(మొదటి పేజీ తరువాయి)

**రాష్ట్రానికి గుదిబండగా మార్చారు**

అంతకుముందు సభలో సీఎం మాట్లాడుతూ "ప్రాజెక్టు పేరుతో కేసీఆర్ చేసిన మోసం అంతాఇంతా కాదు. రూ. లక్ష కోట్లు కొల్లగొట్టారు. ఏఐబీపీ కింద ఏదైనా ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం గుర్తిస్తే 75 శాతం నిధులిచ్చే నిబంధన ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో 2013లో 25 ప్రాజెక్టులను ఈ పథకం కింద కేంద్రం గుర్తించింది. ఆ జాబితాలో ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు ఉంది. ఆ ప్రాజెక్టును రీడిజైన్ పేరుతో మేడిగడ్డకు మార్చి రాష్ట్రానికి గుదిబండగా మార్చిన కేసీఆర్, హరీశ్‌రావును శిక్షించాల్సిన అవసరం ఈ సమాజానికి లేదా? అంబేద్కర్‌పై కోపంతో కేసీఆర్ ఆ ప్రాజెక్టు పేరును మార్చి మేడిగడ్డ పేరుతో రూ. లక్ష కోట్లు దోచుకున్నారు. కేసీఆర్, హరీశ్‌రావులు చేసిన అరాచకాలను ఈటల రాజేందర్ ఆపలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు ఆకృతి, నిర్మాణం, నిర్వహణ సరిగా లేవు. ప్రాజెక్టు వైఫల్యం ఏమాత్రం క్షమించరాని నేరమని ఎన్‌డీఎస్ఏ తేల్చిచెప్పింది. దీనికి అప్పటి ప్రభుత్వమే కారణమని చెబితే.. ఎన్‌డీఎస్ఏ నివేదికను ఎన్‌డీయే రిపోర్టని అంటున్నారు. మేడిగడ్డ కూలిపోవడంతో గోదావరిలో రూ. లక్ష కోట్లు కొట్టుకుపోయాయి. దీనిపై విచారణ చేయించి లోపాలు ఎత్తిచూపిస్తే అడ్డుకుంటున్నారు. కమిషన్ నివేదికలో ఏమైనా లోపాలుంటే వాటిని ప్రస్తావించకుండా జస్టిస్ ఘోష్‌ను తక్కువచేసి మాట్లాడటం సరికాదు.

**కాంట్రాక్టర్ల కమీషన్లకు కక్కుర్తి పడి...**

తుమ్మిడి హెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మిస్తే నిర్మాణ వ్యయం, లిఫ్టులు, నిర్వహణ భారం తగ్గేవి. కానీ కాంట్రాక్టర్ల కమీషన్లకు కక్కుర్తి పడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో 2009లో ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు ప్రారంభించి రూ. 6,157 కోట్లు ఖర్చుచేశారు. తెలంగాణ ఏర్పాటయ్యాక తొలి ఏడాది రూ. 5,523 కోట్లు ఖర్చుచేశారు. ఈ ప్రాజెక్టు కింద రూ. 11,670 కోట్లు ఖర్చు చేసిన తరువాత రీడిజైన్ పేరిట బ్యారేజీ స్థలాన్ని మార్చారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించుకునేందుకు మహారాష్ట్ర అంగీకరించింది. అక్కడ ప్రాజెక్టు నిర్మించుకోవచ్చని వాప్కోస్ చెప్పింది. అక్కడ 205 టీఎంసీల లభ్యత ఉందని అప్పటి కేంద్ర జలవనరులశాఖ మంత్రి ఉమాభారతి ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇవేమీ కాదని... మేడిగడ్డ వద్ద బ్యారేజీ కట్టి మూడు లిఫ్టుల ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు వీలుగా నివేదిక ఇవ్వాలని ఆ సంస్థను అడిగారు. 2015లో రీడిజైన్ పేరిట కేసీఆర్ మదిలో పడిన బీజం విషవృక్షమై తెలంగాణ ప్రాంతాన్ని, ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసింది. ప్రాణహిత కాదని చేపట్టిన కాళేశ్వరంతో మూడు బ్యారేజీల నిర్మాణంతో విద్యుత్తు వినియోగం 3వేల మెగావాట్ల నుంచి 8,450 మెగావాట్లకు పెరిగింది రూ. 38 వేల కోట్ల ప్రాజెక్టు వ్యయం.. కాళేశ్వరం రీడిజైన్ కారణంగా రూ. 1.47లక్షల కోట్లకు చేరింది.



**దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చాం..**

కాళేశ్వరం ప్రాజెక్టులో రూ. లక్ష కోట్లను లూటీ చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని 4 కోట్ల మంది ప్రజలకు మేం హామీ ఇచ్చాం. అందుకు అనుగుణంగానే దోషులుగా తేలినవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. మేం ప్రభుత్వం ఏర్పాటు చేసిన మూడు నెలల్లోనే జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించాం. ఎన్‌డీఎస్ఏ తాత్కాలిక, తుది నివేదికలు.. విజిలెన్స్ ప్రాథమిక, తుది నివేదికలతోపాటు కాగ్ నివేదికలను జస్టిస్ ఘోష్ కమిషన్‌కు ప్రభుత్వం సమర్పించింది. వాటి ఆధారంగానే కమిషన్ విచారణ జరిపింది. అయితే జస్టిస్ ఘోష్ కమిషన్ తమకు 8బీ, 8సీ నోటీసులు ఇవ్వలేదని.. అందుకే కమిషన్ నివేదిక చెల్లదని కేసీఆర్, హరీశ్‌రావు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విద్యుత్తు కొనుగోళ్లలో అక్రమాలపై జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి కమిషన్ ఇవే నోటీసులిస్తే.. అలా ఇవ్వడం చెల్లదంటూ కేసీఆర్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పుడు జస్టిస్ ఘోష్ కమిషన్ అవే నోటీసులివ్వలేదని వితండవాదం చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇలాంటి ఇబ్బందులున్నందునే జాగ్రత్తగా ముందుకెళ్తున్నాం. జస్టిస్ ఘోష్‌ది విచారణ కమిషన్ మాత్రమే... నిర్ణయాధికారం లేదు. కమిషన్ నివేదికపై మీరేమైనా సలహాలిస్తే ఇవ్వొచ్చు. లేదంటే లేదు. ప్రభుత్వపరంగా ఎలా ముందుకెళ్లాలో మేం నిర్ణయిస్తాం. అక్రమాలకు పాల్పడినవారిపై ప్రభుత్వపరంగా కఠినమైన చర్యలు తీసుకుంటాం.

**వాస్తవాలను బయటపెట్టారనే హరీశ్‌రావుకు అక్కసు**

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ వాస్తవాలన్నింటినీ బయటపెట్టింది కాబట్టి హరీశ్‌రావు అక్కసు వెళ్లగక్కుతున్నారు. జస్టిస్ ఘోష్‌ను వ్యక్తిగతంగా దూషించే హక్కు హరీశ్‌రావుకు లేదు. అసంపూర్తి సమాచారంతో, అసత్యాలతో సభను తప్పుదోవ పట్టించేందుకు యత్నించిన హరీశ్‌రావు వ్యాఖ్యల్ని రికార్డుల నుంచి తొలగించాలి. ఆయన వ్యవస్థల్ని తప్పుదోవ పట్టించారని నివేదికలోని పేజీ నంబరు 98లో జస్టిస్ ఘోష్ పేర్కొన్నారు. అనంతరాములు కమిటీ నివేదికను భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం పట్టించుకోలేదని కమిషన్ తన నివేదికలోని 63, 64 పేజీల్లో స్పష్టంగా పేర్కొంది. నిపుణుల కమిటీ విచారణలో తన మామ, బావమరిది ఒత్తిడి చేశారని హరీశ్‌రావు తన నిస్సహాయతను పరోక్షంగా ఒప్పుకొన్నారని 65వ పేజీలో తెలిపింది. ఎంత లోతుల్లోకి వెళ్తే అన్ని నిజాలు బయటికి వస్తాయి కాబట్టి... కమిషన్ నివేదికపై ఎలా ముందుకెళ్లాలో హరీశ్‌రావు సూటిగా చెప్పాలి. ఈడీ, సీబీఐ, ఇన్‌కమ్ టాక్స్, సీబీసీఐడీ, సిట్‌లలో ఏ విచారణ కావాలో చెప్పాలి తప్ప... తప్పుడు వివరాలతో సభను తప్పుదోవ పట్టించొద్దు" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**అక్బరుద్దీన్‌తో వాడీవేడి వాదనలు**

సీఎం ప్రసంగం సమయంలో ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్‌తో వాడీవేడి వాదనలు చోటుచేసుకున్నాయి. కమిషన్ నివేదికలో ఎన్‌డీఎస్ఏ, విజిలెన్స్, కాగ్, నిపుణుల కమిటీ నివేదికలను పొందుపరచలేదని అక్బరుద్దీన్ పేర్కొనగా... ఎన్‌డీఎస్ఏ, కాగ్, విజిలెన్స్ నివేదికల వివరాలు నమోదు చేసిన పేజీల గురించి సీఎం ప్రస్తావించారు. సభలో సీనియర్ సభ్యుడిగా అక్బరుద్దీన్ సలహాలు ఇవ్వొచ్చన్నారు. ఆయనకు సభలో గంటకుపైగా మాట్లాడే సమయమిచ్చామని పేర్కొన్నారు. ఆయన అడిగే అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పే శక్తి తనకుందన్నారు. కమిషన్ నివేదికపై స్పష్టత ఇచ్చేందుకే సభలో చర్చిస్తున్నామన్నారు. కచ్చితంగా స్పష్టత ఇచ్చిన తర్వాతే సభ నుంచి వెళ్తామన్నారు.

**ప్రాజెక్టు నిర్మాణ స్థలం మార్పు కేసీఆర్ కుట్రే...**

నిజాం కన్నా సంపన్నుడు కావాలనే దురాశ కలిగిందో... కుటుంబం నుంచి ఒత్తిడి వచ్చిందో కానీ రీడిజైన్ పేరుతో తుమ్మిడి హెట్టి నుంచి మేడిగడ్డకు ప్రాజెక్టును మార్చాలని కేసీఆర్ కుట్ర పన్నారు. రూ. లక్ష కోట్లు దోచుకోవాలనే దురుద్దేశంతోనే తుమ్మిడి హెట్టి గురించి మరోసారి పరిశీలించాలని కేసీఆర్, హరీశ్‌రావులు కేంద్రానికి లేఖ రాశారు. తుమ్మిడి హెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణాన్ని మహారాష్ట్ర ఎన్నడూ వ్యతిరేకించలేదు. 152 మీటర్ల ఎత్తులో కడితే తమ రాష్ట్రంలో ఎక్కువ భూమి ముంపునకు గురవుతుందని, తక్కువ ఎత్తులో కట్టాలని మాత్రమే సూచించింది. మహారాష్ట్రతో కేసీఆర్ చర్చల సందర్భంగా ఇదే విషయం ప్రస్తావనకు వచ్చింది. కానీ, దురాశతో ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చాలనుకున్నారు. విశ్రాంత ఇంజినీర్ అనంతరాములు నేతృత్వంలో నిపుణుల కమిటీని నియమించారు. ఆ కమిటీని నియమించినప్పుడే మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు కట్టాలని కేసీఆర్ నిర్ణయించుకున్నారు. కాళేశ్వరం వద్ద ప్రాజెక్టు నిర్మించొద్దని అనంతరాములు కమిటీ నివేదిక ఇచ్చింది. చీఫ్ ఇంజినీర్ హరిరాం సైతం అదే రాశారు. కానీ రూ. లక్ష కోట్లు కొల్లగొట్టాలనేదే భారత రాష్ట్ర సమితి కుట్ర కాబట్టి విశ్రాంత ఇంజినీర్ల కమిటీ నివేదికను తొక్కిపెట్టింది.

–సీఎం రేవంత్‌రెడ్డి

## మీరంతా మరింతగా అభివృద్ధి చెందాలి

మహిళలు, రైతులు, విద్యార్థులతో సీఎం చంద్రబాబు



**కుప్పం :** ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ అందరూ అభివృద్ధిలో నెక్స్ట్ లెవెల్‌కు చేరుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. శనివారం కుప్పం పర్యటనలో భాగంగా శివపురంలోని స్వగృహం నుంచి పరమసముద్రం వరకు స్త్రీశక్తి బస్సులో 45 నిమిషాల పాటు ప్రయాణించిన సీఎం పలువురు మహిళలు, విద్యార్థులు, రైతులతో ముచ్చటించారు.

**కౌసల్య (విద్యార్థిని):** స్థానిక ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ చదువుతున్నా. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించాలన్నదే నా లక్ష్యం. ఉచితంగా పుస్తకాలు, ఏకరూప దుస్తులు, తల్లికి వందనం, స్త్రీశక్తి పథకాలను వినియోగించుకుంటున్నాను.

**సీఎం:** ఇంటర్‌లో మెరుగైన ఉత్తీర్ణత సాధనకు కడా ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటాం. బాగా చదువుకోవాలి. ఉజ్వల భవిష్యత్తును సాకారం చేసుకోవాలి.

**మణికంఠ (విద్యార్థి):** ఇంటర్ చదువుతున్నా. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధిస్తా. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు మా కుటుంబాన్ని ఆదుకుంటున్నాయి.

**సీఎం:** ఐఐటీలో ఇంజినీరింగ్ చదువు. భవిష్యత్తు బాగుంటుంది. విద్యార్థులు ఉత్తమ పౌరులుగా సమాజానికి ఆస్తిగా తయారుకావాలి.

**షబీహా (గృహిణి):** నాకు ఆరుగురు పిల్లలు. తల్లికి వందనం ద్వారా రూ. 78వేల సాయం అందింది.

**సీఎం:** బిడ్డలను బాగా చదివించాలి. విద్యతోనే పేదరికాన్ని జయించవచ్చు.

**కామాక్షి (కుటీర పరిశ్రమ నిర్వాహకురాలు):** ఎమ్మెస్సీ చదివాను. అగరుబత్తీల తయారీ యూనిట్‌ను ప్రారంభించి 20 మందికి ఉపాధి కల్పిస్తున్నాను.

**సీఎం:** మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి. అభివృద్ధిలో నెక్స్ట్ లెవెల్‌కు చేరుకోవాలి.

**సుగుణ (గృహిణి):** రైతుల నుంచి చిరుధాన్యాలను కొని విడిగా విక్రయించే యూనిట్ ఏర్పాటుచేస్తాను.

**సీఎం:** మహిళలు ఆర్థికాభివృద్ధితో కుటుంబాలకు చేదోడుగా నిలవాలి. ఎలీప్ సంస్థ ద్వారా ఉపాధి, శిక్షణ ఇతరత్రా తోడ్పాటును అందిస్తాం.

**వెంకటేష్, చంద్రమ్మ (రైతులు):** కృష్ణా జలాలతో వ్యవసాయానికి జీవం పోశారు. ఇప్పటిదాకా బోసిపోయిన చెరువు జలకళ సంతరించుకుంది. మాలాంటి రైతులకు సాగునీటి ఇబ్బంది ఉండదు. మీ మేలును తరతరాలు గుర్తుంచుకుంటాం.

**సీఎం:** కుప్పంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలన్న గొప్ప సంకల్పంతో హంద్రీ–నీవా జలాలను తీసుకొచ్చాం. పరమసముద్రం చెరువులో కృష్ణమ్మకు జలహారతి ఇవ్వడం జీవితాంతం గుర్తుండిపోతుంది.

## పింఛన్లకు రూ.2,746 కోట్ల విడుదల

**అమరావతి :** ఎన్టీఆర్ భరోసా పథకం కింద సెప్టెంబరుకు సంబంధించి 63.61 లక్షల మందికి సామాజిక భద్రత పింఛన్ల పంపిణీకి రూ. 2,746.52 కోట్లు విడుదల చేసినట్లు సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. కొత్తగా స్పౌజ్ కేటగిరీ కింద 7,872 మందికి పింఛన్లు మంజూరుచేశామని పేర్కొన్నారు. వీరికి నెలకు రూ. 4వేల చొప్పున పింఛను అందించేందుకు రూ. 3.15 కోట్లు విడుదల చేశామని చెప్పారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దనే పింఛన్లు పంపిణీ చేయడంతో పాటు పారదర్శకత కోసం జియో కోఆర్డినేట్స్ నమోదు చేస్తున్నామని వెల్లడించారు.

## భారత్-చైనా స్నేహగీతిక

(మొదటి పేజీ తరువాయి)

సంబంధాలు స్థిరంగా, నిలకడగా కొనసాగుతాయి. ఇరుగుపొరుగు దేశాలుగా మనం కలిసి ఉంటూ సామరస్యపూర్వక సంబంధాలు కొనసాగించుకోవాలి. డ్రాగన్, ఏనుగు కలిసి డ్యాన్స్ చేసేలా చూడాలి. అదే మనకు సరైన ఎంపిక అని జెన్ పింగ్ చెప్పారు. "భారత్–చైనా మధ్య దౌత్య సంబం ధాలు మొదలై 75 ఏళ్లు పూర్తవుతోంది. వ్యూహాత్మక, దీర్ఘకాల దృక్కోణంలో మనం ద్వైపాక్షిక బంధాలను సమీక్షించుకోవాలి. అప్పుడే అవి నిలకడగా పురోగమి స్తాయి. వర్ధమాన దేశాలుగా మానవ సమాజాభివృద్ధికి బాటలు వేద్దాం" అని మోదీతో జిన్సెంగ్ చెప్పారు. బహుళపక్షవాదాన్ని నిలబెడదామని పరోక్షంగా అమెరికా ఏకపక్ష విధానాన్ని తప్పుబట్టారు. భిన్నధ్రువ ప్రపం చాన్ని, అంతర్జాతీయ సంబంధాల్లో మరింత ప్రజాస్వా మ్యాన్ని తీసుకువచ్చేలా కలిసి పనిచేద్దామని పిలుపుని చ్చారు. ఆసియాలో, యావత్ ప్రపంచంలో శాంతి–సుసంపన్నతలకు మనవంతు చేయూత అందిద్దామ న్నారు. వందేళ్లకోసారి వచ్చే సమూల రూపాంతరీకర ణను ఇప్పుడు ప్రపంచం చూస్తోందని గుర్తుచేశారు.

## ఆ కళ్లు చూస్తున్నాయేమో గమనించండి

(మొదటి పేజీ తరువాయి)

రిఫ్లెక్షన్ కనిపిస్తుంటే అక్కడ కెమెరా ఉండే అవకాశముంది. మీరున్న గది నుంచి ఫోన్‌కాల్ చేయండి. అది తరచూ డ్రాప్ అవుతున్నా, మాట్లాడుతున్నప్పుడు ఏవైనా శబ్దాలు వచ్చినా ఆ గదిలో స్పై కెమెరాలున్నాయని అనుమానించాలి. స్మార్ట్ ఫోన్లలో హిడెన్ కెమెరా డిటెక్టర్ యాప్‌లు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. వాటిని ఉపయోగించి రహస్య కెమెరాలను కనిపెట్టొచ్చు. గదుల్లో అనుమానాస్పద వైర్లు, అసాధారణ పవర్ అవుట్‌లెట్లు గుర్తిస్తే వాటిని వెంటనే అన్‌ప్లగ్ చేయండి. వై–ఫై నెట్‌వర్క్ స్కానర్‌ను ఉపయోగించి యాక్టివ్ నెట్‌వర్క్‌ను గుర్తించాలి. రహస్య కెమెరాలను గుర్తించేందుకు రేడియో ఫ్రీక్వెన్సీ డిటెక్టర్లు ఇప్పుడు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. రూ. 2వేల నుంచి ఇవి లభిస్తున్నాయి. ఫిర్యాదు చేయాలనుకుంటే ఎక్కడైనా రహస్య కెమెరాలను గమనిస్తే వెంటనే సమీపంలోని పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేయొచ్చు. లేదా నేరుగా ఈ కింది నంబర్లకు మెసేజ్ లేదా కాల్ చేసి ఫిర్యాదు ఇవ్వొచ్చు. **ఆంధ్రప్రదేశ్ శక్తి టీమ్స్ వాట్సప్ నంబర్: 7993485111**
**తెలంగాణ రాష్ట్ర షీ టీమ్స్ వాట్సప్ నంబర్: 8712656858**

## బురద జల్లేందుకే జస్టిస్ ఘోష్ నివేదిక

(మొదటి పేజీ తరువాయి)

విచారణ జరపలేదని ఆరోపించారు. కమిషన్స్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ 1952 కింద తనకు, కేసీఆర్‌కు, ఇతరులకు సెక్షన్ 8బి కింద కమిషన్ నోటీసులు ఇవ్వలేదని కోర్టుకు వెళ్లామన్నారు. ఏ క్షణంలోనైనా స్టే వస్తుందని ఊహించే ఇప్పటికిప్పుడు నివేదికను పెట్టిందని విమర్శించారు.

**లోపం ఏర్పడకముందే ప్రచారం ప్రారంభించారు..**

"మేడిగడ్డ వద్ద లోపం ఏర్పడకముందే కాంగ్రెస్ పార్టీ ఆ ప్రాజెక్టుపై దుష్ప్రచారం ప్రారంభించింది. అధికారంలోకి రాగానే విచారణ జరుపుతామని ముందు నుంచే చెప్పింది. అందులో భాగంగా రాజకీయ కక్షకు దిగుతోంది. గతంలోనూ దేశంలో ఇందిరాగాంధీ, జయలలిత, ఎల్‌కే ఆడ్వాణీ తదితర కేసుల్లో సెక్షన్ 8బి కింద నోటీసులు ఇవ్వలేదని కోర్టు కొట్టివేసింది. కమిషన్ నివేదిక కోర్టు ముందు నిలబడదు. తొలుత తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత కట్టాలని అన్ని ప్రయత్నాలు చేశాం. అందుకే 8 నెలల్లో రూ. 6,100 కోట్లు ఖర్చు చేశాం. తుమ్మిడిహెట్టి వద్ద నీళ్లు లేవని కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) 2015 ఫిబ్రవరి 18న చెప్పింది. నేను మంత్రిగా మహారాష్ట్ర వెళ్లాను. అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వమే అక్కడుంది. 152 మీటర్లకు అనుమతి ఇవ్వాలని అడిగినా వారు అంగీకరించలేదు. కొత్తగా భాజపా ప్రభుత్వం ఏర్పడితే వెళ్లి అడిగినా కుదరదన్నారు.. స్వయంగా కేసీఆర్ కూడా మహారాష్ట్ర వెళ్లారు. మహారాష్ట్ర అభ్యంతరం.. నీరు లేమి... తదితర కారణాలతో స్థలం మార్చాం. మంత్రి పొంగులేటి చెబుతున్నట్లు ఇది 25 రోజుల్లో తీసుకున్న నిర్ణయం కాదు. స్థలం మార్చినప్పుడు మంత్రి జూపల్లి కూడా క్యాబినెట్‌లో ఉన్నారు. మేడిగడ్డ వద్ద అదనంగా నీళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయని జూపల్లి ప్రశ్నిస్తున్నారు. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు... 116 కి.మీ దూరముంది. పలు వాగుల నుంచి వచ్చి నీళ్లు కలుస్తాయి.

**మసిపూసి మారేడుకాయ చేయడంలో సీఎం సిద్ధహస్తులు..**

మసిపూసి మారేడుకాయ చేయడంలో సీఎం సిద్ధహస్తులు. కేంద్ర ప్రభుత్వం రాసిన లేఖలో సీఎం పేజీ 1 మాత్రమే చదివారు. నేను 3వ పేజీ చదువుతా. మూడో పేజీ చదవలేదు కాబట్టే కమిషన్ తప్పుడు నివేదిక ఇచ్చింది. తప్పుడు ప్రచారం చేస్తున్నందుకు సీఎం క్షమాపణ చెప్పాలి. కేంద్ర మంత్రి రాసిన లేఖలో 2004 నాటి వరకు మాత్రమే జలాల సమాచారం ఉందని, 2013 వరకు పంపాలన్నారు. దాన్ని పంపాం. మళ్లీ 2015 మార్చిలో సీడబ్ల్యూసీ లేఖ రాసింది. తుమ్మిడిహెట్టి వద్ద 165 టీఎంసీల నీటిలో పై రాష్ట్రాలు 65 టీఎంసీలు వాడుకుంటాయి. అందువల్ల అక్కడ తెలంగాణకు తక్కువ నీరుంటుందని చెప్పింది. దానికితోడు అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌కు కూడా మహారాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. 152 మీటర్లకు ఒప్పుకోబోమని చెప్పింది.

**నీళ్లు లేకే మార్చారని నిపుణులు చెప్పారు..**

విశ్రాంత ఇంజినీర్లు ఇచ్చిన నివేదికను తొక్కిపెట్టారని ఆరోపిస్తున్నారు. కమిషన్ ముందు వారు నాపై ఆరోపణలు చేశారని చెబుతున్న దాంట్లో వాస్తవం లేదు. వారు కమిషన్‌కు రాత పూర్వకంగా చెప్పిన దాన్ని నేను తెప్పించాను. నీళ్లు లేకపోవడం వల్లే మార్చారని నిపుణుల కమిటీ కమిషన్‌కు చెప్పింది. 2007, 08లో తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణం కోసం 28 ప్యాకేజీలుగా టెండర్లు పిలిచారు. 2010లో డీపీఆర్ వచ్చింది. మహారాష్ట్ర అనుమతి లేదు. సీడబ్ల్యూసీ అనుమతులు లేవు కదా? అయినా మీరు ఎలా టెండర్లు పిలిచారు.

# చౌకబియ్యం దందాపై విచారణకు 'ద్వారం' మూసేశారా?

- వైకాపా ప్రభుత్వంలో రేషన్ మాఫియా సూత్రధారి
- అడ్డూఅదుపూ లేకుండా దందా.. విదేశాలకు ఎగుమతులు
- సిట్ ఏర్పాటు చేసి ఆరు నెలలైనా సాగని విచారణ
- చంద్రబాబును, పవన్‌ను తిట్టి.. జనసైనికుల్ని చితకబాదిన ఆయన అనుచరులు
- కూటమి ప్రభుత్వంలోనూ కొందరు నేతల సహకారం!



**కాకినాడ :** వైకాపా హయాంలో ఆయన ప్రభుత్వాధినేత అండతో రెచ్చిపోయారు. రేషన్ బియ్యం మాఫియాను మొత్తం నడిపించారు. 'నా దారి రహదారి' అన్నట్లు చౌకబియ్యం దొంగతనంగా తరలించే వాహనాలను ఎవరూ అడ్డుకోకుండా పైస్థాయి నుంచి ఆదేశాలు ఇప్పించుకున్నారు. వేల లారీల బియ్యాన్ని తెచ్చి, విదేశాలకు ఎగుమతి చేసి రూ.కోట్లు వెనకేసుకున్నారు. అంతటితో ఆగకుండా భూఆక్రమణలు, దందాలకూ దిగారు. ప్రశ్నించినవారిని బెదిరించడం.. ఫిర్యాదు ఇస్తే వేధించడం ఆయన స్టైల్! అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబును, జనసేనాని పవన్ కల్యాణ్‌ను నోటికొచ్చినట్లు తిట్టారు. ఆయన అనుచరులు పవన్ అభిమానుల్ని, జనసేన కార్యకర్తల్ని వెంటబడి మరీ కర్రలతో చితకబాదారు. ప్రభుత్వ పెద్దల అండదండలున్న ఆ ఇంటి 'ద్వారం' వైపు కన్నెత్తి చూడాలన్నా అప్పటి అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం వణికిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చింది.. ఆధారాలతో ఆయన దందాలూ బయటికొచ్చాయి. ఇంకేముంది ఆయనకు అరదండాలు తప్పవని రాష్ట్రమంతా అనుకున్నారు. సర్కారు కొలువుదీరి ఏడాది గడిచినా ఆయనపై చర్యలు తీసుకోవడం కాదు కదా.. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఆ 'ద్వారం'లోకి అడుగు కూడా పెట్టలేకపోయింది. పౌరసరఫరాలశాఖ మంత్రి సహా ఇతర ముఖ్యులూ సీరియస్‌గా తీసుకోకపోవడం, కూటమి ప్రభుత్వంలోనూ కొందరు నేతలు ఆయన్ను కాపాడటమే ఇందుకు కారణమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వంలో రేషన్ బియ్యం మాఫియాకు కీలకసూత్రధారి, పాత్రధారీ ఆయనే. రేషన్ బియ్యం లారీలకు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ ముఠా స్లిప్ చూపిస్తే ఏ అధికారీ లారీ ఆపే సాహసం చేయరు. వేల కొద్దీ లారీల్లో చౌకబియ్యం తరలించారు. పౌరసరఫరాలశాఖ కీలక పదవుల్లోనూ ఆయన కుటుంబసభ్యుల్నే నియమించారు. బియ్యం ఎగుమతుల వ్యాపారంలోనూ వారే. ఎండీయూ ఆపరేటర్లు, వీధివ్యాపారుల ద్వారా రేషన్ బియ్యాన్ని సేకరించి, పాలిష్ చేసి విదేశాలకు ఎగుమతి చేశారు. దీనికోసం పోర్టు పరిధిలోనే గోదాములు తెరిచారు. పోర్టు అధికారి నుంచి కస్టమ్స్ అధికారుల వరకు అందరినీ గుప్పిట పెట్టుకుని వ్యవహారం నడిపించారు. మరో ఇద్దరు ఎగుమతిదారులు ఈయనతో జట్టుకట్టి, రేషన్ బియ్యం అక్రమ రవాణా మూడు కంటెయినర్లు.. ఆరు షిప్‌లుగా నడిపించి రూ.వేల కోట్లకు పడగలెత్తారు.

### 25 వేల టన్నులు పట్టుబడినా..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఆయన దందా ఆగలేదు. గత ఏడాది జూన్‌లో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడ పోర్టు, పరిసర ప్రాంతాల్లోని గోదాముల్లో తనిఖీలు నిర్వహించారు. 13 గోదాముల్లో 49,546 టన్నుల బియ్యాన్ని సీజ్ చేశారు. వీటిలోని 25,386 టన్నుల బియ్యంలో ఫోర్టిఫైడ్ కెర్నల్స్ ఉన్నాయని, ఇవి రేషన్ బియ్యమేనని నిగ్గు తేల్చారు. వీటి విలువ రూ. 83.78 కోట్లని లెక్కగట్టారు. 13 మంది గోదాముల యజమానులపై 6ఏతో పాటు క్రిమినల్ కేసులూ నమోదు చేశారు. కొద్దిరోజుల తర్వాత సీజ్ చేసిన బియ్యం పాడైపోతున్నాయని గోదాముల యజమానులు కోర్టుకెళ్లారు. బ్యాంకు గ్యారంటీలిచ్చి, విడుదల చేయించుకున్నారు.

### 'సీజ్ ద షిప్' ఏమైంది?

నిరుడు డిసెంబరులో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పోర్టులో పీడీఎస్ బియ్యం ఎగుమతులపై తనిఖీలు నిర్వహించారు. 'సీజ్ ది షిప్' అన్న ఆయన ఆదేశాలూ దేశవ్యాప్తంగా వైరలయ్యాయి. కానీ ఆ కేసుల విచారణ ఒక్క అడుగు ముందుకు పడకపోవడం తీవ్ర విమర్శల పాలవుతోంది.


### దందా విశాఖకు మార్చారు

నాలుగుసార్లు సిట్‌లో మార్పుచేర్పులు చేయడమే తప్ప పీడీఎస్ బియ్యం కేసుపై ఈ బృందం ఒక్కసారి కూడా విచారణ చేసిన పాపాన పోలేదు. ఇదే అదనుగా రేషన్ మాఫియా రెచ్చిపోతుంది. గత ప్రభుత్వంలో చక్రం తిప్పినవారే తాజాగా పేదల బియ్యం పక్కదారి పట్టిస్తున్నారు. కాకినాడ పోర్టుకు కాకుండా విశాఖ పోర్టుకు తరలిస్తూ తమ అక్రమ వ్యాపారానికి అడ్డుపడేదెవరంటూ సవాల్ విసురుతున్నారు.

### సిట్ ఎన్నిసార్లు సవరిస్తారో?

డిసెంబరు 6న.. పేదల బియ్యం అక్రమ రవాణాపై నమోదయిన కేసుల విచారణకు వినీత్ బ్రిజ్‌లాల్ అధ్యక్షతన ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. అదే నెలాఖరున సిట్‌లో పోలీస్ అధికారుల స్థానంలో పలు శాఖల జిల్లా అధికారులను తీసుకువచ్చి మరో జీవో ఇచ్చారు. వినీత్ బ్రిజ్‌లాల్ స్థానంలో ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణకు బాధ్యతలు అప్పగిస్తూ ఈ ఏడాది మే 7న మరో సవరణ చేశారు. తాజాగా ఈ నెల సిట్‌లోకి అదనంగా 10 మంది సీఐడీ పోలీసు బృందాన్ని తీసుకొచ్చారు.

## మీ బోర్డర్ దాటి వస్తున్న పాక్ టెర్రరిస్టుల సంగతేంటి?



**న్యూఢిల్లీ :** షాంఘై సహకార సంస్థ సదస్సులో భాగంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ పలు ద్వైపాక్షిక అంశాలను చర్చించారు. ఇందులో చైనా సరిహద్దుల నుంచి భారత్‌లోకి చొరబడుతున్న పాక్ టెర్రరిస్టుల అంశాన్ని కూడా ప్రధాని మోదీ.. జిన్‌పింగ్ వద్ద ప్రస్తావించారు. అయితే దీనికి చైనా తన సంపూర్ణ మద్దతును భారత్‌కు ఇస్తున్నట్లు స్పష్టం? చేసింది. ఈ విషయాన్ని భారత విదేశాంగ సెక్రటరీ విక్రమ్ మిస్రీ వెల్లడించారు. 'జిన్‌పింగ్ వద్ద పాక్ ఉగ్రవాద కార్యకలాపాలను కూడా మోదీ ప్రస్తావించారు. ఇందుకు చైనా సానుకూలంగా స్పందించింది. టెర్రర్ కార్యకలాపాల వ్యతిరేకంగా భారత్ చేస్తున్న పోరాటానికి మద్దతు ఇస్తామని జిన్‌పింగ్ అన్నారు. ఎటువంటి ఉగ్రవాద చర్యల నిర్మూలనకైనా తమ మద్దతు ఉంటుందని జిన్‌పింగ్ అన్నారు. ఇరుదేశాలకు ప్రమాదంగా మారిన ఉగ్రవాద అంశాన్ని జిన్‌పింగ్ కూడా తీవ్రంగానే పరిగణిస్తున్నారు. ఉగ్రవాద నిర్మూలనకు భారత్‌కు తమ వంతు సహకారం అందిస్తామన్నారు' అని విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు. టియాంజిన్ నగరంలో ఎస్‌సీవో సదస్సులో పాల్గొన్న మోదీ.. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ప్రాంతీయ శాంతి, ఆర్థిక స్థిరత్వం, సరిహద్దు ఉద్రిక్తతల తగ్గింపు, సాంకేతిక రంగాల్లో సహకారం పెంచుకునే వంటి అంశాలపై చర్చలు జరిగాయి. వాణిజ్య, టెక్నాలజీ, రక్షణ రంగాల్లో ఒప్పందాలు చేసుకునే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. భారత్-చైనా మధ్య స్థిరమైన, స్నేహపూర్వక సంబంధాలు ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి, శ్రేయస్సుపై సానుకూల ప్రభావం చూపుతాయి అని ప్రధాని మోదీ తెలపడంతో ఇరు దేశాల సంబంధాలు బలోపేతం కావడానికి అడుగులు పడ్డాయి. ఈ పర్యటన ద్వారా భారత్ తన ప్రాంతీయ ప్రాబల్యాన్ని చాటింది. ఇది భారత్-చైనా సంబంధాల్లో కొత్త అధ్యాయానికి నాంది పలికే అవకాశం ఉంది.

## ప్రతిభా సేతు: 'మన్ కీ బాత్'లో 'యూపీఎస్‌సీ' పోర్టల్‌కు ప్రధాని కితాబు



**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన నెలవారీ రేడియో ప్రసంగం 'మన్ కీ బాత్' 125వ ఎపిసోడ్‌లో యూపీఎస్‌సీ పోర్టల్ 'ప్రతిభా సేతు'ను ప్రశంసించారు, యూపీఎస్‌సీ అభ్యర్థులకు ఇది ఆశాదీపం అని అభివర్ణించారు. వేలాది మంది యూపీఎస్‌సీ అభ్యర్థులకు సహాయపడుతున్న 'ప్రతిభా సేతు' చొరవను ప్రతిభకు వారధిగా మోదీ పేర్కొన్నారు. యూపీఎస్‌సీ పరీక్షలలోని అన్ని దశలలో ఉత్తీర్ణులై, తుది మెరిట్ జాబితాలో చోటు దక్కించుకోలేకపోయిన అభ్యర్థులకు 'ప్రతిభా సేతు' తగిన వేదిక అని అన్నారు. ఈ పోర్టల్ యూపీఎస్‌సీలోని వివిధ పరీక్షల అన్ని దశలలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల డేటాను స్టోర్ చేస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల యజమాన్యాలు ప్రతిభా సేతు పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చు. అప్పుడు వారు అభ్యర్థుల డేటాబేస్‌ను యాక్సెస్ చేయడానికి అవకాశం ఉంటుంది. ఇది అభ్యర్థుల నియామకానికి ఉపయోగపడుతుంది.

## ఏఎఫ్‌డీతో ఎస్‌బీఐ ఒప్పందం: ఎందుకంటే?




**న్యూఢిల్లీ :** పర్యావరణహిత ప్రాజెక్టులకు రుణాలందించే దిశగా ప్రభుత్వ రంగ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), గుజరాత్ గిఫ్ట్ సిటీలోని 'ఏజెన్సీ ఫ్రాంకైస్ డి డెవలప్‌మెంట్' (ఏఎఫ్‌డీ)తో 100 మిలియన్ యూరోల లైన్ ఆఫ్ క్రెడిట్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. కాలుష్యకారక ఉద్గారాలను, గ్లోబల్ వార్మింగ్‌ను, వాతావరణంపై ప్రతికూల ప్రభావాలను తగ్గించే దిశగా ఈ నిధులను వినియోగించనున్నట్లు పేర్కొంది. 2030 నాటికి మొత్తం రుణాల పోర్ట్‌ఫోలియోలో గ్రీన్ ఫైనాన్సింగ్ విభాగం వాటాను 7.5-10 శాతానికి పెంచుకోవాలన్న లక్ష్యానికి ఇది దోహదపడు తుందని ఎస్‌బీఐ తెలిపింది.

## రాహుల్ వ్యాఖ్యలపై నిరసనలు తెలపాలి

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



**అమరావతి :** ప్రధాని నరేంద్రమోదీ తల్లిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలపై సోమవారం మహిళా మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలియజేయాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మలు దహనం చేయడంతో పాటు ఆయన వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులివ్వాలని పేర్కొన్నారు. భాజపా నేతలతో ఆదివారం నిర్వహించిన ఆడియో కాన్ఫరెన్స్‌లో ఈ మేరకు ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళామోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిషీధ రాజు మాట్లాడారు.

## ఫోన్ వేడెక్కుతోందా.. స్పీడ్ తగ్గిందా: కారణం ఇదే కావొచ్చు




**హైదరాబాద్:** టెక్నాలజీ పెరుగుతున్న సమయంలో.. సైబర్ నేరగాళ్లు ఎక్కువవుతున్నారు. మొబైల్స్ హ్యాక్ చేసి డబ్బు దోచేస్తున్నారు. ఫోన్‌లో మాల్‌వేర్స్ ఉపయోగించి కొందరు మీ బ్యాంక్ ఖాతాను ఖాళీ చేయవచ్చు. అయితే మీ ఫోన్‌లో మాల్‌వేర్స్ ఉన్నాయా?, లేదా? అని ఎలా తెలుసుకోవాలో ఇక్కడ చూసేద్దాం..

**కంటిన్యూస్ పాప్ అప్ యాడ్స్:** మీరు ఉపయోగించే ఫోన్‌లో మాల్‌వేర్స్ ఉంటే.. పాప్ అప్ యాడ్స్ ఎక్కువగా వస్తుంటాయి. అలాంటి యాడ్స్ మీద క్లిక్ చేస్తే.. డబ్బు పోగొట్టుకోవడం ఖాయం. కొన్ని ప్రమాదకర యాప్‌ల విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే ఇవి మీకు సంబంధించిన వ్యక్తిగత సమాచారం కూడా లీక్ చేస్తాయి.

**బ్యాటరీ ఛార్జ్ త్వరగా అయిపోతుంది:** మీ ఫోన్‌లో మాల్‌వేర్స్ ఉంటే.. బ్యాటరీ ఛార్జ్ కూడా త్వరగా అయిపోతుంది. దీనికి కారణం మీకు తెలియకుండా మీ ఫోన్‌ను (బ్యాక్ గ్రౌండ్) ఇతరులు హ్యాండిల్ చేతుంటారన్న మాట. దీంతో ఛార్జింగ్ కూడా వేగంగా తగ్గిపోతుంది.


**ఫోన్ స్పీడ్ తగ్గుతుంది:** మాల్‌వేర్స్ కారణంగా ఫోన్ వేగం తగ్గుతుంది. దీంతో చిన్న చిన్న పనులు చేయడానికి కూడా మొబైల్ సహకరించదు. కొన్నిసార్లు యాప్‌లు కూడా మాల్‌వేర్స్ కారణంగా క్రాష్ కావచ్చు.

**ఫోన్ వేడెక్కుతోంది:** మాల్‌వేర్స్ మీ ఫోన్‌లో ఉన్నట్లయితే.. మొబైల్ చాలా వేడెక్కుతుంది. కొన్నిసార్లు ఇంటర్నల్ సీపీయూపై ఎక్కువ లోడ్ పెంచుతుంది. లోపి అనే మాల్‌వేర్స్ ఫోన్‌ను వేడెక్కేలా చేస్తుంది. కాబట్టి ఏమీ చేయకుండానే ఫోన్ వేడెక్కుతుంటే.. కొంత సమయం పాటు దాన్ని ఆఫ్ చేయడం మంచిది.

**మాల్‌వేర్‌ను ఎలా తొలగించాలి:** ఫోన్ నుంచి మాల్‌వేర్‌ను తొలగించడానికి కొన్ని సులభమైన మార్గాలు ఉన్నాయి. ఇందులో ఒకటి సేఫ్ మోడ్‌ను ప్రారంభించడం. ఆండ్రాయిడ్ ఫోన్‌లో సేఫ్ మోడ్‌ను ప్రారంభించడం ద్వారా, ఇది థర్డ్ పార్టీ యాప్‌లను నిలిపివేస్తుంది. దీనితో పాటు యాంటీ వైరస్ సహాయంతో ఫోన్‌ను స్కాన్ చేయడం ద్వారా కూడా మాల్‌వేర్‌ను గుర్తించవచ్చు. ఇవన్నీ పనిచేయకపోతే.. ఫోన్‌ను రీసెట్ చేసుకోవాలి. రీసెట్ చేయడానికి ముందు.. మీకు అవసరమైన డేటాను బ్యాకప్ తీసుకోవడం మర్చిపోవద్దు.

## పోలవరం పనుల తీరుపై సంతృప్తి

ముగిసిన విదేశీ నిపుణుల బృందం సమీక్ష




అమరావతి : పోలవరం ప్రాజెక్టులో బట్రస్ డ్యాం, డయాఫ్రం వాల్ పనులు సంతృప్తికరంగా ఉన్నాయని విదేశీ నిపుణుల బృందం వ్యాఖ్యానించింది. వానాకాలంలో పనులు బాగా చేశారని ప్రశంసించింది. 'నాలుగో పర్యటన సమయంలో డ్యాం నిర్మాణ ప్రాంతంలో అంతా సీపేజీ నీరే ఉంది. రెండు నెలల్లో ఆ నీరంతా తోడి, నిర్మాణ క్షేత్రాన్ని సరైన స్థితిలోకి తీసుకువచ్చి పనులు చేయగలుగుతారని మేం భావించలేదు. అందుకు విరుద్ధంగా అంతా చక్కగా చేశారు. పనులు సంతృప్తికరంగా ఉన్నాయి. ఇలాగే సాగితే మార్చి నాటికి డయాఫ్రం వాల్ పనులు పూర్తిచేయడం సులభమే' అని విదేశీ నిపుణులు పేర్కొన్నారు. బట్రస్ డ్యాం నిర్మించాలని విదేశీ నిపుణుల బృందం ఇచ్చిన సలహా తమకు ఎంతో ఉపయోగపడిందని, అందువల్లే వానాకాలంలో, వరద సీజన్‌లో ఎలాంటి సమస్య రాకుండా పనులు చేయగలిగామని పోలవరం అధికారులు ఆ బృందానికి తెలియజేశారు. విదేశీ నిపుణుల బృందం మూడోరోజు సమీక్ష రాజమహేంద్రవరంలో నిర్వహించారు. మూడోపక్ష ల్యాబ్ కూడా చక్కగా ఏర్పాటుచేశారని, అందులో పరికరాలు బాగున్నాయని ఆ బృందం పేర్కొంది. ఈ సమావేశంలో నిపుణులు డిసిస్కో, రిచర్డ్ డొన్నెల్లీ, డేవిడ్ పాల్‌లు పాల్గొన్నారు. వీరితో పాటు పోలవరం అథారిటీ కార్యదర్శి రఘురామ్, కేంద్ర జలశక్తి శాఖ డిప్యూటీ కమిషనర్ గౌరవ్ సింఘాల్, కేంద్ర జలసంఘం సీఈ బక్షి, మరో సీఈ రమేష్‌బాబు, ఈఎన్‌సీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### డీప్ సాయిల్ మిక్సింగ్ మెథడాలజీకి ఓకే

పోలవరం ప్రాజెక్టులో భారీ వరదల వల్ల నేల స్వభావం మారిపోయింది. అక్కడ డీప్ సాయిల్ మిక్సింగ్ చేయాలి. ఆ మెథడాలజీకి విదేశీ నిపుణుల బృందం సూత్రప్రాయంగా ఆమోదం తెలియజేసింది. అయితే మరో విధానాన్ని కూడా ఒక నిపుణుడు ప్రతిపాదించి అందులోని లాభనష్టాలు అధ్యయనం చేయాలని పేర్కొన్నారు. దాదాపు 550 మీటర్ల మేర డీప్ సాయిల్ మిక్సింగ్ చేయాల్సి ఉంటుంది. 12 నుంచి 16 మీటర్ల లోతు వరకు చేయాలి. వైబ్రో కాంపాక్షన్ పనులకు సంబంధించి తిరుపతి ఐఐటీ చేసిన అన్ని పరీక్షల ఫలితాలు సమర్పించారు. తాము అధ్యయనం చేసిన తర్వాత అభిప్రాయాలు తెలియజేస్తామని విదేశీ నిపుణులు పేర్కొన్నారు.

## హృదయం విరిగితే అతికించలేం గానీ నయం చేయొచ్చు..!



**హైదరాబాద్ :** ప్రేమ విఫలం లేదా మనం ఎంతగానో ఆరాధించే వ్యక్తి దూరమవ్వడం, లేదా నమ్మకద్రోహం వంటి వాటి వల్ల హృదయం ముక్కలైపోతుంది. అది సర్వసాధారణంగా అందరికీ ఎదురయ్యే సమస్యే. అయితే కొందరు గుండెను రాయి చేసుకుని ధైర్యంగా లైఫ్‌ని లీడ్ చేస్తే..మరికొందరు అంత తేలిగ్గా ఆ సమస్య నుంచి బయటపడరు. పైగా గుండె బలహీనమైపోయి..తాత్కాలికి గుండె సంబంధిత అనారోగ్య సమస్యల బారిన పడతారు. దీన్ని వైద్య పరిభాషలో టాకోట్సుబో కార్డియోమయోపతి లేదా "బ్రోకెన్ హార్ట్ సిండ్రోమ్"గా వ్యవహరిస్తారు. అయితే అలా ముక్కలైన హృదయాన్ని బాగు చేసుకుని, ఆరోగ్యవంతంగా మార్చుకోవచ్చట. పరిశోధకులు జరిపిన తాజా అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. అసలేం జరిగిందంటే..ప్రపంచంలో లక్షలాది మంది ఈ టాకోట్సుబో కార్డియోమయోపతి సమస్యతో బాధపడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. దీని కారణంగా అకస్మాత్తుగా గుండె కండరాలు బహీనపడిపోయి గుండెపోటు లక్షణాలు తలెత్తుతాయట. చెప్పాలంటే మరణ ప్రమాదానికి చేరవయ్యే ప్రమాదం ఎక్కువ అవ్వుతుందట. ఇలాంటి తాత్కాలిక గుండెపోటు ప్రమాదాల నుంచి కోలుకోవడం అంత ఈజీ కాదంటున్నారు మాడ్రిడ్ పరిశోధకులు. ఒక్కోసారి ఏళ్లకు ఏళ్ల సమయం పడుతుందని చెబుతున్నారు. ఆ నేపథ్యంలోనే ఇలాంటి గుండెపోటు సిండ్రోమ్‌ని నివారించే దిశగా అధ్యయనాలు చేయగా, వ్యాయామమే చక్కటి నివారణ అని తేలిందన్నారు. గుండె ఆరోగ్యాన్ని మెరుగ్గా ఉంచే వ్యాయామలు, థెరపీలు ఆయా రోగులకు అందివ్వగా మెరుగైన ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు. అందుకోసం దాదాపు 76 మంది రోగులపై అధ్యయనం చేసినట్లు వెల్లడించారు. వారిలో 66 ఏళ్లు పైబడ్డ మహిళలు కూడా ఉన్నారని తెలిపారు. వారందరిని రెండు సముహాలుగా విభజించారు. ఒక సముహం సాధారణ వ్యాయామాలు, వాకింగ్ చేయగా, మరొక సముహానికి కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ ఇచ్చారు. ఈ థెరపీలో భాగంగా ఆయా వ్యక్తులకు 12టు 1 సెషన్‌లో జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను ఎలాహ్యాండిల్ చేయాలి, అవన్నీ జీవితంలో ఏ విధంగాభాగం తదితరాలపై శిక్షణ ఇస్తారు. ఇలా మొత్తం 12 వారాలు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఇక వ్యాయామాల్లో భాగంగా, స్విమ్మింగ్, సైక్లింగ్, ఏరోబిక్స్‌తో కూడిన వ్యాయామాలను 12 వారాలు తర్ఫీదుని మిగతా సగంమందికి ఇచ్చామని చెప్పారు. ఫలితంగా వారందరీ గుండె పనితీరు మెరుగ్గా ఉండటమే గాక గుండె సంబంధిత ప్రమాదాలు తగ్గినట్లు గుర్తించామని అన్నారు. అంతేగాదు వారందరిలోనూ ఆక్సిజన్ వినియోగించే సామర్థ్యాన్ని మెరుగుపరచారని చెప్పారు. ఇలాంటి తాత్కాలిక గుండె సంబంధిత సమస్యలను కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ లేదా వ్యాయామాలతో నయం చేయగలవని అన్నారు. లక్షల్లో డబ్బులు ఖర్చు పెట్టకుండా కొద్దిపాటి జీవన శైలి మార్పులు, శారీరక శ్రమతో కామన్ మ్యాన్ కూడా ఇలాంటి అనారోగ్య సమస్యల నుంచి సులభంగా బయటపడగలరని అన్నారు. ఈ పరిశోధన మరిన్ని వ్యాధులకు సంబంధించిన అధ్యయనంలో మార్గదర్శకంగా ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు కార్డియాలజీ పరిశోధకులు.

## స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉద్యమ కార్యాచరణ: బొత్స



**విశాఖపట్నం :** స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ త్వరలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. విశాఖలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇతర పార్టీల నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబూరావు, ఎమ్మెల్సీ కె.రవిబాబు, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ప్రభుత్వ విద్యా ప్రయాణం ఎటువైపు?



విద్య అనేది జీవితాన్ని వెలిగించే అఖండ జ్యోతి. అది కేవలం అక్షరాస్యతకే పరిమితం కాకుండా, మన ఆలోచన శక్తిని, వివేకాన్ని, సృజనాత్మకతను వికసింపజేస్తుంది. విద్య ద్వారా మనిషి తన హక్కులు, కర్తవ్యాలు తెలుసుకుని, సమాజంలో సద్భావన, సమానత్వం, పురోగతిని సాధించగలడు. ఇది వ్యక్తిగత విజయానికి పునాది మాత్రమే కాక, దేశ అభివృద్ధికి కీలకమైన శక్తి. ఇంత ముఖ్యమైన విద్యా వ్యవస్థ తెలంగాణ రాష్ట్రంలో ఎలా ఉంది? తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తి 2014-15లో ప్రాథమిక పాఠశాలలో 24:1గా, ప్రాథమికోన్నత పాఠశాలలో 21:1గా, ఉన్నత పాఠశాలల్లో 39:1గా ఉంది. 2023-24 నాటికి ప్రాథమిక పాఠశాలలో 21:1గా ప్రాథమికోన్నత పాఠశాలలో 16:1గా, ఉన్నత పాఠశాలలో 22:1గా నమోదు అయ్యింది. విద్యార్థి ఉపాధ్యాయుల నిష్పత్తి కావలసిన దాని కంటే ఎక్కువగానే ఉన్నట్లు ఈ గణాంకాలు బట్టి తెలుస్తుంది.

**ఇంగ్లిష్ మీడియం ప్రభావంతో..**

2014-15లో రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలలు 12,212 ఉండగా 32. 71లక్షల మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. 2023-24 నాటికి ప్రభుత్వ పాఠ శాలలు 30,022కి పెరగగా విద్యార్థుల సంఖ్య మాత్రం 27. 79 లక్షలకు తగ్గింది. ప్రైవేట్ పాఠశాలల సంఖ్య సుమారు 12,126గా ఉండగా విద్యార్థుల సంఖ్య 44. 31 లక్షలకు పెరిగింది. ప్రభుత్వ పాఠశాలలు నామమాత్రంగా పెరిగినా విద్యార్థుల నమోదు మాత్రం తగ్గిందని, ప్రైవేట్ పాఠశాలలు యథావిధిగానే ఉన్న విద్యార్థుల నమోదు బాగా పెరిగిందని తెలుస్తుంది. ఇంగ్లిష్‌ను బోధనా భాషగా 2022-23 నుంచి 1-8 తరగతుల్లో దశల వారీగా ప్రవేశ పెట్టారు. 2024-25 నాటికి 10వ తరగతి వరకు విస్తరించేలా ఏర్పాటు చేశారు. దీంతో 2022-23 తర్వాత చాలా జిల్లాల్లో 10-15% వరకు విద్యార్థుల చేరికలు పెరిగినట్లు తెలుస్తోంది. కానీ ఆ మేరకు విద్యార్థులు తెలుగు మీడియంలో తగ్గారు.

**ప్రైవేట్ పాఠశాలల పెరగకున్నా..**

అంతర్జాతీయ ప్రమాణం ప్రకారం విద్య కోసం GDPలో 6%, బడ్జెట్‌లో 15-20% కేటాయించమని సూచిస్తుంది. కొఠారీ కమిషన్, నూతన విద్యా విధానం-2020 జీడీపీలో విద్యకు కనీసంగా 6% ఖర్చు చేయాలని సిఫార్సు చేసింది. కానీ కేంద్రం 2025-2026 సం.లో 2. 54 శాతం నిధులు మాత్రమే కేటాయించింది. తెలంగాణ రాష్ట్రం 2025-26 బడ్జెట్‌లో 9. 0%కి పెరిగింది. అయినప్పటికీ ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఈ కేటాయింపులు చాలా తక్కువ. తెలంగాణ వంటి రాష్ట్రాలు కనీసం 15% రాష్ట్ర బడ్జెట్ విద్యకు కేటాయించాలి. అందులో 50% ప్రాథమిక & సెకండరీ విద్యకు, 25% ఉన్నత విద్యకు, 25% వృత్తి, డిజిటల్ & ఉపాధి ఆధారిత శిక్షణకు కేటాయించాలి. తెలంగాణ రాష్ట్రంలో గత పది సంవత్సరాలుగా గురుకుల పాఠశాల సంఖ్య పెరిగిన ప్పటికీ, ప్రభుత్వ పాఠశాలల సంఖ్య నామమాత్రంగానే పెరిగింది. విద్యార్థుల నమోదు తక్కువగా ఉంది. ప్రైవేటు పాఠశాలల సంఖ్య పెరిగినప్పటికీ నమోదు మాత్రం ఎక్కువగా ఉంటోంది. దీనిని బట్టి విద్య సంపూర్ణ ప్రైవేటైజేషన్ వైపు ప్రయాణిస్తున్నట్లు తెలుస్తోంది.

**నూతన మార్పుల కారణంగా..**

విద్యార్థి ఉపాధ్యాయుల నిష్పత్తి సానుకూలంగా ఉన్నప్పటికీ సబ్జెక్ట్ టీచర్లకు కొరత ఉన్నట్లు తెలుస్తుంది. దీనిపై ఎన్ని కమిషన్లు సిఫారసు చేసినప్పటికీ ప్రభుత్వాలు విద్యపై పెట్టే ఖర్చు ఆశించిన స్థాయిలో ఉండకపోవడం ఆందోళన కలిగిస్తుంది. ఇక విద్యార్థుల సామర్థ్యాలు కూడా ఆశించిన స్థాయిలో పెరగకపోవడం, ప్రభుత్వ పాఠశాలలో ఒక ప్రధానమైన లోటుగా గోచరిస్తుంది. ఈ మధ్య కాలంలో విద్యకు కేటాయిస్తున్న బడ్జెట్ పెరుగుతుండడం, ఉపాధ్యాయుల భర్తీ, ప్రమోషన్ల ద్వారా సబ్జెక్ట్ టీచర్ల కొరత తీరుతుండడం, ఆశించదగ్గ పరిణామం. ప్రీ ప్రైమరీ క్లాసెస్ ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభం, ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా స్కూల్స్ ప్రణాళిక, ఎన్జీవో/ఈ టెక్ భాగస్వామ్యంతో ఖాన్ అకాడమీ, ఫిజికల్ వాళ్ల ప్రవేశం, ఏఐ ఆధారిత బోధన విస్తరణ, కొత్తగా 570 పాఠశాలల ప్రారంభం, ప్రతి జిల్లాలో ఇంటర్నేషనల్ స్టాండర్డ్ స్కూల్, ప్రయోగాత్మకంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు తదితర ఏర్పాట్లు విద్యా వ్యవస్థలో నూతనంగా వస్తున్న మార్పులుగా చెప్పవచ్చు. అయితే విద్యకు కేటాయిస్తున్న నిధులను ఖర్చుగా కాకుండా భవిష్యత్తు పెట్టుబడిగా భావించిననాడే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయి.

# ఆశల బల్లకట్టు

**అమరావతి:** ఓడించడానికి వరద వస్తుంది. మనిషిని ఓడగొట్టి చూద్దామని వరద వస్తుంది. వేయి చేతులతో లక్ష కాళ్లతో రాత్రికి రాత్రి... చీకటి దారిలో... దొంగదెబ్బ తీద్దామని వరద వస్తుం ది. పగటి వేళ బందిపోటులా నీటితూటాల తుపాకీ పేలుస్తూ వరద వస్తుంది. అది ఇంటి పాదాల కిందుగా వస్తుంది. ఇంటి యజమాని తల మీదుగా వస్తుంది. చావిట్లోని ఎడ్ల కొమ్ముల మీద నుంచి, బరెగొడ్ల పొదుగుల మీద నుంచి, చంటి పిల్లల బెదురు ఏడుపుల మీద నుంచి, అమ్మ వెలిగించాల్సిన పొయ్యి మీద నుంచి, నాన్న జేబు మీద నుంచి భీతావహం చేస్తూ బీభత్సం సృష్టిస్తూ వస్తుంది. నేనెక్కువ అని ప్రకటించడానికి వస్తుంది. నెట్టుకుంటూ, తోసు కుంటూ, కూలగొడుతూ, పెళ్లగిస్తూ, కుళ్లగిస్తూ ప్రతాపం చూపించడానికి వస్తుంది. ఈ దెబ్బతో మనిషి సఫా- అనుకుంటుంది అది. విర్రవీగుతుంది అది. ఉద్ధృతంగా నవ్వుతుంది అది. అప్పటికి మనిషి సిద్ధమైపోయి ఉంటాడు. సరే... కొన్నాళ్లు అని నిర్ణయం తీసుకుని ఉంటాడు. భార్యాబిడ్డలను ఒడ్డు కు బయల్దేరదీస్తూ ఉంటాడు. మిగిలిన నూకలను మూటగట్టుకుంటూ ఉంటాడు. గొడ్డూ గోదాను తీసుకెళ్లేందుకు బల్లకట్టును వెతుకుతూ ఉంటాడు.

మధ్య మధ్య భార్యను కేకేసి 'ఇంటి ముందుకు నీళ్ల పిశాచి వచ్చింది... దానిక్కాస్త చీపురు చూపించు' అని పురమాయిస్తుంటాడు. ఎన్ని చూసి ఉంటాడతడు? తుఫాన్లు కొత్తా? కుంభవృష్టి కొత్తా? వడగండ్లు కొత్తా? వడగాడ్పులు కొత్తా? కరువు కొత్తా? బతుకు నెత్తిన పడేసే బరువు కొత్తా? రోగాలు.. రొష్టులు.. మహమ్మారులు.... పాలకుల నమ్మకద్రోహాలు... వ్యాపారుల నిలువు దోపిడీలు... డబ్బు రాజేసే పెను మంటలు... వరదకు భయపడతాడా?

మనిషి ఆగడు. జీవితాన్ని ఆగనివ్వడు. ఆశను చావనివ్వడు. ఎన్నో వస్తుంటాయి పోతుంటాయి. నాలుగు రోజులు ఉండి వెళ్లే అతిథికి తగిన మర్యాదలు చేసి పంపడం అతనికి వచ్చు. కష్టాలను మెల్లగా సాగనంపడం వచ్చు. వాటిని వదిలిపెట్టడం వదుల్చుకోవడం వచ్చు. అందుకు సాటి మనిషిని తోడు చేసుకోవడమూ వచ్చు. ఇది తెలియని వరద అతడిని జయించాలని చూసినప్పుడల్లా ఓడిపోయిం ది. మళ్లీ మళ్లీ ఓడిపోతూనే ఉంది. మహా అయితే సాధించగలిగేది కాసింత బురద జల్లి పోవడమే. మనిషి సాగించే అనంత జీవన ప్రయాణంలో వరదది లిప్తపాటు కలకలం. అతడు రేపో మర్నాడో మళ్లీ తన ఇల్లు చేరుతాడు. ఆరబెట్టిన వస్తువులు లోపల పెట్టుకుంటాడు. తల స్నానం చేసి, పొడి బట్టలు కట్టుకుని, భార్య వండిన వేడి వేడి భోజనాన్ని పిల్లలతో పాటు భుజిస్తూ ఆశను ఊత చేసి సాగిపోతూనే ఉంటాడు.



# తొలి ఉపాధ్యాయుడు

**న్యూఢిల్లీ :** ఆ సాయంత్రం ఎవరో అపరిచితుడు ఇంటి తలుపు ముందుకు వచ్చాడు. 'నాన్నగారు ఉన్నారా?' అని అడిగాడు. 'లేరండీ... బయటకు వెళ్లారు' అని చెప్పాడు ఇంటి బాలుడు.

ఆ బాలుడి నాన్న ఆ చిన్న ఊరికి పంచాయితీ బోర్డు ప్రెసిడెంట్‌గా ఎన్నికై ఉన్నాడు. 'ఈ కానుక ఇక్కడ పెట్టి వెళ్లనా?' అని అడిగాడా అపరిచితుడు. అందుకు కనీసం తల్లి అనుమతి కావాలని బాలుడు తల్లిని అడిగాడు. ఆమె ఆ సమయానికి ప్రార్థనలో ఉండి బదులు ఇవ్వలేదు. 'సరే... పెట్టి వెళ్లండి' అన్నాడా బాలుడు.

కాసేపటికి తండ్రి వచ్చాడు. కానుకను చూశాడు. 'ఎవరిచ్చారు ఇది' అని బాలుడిని అడుగుతూ కానుక తెరిచి చూశాడు. అందులో ఖరీదైన ధోతి, మిఠాయిలు, పండ్లు ఉన్నాయి. చిన్నచీటీ కూడా ఉంది ఆయన పేరున, కానుకిచ్చిన వ్యక్తి సంతకంతో. అందాక ఆ బాలుడు ఎన్నడూ చూడనంత కోపం వచ్చింది తండ్రికి. 'ఎవరు తీసుకోమన్నారు నిన్ను' గద్దించి అడిగేసరికి బాలుడు భయంతో ఏడుపు అందుకున్నాడు. 'నిన్నూ'... ఒక దెబ్బ వేశాడు. తల్లి కొడుకును పొదువుకుంది. తండ్రి కళ్లల్లో సిగ్గుతో, అవమానంతో కన్నీరు ఉబికింది.

'చూడు... ఇది కానుక. నా నుంచి ప్రయోజనం పొందడానికి ఇచ్చి వెళ్లింది. నేను పదవిలో ఉండగా తరతమ భేదం లేకుండా చేయవలసిన సాయం అందరికీ చేస్తాను. ఇలా కానుక తీసుకుంటే చేయకూడని సాయం కూడా చేయాల్సి రావచ్చు. మన ధర్మంలో కానుకలు నిషిద్ధం. మనుస్మృతిలో కూడా కానుకలు మనిషిలోని దైవిక కాంతిని హరిస్తాయి అని ఉంది. కాబట్టి ఇలాంటి తప్పు జీవితంలో చేయకు' అని కొట్టిన చేత్తోనే దగ్గరికి తీసుకున్నాడు. అబ్దుల్ కలామ్ అనే ఆ బాలుడు తర్వాత పెరిగి పెద్దవాడై భారతదేశానికి రాష్ట్రపతి అయ్యాడు. తండ్రి నేర్పిన పాఠాన్ని పొల్లుపోకుండా పాటించినందువల్ల రాష్ట్రపతి భవన్‌ను వీడి వచ్చే సమయానికి ఆయన వద్ద ఉన్నవి కేవలం రెండు చిన్న సూట్‌కేసులలో పట్టే దుస్తులు. తన సొంత బంధువులు రాష్ట్రపతి భవన్‌కు వస్తే వారి ఆతిథ్యానికి ఎంతయ్యిందో లెక్కవేసి అక్షరాలా 3,52,000 రూపాయలు చెల్లించిన ఆ ఉన్నతుడు నేడు జాతి గౌరవం అందుకుంటున్నాడు. తండ్రి పాఠాలు సరిగా చేరితే పిల్లలు ఇలా ఉంటారు.



ఐ.ఐ.టి.లో టాపర్‌గా వచ్చిన విద్యార్థిని 'నీకు ర్యాంక్ రావడంలో తల్లిదండ్రుల పాత్ర ఎంత?' అనడిగితే 'చాలా ఉంది. నాన్న నన్ను విద్యార్థిలా పెంచాడు... అమ్మ కొడుకులా పెంచింది.. రెండూ మేలు చేశాయి' అన్నాడు. ఇల్లు అనే పాఠశాలలో తొలి ఉపాధ్యా యుడు తండ్రి. లాలనతో నిండిన తల్లి పాఠాలతో పాటు చూపులతోనే దండించగల తండ్రి పాఠాలు ఉంటేనే బాల్య, కౌమార సమయాల్లో లోకరీతులకు కొట్టుకుపోని విలువలను పాదుకొల్పవచ్చు.

తండ్రి పిల్లల క్షేమం కోరతాడు, భవిష్యత్తుకై ఆరాటపడతాడు, అందుకై ఆర్థిక వనరుల కోసం రేయింబవళ్లు కష్టపడతాడు. నిజమే. కాని ఈ క్రమంలో అతడు తన 'టీచరు పోస్టు'ను, బోధనా బాధ్యతను విస్మరించజాలడు. 'నా పిల్లలకు ఏమి ఇస్తున్నాను' అనే తపనలో 'ఏమి' అనే ప్రశ్నకు జవాబు ఆర్థికమే కానక్కర లేదు. వాత్సల్యమే కానక్కర్లేదు. వారసత్వమే కానక్కర్లేదు. నేర్పవలసిన పాఠాలు ఉంటాయి, ఇంట్లోని ఈ కొడుకు/కూతురు సమాజంలో పౌరులవుతారు. ఎలాంటి పౌరులవుతారనే స్పృహ ప్రతి తండ్రికీ ముఖ్యం. 'ఇలా పెంచి వదిలారా' అనే మాట ఎందుకు రావాలి?

చైనాలో 'యెన్ చువాన్ షెన్ జియోవ్' అనే సంప్రదాయం ఉంది. తండ్రి తన చర్యలు, ప్రవర్తన, పాటించే విలువల ద్వారా పిల్లల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాలని దాని అర్థం. 'నువ్వు ఏమిటో అదే నీ పిల్లలు' అని తాత్పర్యం. ప్రతి ఆఫ్రికా తండ్రి పిల్లలకు బోధించే తొలిమాట 'నీ పై నువ్వు ఆధారపడు' అని. ప్రాదేశిక, సామాజిక, రాజకీయ కారణాల రీత్యా తండ్రులు చెప్పాల్సిన పాఠాలు స్వల్ప తేడాతో ఉంటాయిగానీ అన్నింటి అంతిమ లక్ష్యం విలువలతో కూడిన వ్యక్తిత్వమే.

ఈ సిలబస్‌ను తండ్రులు పక్కనో గట్టునో పెట్టడం, సిలబస్ పూర్తి చేయడానికి సమయం లేదని వంక చెప్పడం ఒక సంగతి. అసలు సిలబసే లేదనుకోవడం మరో సంగతి.

సెప్టెంబర్ 5-'టీచర్స్ డే' అంటే అందరూ బడిలో ఉండే టీచర్స్ వైపు చూస్తారు. ఈ టీచర్స్ డే నాడు ఇంట్లోని తొలి ఉపాధ్యాయుడికి మొదటి శు భాకాంక్షలు చెప్పాలి. పిల్లలు ఆశీస్సులు తీసుకోవాలి. వారి సమగ్ర వ్యక్తిత్వాన్ని బేరీజు వేస్తూ ప్రతి తండ్రి తనకు తాను మార్కులు వేసుకోవాలి. ర్యాంకులు అక్కర్లేదు. పాసైతే చాలు. హ్యాపీ టీచర్స్ డే.

## రానున్నది మహా సంక్షోభం!..

● కియోసాకి హెచ్చరిక



**న్యూఢిల్లీ:** రిచ్ డాడ్ పూర్ డాడ్ పుస్తక రచయిత 'రాబర్ట్ కియోసాకి' ఇప్పటి వరకు ధనవంతులు కావాలంటే ఎక్కడ పెట్టుబడి పెట్టాలనే విషయం వెల్లడించారు. ఇప్పుడు దిగ్గజ దేశాల్లో తలెత్తే ఆర్థిక సంక్షోభం గురించి వెల్లడించారు. దీనికి సంబంధించిన ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఫ్రాన్స్ చారిత్రాత్మక బాస్టిల్ డే తిరుగుబాటును గుర్తుచేసే.. ఒక ముఖ్యమైన మలుపు దగ్గర పడుతోందని సూచించారు. ఈ అశాంతి నాటకీయ సామాజిక తిరుగుబాటుకు దారితీయవచ్చు. ఎందుకంటే ఫ్రాన్స్ ఒక భారీ ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొనే అవకాశం ఉంది. బాండ్ల భద్రత గురించి కియోసాకి ఆందోళన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులు బాండ్లపై అంత విశ్వాసం ఉంచాల్సిన అవసరం లేదు. ఇది భవిష్యత్తును ఇబ్బందుల్లో పడేస్తుందని అన్నారు. బాండ్స్ ఎప్పుడూ సేఫ్ కాదు అని అన్నారు. 2020 నుంచి అమెరికన్ ట్రెజరీ బాండ్లు 13% తగ్గాయి. యూరోపియన్ బాండ్లు 24%, బ్రిటిష్ బాండ్లు 32% తగ్గాయని కియోసాకి పేర్కొన్నారు. జపాన్, చైనాలు అమెరికా బాండ్లను వదులుకుని బంగారం %లు వెండిని కొనుగోలు చేస్తున్నాయి. మిమ్మల్ని మీరు రక్షించుకోవాలంటే.. బంగారం, వెండి, బిట్‌కాయిన్‌లలో పెట్టుబడులు పెట్టుకోవాలని చెబుతూనే ఉన్నానని ఆయన అన్నారు. అమెరికాలో పెరుగుతున్న రుణ సవాళ్ల గురించి రాబర్ట్ కియోసాకి హెచ్చరించారు. ఇది చరిత్రలో అతిపెద్ద రుణగ్రహీత దేశంగా మారిందని హైలైట్ చేసింది. ఆర్థిక స్థిరత్వం ప్రస్తుతం ముప్పులో ఉందంటూ ఆయన పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక పరిస్థితులను జాగ్రత్తగా మూల్యాంకనం చేయాలని పిలుపునిచ్చారు.

## పెద్దరికం సాధించాలి !

(ఆధ్యాత్మిక చింతన)

**తిరుమల:** సంతరించుకొన్న వయసును, పరిణతిని సాధించిన మనసునుకాగి చల్లారిన పాలతో పోల్చి చెబుతారు. నిప్పు సెగకు తట్టుకొని, పెళపెళ మరిగి నెమ్మదిగా చల్లారిన పాలపై మీగడ చిక్కగా పేరుకొంటుంది. అలాగే జీవితంలోని ఆటుపోట్లకు ఎదురీది, ఎన్నో అవమానాలను ఎదుర్కొని సాధించిన అమూల్యమైన అనుభవం వయసుపై దట్టంగా పేరుకొంటుంది. ఎదురుదెబ్బలు తిన్న వయసే పెద్దరికాన్ని సంతరించుకొంటుంది. దాన్ని 'గడితేరడం' అంటారు. అది అందరి విషయంలో జరగదు. కొందరికే పెద్దరికం వరిస్తుంది. తక్కినవారిని ముసలితనం ఆవరిస్తుంది. పెద్దరికం వ్యక్తిపాలలపై ఆరేసిన పట్టుబట్ట లాంటిది. దులిపితే చాలు, పరిమళం గుప్పుమంటుంది. వారిని కదిపితే చాలు, అనుభవం అబ్బురపరుస్తుంది. మరిగి మరిగి చల్లారిన పాల మాదిరే ఏళ్ల తరబడి మనసు కోపతాపాలతో కుతకుత ఉడికి, క్రమంగా అన్నిరకాల భావోద్వేగాలు చల్లారి, ప్రశాంతంగా చిక్కబడుతుంది. జీవనయానాన్ని ముగించేలోగా వృద్ధులందరూ ఆ తరహా పరిణతిని సాధించి తీరాలి. లేకుంటే ప్రయాణం చివరి భాగంలో చీకాకులు తప్పవు. మరగకాగిన పాలకు మజ్జిగచుక్క తోడయితే అది కమ్మని పెరుగవుతుంది. ఉప్పురాయి తగిలితే విరిగిపోతాయి.

## భారత్‌లోకి మళ్ళీ టిక్‌టాక్?

● మొదలైన నియామకాలు





**న్యూఢిల్లీ :** భారతదేశంలో ఒకప్పుడు ఎంతో ప్రాచుర్యం పొంది.. ఇప్పుడు నిషేధంలో ఉన్న ప్రముఖ సోషల్ మీడియా యాప్ 'టిక్‌టాక్' ఉద్యోగుల కోసం ఎదురు చూస్తోంది. గురుగ్రామ్‌లోని ఆఫీసులో రెండు ఖాళీలను భర్తీ చేయనున్నట్లు లింక్డ్‌ఇన్‌లో పోస్ట్ చేసింది. ఇందులో ఒకటి కంటెంట్ మోడరేటర్ (బెంగాలీ స్పీకర్), మరొకటి మంచి భాగస్వామ్యం.. కార్యకలాపాల లీడ్ కోసం. దీన్నిబట్టి చూస్తుంటే టిక్‌టాక్ మళ్ళీ భారత్‌లోకి అందుబాటులోకి రానుందా అనే ప్రశ్నలు పుట్టుకొస్తున్నాయి. బైట్‌డాన్స్ యాజమాన్యంలోని షార్ట్ వీడియో యాప్ టిక్‌టాక్ కంపెనీ వెబ్‌సైట్ ఇటీవల భారతదేశంలో మళ్లీ అందుబాటులోకి వచ్చింది. అయితే.. దేశంలో టిక్‌టాక్ సేవలను తిరిగి ప్రారంభించడానికి కావలసిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేయలేదని అధికారులు తెలిపారు. ఆగస్టు 22న, కూడా ఈ చైనా యాప్ భారతదేశంలో తిరిగి అనుమతించారనే వాదనలను అధికారులు తిరస్కరించారు. టిక్‌టాక్ వెబ్‌సైట్‌లోని ల్యాండింగ్ పేజీ ఓపెన్ చేయగానే.. భారతదేశంలో ఇది అందుబాటులో లేదని సందేశాన్ని ప్రదర్శించేది. కానీ గత వారం డెస్క్‌టాప్ ద్వారా యాక్సెస్ చేసినప్పుడు ఈ ప్లాట్‌ఫామ్‌కు సంబంధించిన 'అబౌట్ అస్' పేజీ కనిపించింది. అయితే ఎలాంటి వీడియోలు కనిపించలేదు. టిక్‌టాక్ యాప్ ఆండ్రాయిడ్ ప్లే స్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకోవడానికి అందుబాటులో లేదు. "మేము భారతదేశంలో టిక్‌టాక్‌కు మళ్ళీ స్టార్ట్ చేయలేదు. ఇప్పటికి కూడా భారత ప్రభుత్వ ఆదేశాన్ని పాటిస్తూనే ఉన్నాము" అని టిక్‌టాక్ ప్రతినిధి ఒకరు ఒక ప్రకటనలో తెలిపారు. భారత.. చైనా దళాల మధ్య గాల్వాన్ లోయ ఘర్షణ తర్వాత జాతీయ భద్రతా సమస్యలను పేర్కొంటూ భారతదేశం జూన్ 2020లో టిక్‌టాక్‌తో పాటు 58 ఇతర చైనీస్ యాప్‌లను నిషేధించింది. అయితే ఇప్పుడు ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడే సంకేతాలను కనిపిస్తున్నాయి. ఏడేళ్ల తరువాత ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్తుతం చైనాలో పర్యటిస్తున్నారు. ఇవన్నీ చూస్తుంటే.. చైనా సోషల్ మీడియా యాప్ మళ్ళీ అందుబాటులోకి వస్తుందేమో అని కొందరు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

## 22 నుంచి టాస్ పరీక్షలు

హైదరాబాద్ : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్) ఆధ్వర్యంలో పది, ఇంటర్ పరీక్షలను సెప్టెంబరు 22 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు టాస్ డైరెక్టర్ పీవీ శ్రీహరి ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు అక్టోబరు 6 నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు.

## అనుమానాస్పదంగా వ్యక్తి మృతి





**పేట్ బషీరాబాద్:** పేట్ - బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధి కొంపల్లి జయభేరి పార్క్ ప్రాంతంలోని క్వారీ గుంతలో గుర్తు తెలియని మృతదేహం ఉందని స్థానికులు పేట్ బషీరాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు క్వారీ గుంత లోంచి మృతదేహాన్ని వెలికి తీసి కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. పోలీసుల విచారణలో మృతుడు మహమ్మద్ షాహిద్ ( 17 ), ప్రస్తుతం హస్మత్‌పేట్, హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. స్వస్థలం కరీంనగర్ జిల్లా అని గుర్తించారు. మృతుడి కుటుంబం సుమారు ఐదు సంవత్సరాల క్రితం కరీంనగర్ జిల్లా నుండి జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వలస వచ్చి, ప్రస్తుతం హస్మత్‌పేట్‌లో నివసిస్తూ చిన్నచిన్న వ్యాపారాల ద్వారా జీవనం సాగిస్తున్నారు. యువకుడి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందినీ పేట్-బషీరాబాద్ సీఐ విజయవర్ధన్ తెలిపారు.

## గణనాధుల పూజలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు,న్యాయవాది కావలి గోవింద్ దంపతులు



**శాఖాపూర్ గ్రామం:** శాఖాపూర్ గ్రామంలోని వినాయక విగ్రహాల వద్ద ఆదివారం నిర్వహించిన ప్రత్యేక పూజలలో కాంగ్రెస్ నాయకుడు న్యాయవాది కల్పన కావలి గోవింద్ నాయుడు దంపతులు పాల్గొన్నారు. వినాయక మండపాల వద్దకు చేరుకున్న ఆ దంపతులకు విగ్రహ కమిటీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు, దంపతులకు శాలలతో సన్మానం చేశారు. పూజా కార్యక్రమంలో విగ్రదాత అయిన కావలి గోవింద్ దంపతులకు విగ్ర కమిటీ ప్రతినిధులుగణనాథుని చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా న్యాయవాది కావలి గోవింద్ మాట్లాడుతూ కులాలు,మతాలకు అతీతంగా సోదరా భావంతో వినాయక ఉత్సాహాలు నిర్వహించుకోవడం భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శమన్నారు. శాఖపూర్ గ్రామంలో విగ్ర కమిటీ ప్రతినిధులు గణనాథుని చిత్రపటాన్ని కావలి గోవింద్ దంపతులకు బహుకరించారు.

## ఆర్ అండ్ కాలనీలో వినాయక నవరాత్రి ఉత్సవాలు

రెడ్డి సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం



**గజ్వేల్ 31 ఆగస్ట్ 2025 విజయభారతి న్యూస్ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఆర్ అండ్ ఆర్ కాలనీ ఎర్రవల్లిలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం నాడు 5వ రోజు స్వామివారికి విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు, మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం నాయకులు మాట్లాడుతూ ఎర్రవల్లి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు దాదాపు 5 సంవత్సరాలుగా అందరితో కలిసి గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఆ గణపతి అనుగ్రహం అందరి పై ఉండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం నుండి మల్లన్న సాగర్ భూ నిర్వాసితులకు రావాల్సిన పెండింగ్ ప్యాకేజీ వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆ గణనాధున్నీ వేడుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు, మహిళలు చిన్నారులు, భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గణపతి ఆశీస్సులు అందరిపై ఉండాలి

- దేవదేవుని దీవెనలతో అందరూ బాగుండాలి
- ఆర్యవైశ్య నాయకులు బచ్చు నాగరాజు



**గజ్వేల్ 31 ఆగస్టు 2025 విజయభారతి న్యూస్ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 18వ వార్డు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర దేవాలయంలోని గణనాధునికి బచ్చు నాగరాజు మానస దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరికీ గణపతి నవరాత్రి శుభాకాంక్షలు అని, ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని, దైవ నామస్మరణతోనే మానవ జీవితానికి ముక్తి కలుగుతుందని, ఆదిదేవుడు మహాగణపతి అనుగ్రహంతో అందరూ బాగుండాలని అన్నారు. అందరూ ఆ గణనాధుని ఆశీస్సులతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అలాగే లక్ష్మీ వెంకటేశ్వర గణనాథుడు వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా భక్తులకు ప్రతిరోజూ అరటాకులో అన్నదాన కార్యక్రమం అద్భుతంగా చేపడుతున్న భక్త మండలివారికి, మండప నిర్వాహకులకు నాగరాజు దంపతులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ప్రజ్ఞాపూర్ ఊర చెరువు నీటికి ప్రతాప్ రెడ్డి వెంచర్‌కి ఏం సంబంధం..?

- గణపతిని తలుచుకుంటున్నారో లేదో కానీ కెసిఆర్, హరీష్ రావు, కేటీఆర్, ప్రతాపరెడ్డిల జపం చేస్తున్నారు
- కాంగ్రెస్ నాయకుల సమన్వయ లోపంతో కేంద్రం నుండి నిధులు తేలేకపోతున్నారు
- గతంలో కెసిఆర్ గజ్వేల్ కి కేటాయించిన నిధులను కొడంగల్ కి మళ్ళించారు
- యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 20 నెలలు గడుస్తున్న గజ్వేల్ కి చేసిన అభివృద్ధి శూన్యం
- రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం
- గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు



**గజ్వేల్ 31 ఆగస్టు 2025 విజయభారతి న్యూస్ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో రాష్ట్ర వైస్ ఎంపీపీ ల వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, బెండే మధు, ఉప్పల మెట్టయ్య, మరికంటి కనకయ్య మాట్లాడుతూ గజ్వేల్ లో బిజెపి, కాంగ్రెస్ పార్టీ నాయకుల పరిస్థితి ఎలా ఉందంటే గణపతి పూజ జపం చేస్తున్నారో లేదో తెలువదు కానీ ప్రతిరోజు గజ్వేల్ బిఆర్ఎస్ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి జపం చేస్తున్నార న్నారు. గత కెసిఆర్ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గజ్వేల్ మున్సిపాలిటీ యొక్క రూపురేఖలే మారిపోయాయని, స్వతంత్రం వచ్చిన 75 సంవత్సరాల కాంగ్రెస్, బిజెపి పరిపాలన కాలంలో గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధి శూన్యమని అన్నారు. గత కెసిఆర్ ప్రభుత్వ హయాంలో మంజూరైన 180 కోట్ల రూపాయలను అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గానికి నిధులను తీసుకెళ్లి గజ్వేల్ లోని పెండింగ్ లో ఉన్న పనులకు నిధులను మంజూరూ చేయడం లేదని మండిపడ్డారు. నిధులను తీసుకురావడం చేతకాక వంటేరు ప్రతాప్ రెడ్డి జపం చేస్తూ రాజకీయ పబ్బం గడుపుతున్నారని హెద్దేవా చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం తూప్రాన్ రింగ్ రోడ్ నుండి జగ్జీవన్ చౌరస్తా అంబేద్కర్ చౌరస్తా, ప్రజ్ఞాపూర్ చౌరస్తా నుండి జగదేపూర్ రింగ్ రోడ్ వరకు 28 కోట్లు అంబేద్కర్ చౌరస్తా నుండి ముట్రాజ్ పల్లి మీదుగా ఆర్ అండ్ ఆర్ మీదుగా రాజీవ్ రహదారి వరకు 6 లైన్ల రోడ్డుకు 26 కోట్లు సైడ్ డ్రైనేజీలు, డివైడర్ల కోసం, కల్వర్టుల కోసం నిధులను మంజూరు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిధులను రద్దు చేసిందని అన్నారు. గజ్వేల్ పట్టణంలో పెండింగ్లో ఉన్న సిసి రోడ్ల నిర్మాణం కోసం 12 కోట్ల రూపాయలు గత కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేసిందని దానిమీద కాంగ్రెస్, బిజెపి నాయకులు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. గజ్వేల్ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రించడానికి, రింగ్ రోడ్డు నిర్మాణం కోసం 240 కోట్లు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసి రోడ్డు నిర్మాణం చేయడం జరిగిందన్నారు. కేవలం 100 మీటర్ల రోడ్డు మాత్రమే పెండింగ్లో ఉందని రైతు కోర్టుకు పోవడం వలన వంద మీటర్ల రోడ్డు పెండింగ్లో పడింది కనీసం మీ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్న 100 మీటర్ల రోడ్డును వేయలేక పోయారని అన్నారు. గజ్వేల్ మున్సిపల్ పరిధిలో 100 కోట్ల రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేయడం జరిగిందని ఇంకో 80 కోట్లు అవసరమంటే గత కేసిఆర్ ప్రభుత్వం 80 కోట్ల రూపాయలను డి పి ఆర్ ఎస్టిమేట్లు చేసి పంపించడం జరిగింది కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న పెండింగ్ లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయకపోవడం దారుణమని అన్నారు. ప్రజ్ఞాపూర్ ఊర చెరువు మత్తడి నుండి క్యాసారం చెరువులకు వెళ్లే నాలా నిర్మాణం కోసం గత కేసీఆర్ ప్రభుత్వంలో 14 కోట్ల రూపాయలతో ఎస్టిమేట్ కాపీలను తయారు చేయగా అవి ఇరిగేషన్ ఆఫీస్ లో పెండింగ్ లో ఉన్నాయని నేడు అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని కూడా సాంక్షన్ చేయక ఆ కాల్వపనులను పూర్తి చేయలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. నేడు బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉంటే ఈ పెండింగ్ పనులు అన్ని పూర్తి అయ్యేవని, కానీ నేడు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బిజెపి ఎంపీ రఘునందన్ రావు లకు చిత్తశుద్ధి ఉంటే నాడు కెసిఆర్ హయాంలో మంజూరైన 180 నిధులను వెంటనే విడుదల చేసి పెండింగ్లో ఉన్న పనులకు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడుస్తున్న ఇప్పటికి గజ్వేల్ లో తట్టెడు మన్ను ఎత్తలేదు, ఒక అభివృద్ధి కార్యక్రమం చేయలేదు, గజ్వేల్ మున్సిపాలిటీలో అభివృద్ధి కుంటు పడిందని , కనీసం గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధి కోసం పట్టించుకునే నాథుడు లేడని అన్నారు. గజ్వేల్ నియోజకవర్గాన్ని ఇటు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అటు కేంద్రంలోని బిజెపి పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతసేపు కాలేశ్వరం, కెసిఆర్, హరీష్ రావు, కేటీఆర్, ప్రతాపరెడ్డి లపై విమర్శలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందుతున్నారని తెలిపారు. నియోజకవర్గంలో డెంగ్యూ వచ్చి చిన్నారులు చనిపోతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజల ఆరోగ్యం పట్ల చిత్తశుద్ధి లేదని అన్నారు. రైతన్నకి యూరియా దొరకక రైతులు అరిగోసలు పడతా ఉంటే రైతులు ఇబ్బందులకు గురవుతా ఉంటే కనీసం రైతుల పట్ల దయ చూపాల్సింది పోయి రైతులను అవహేళన చేస్తూ రైతులను అగౌరవ పరుస్తూ రైతులకు యూరియా అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని తెలిపారు. మేక్ ఇన్ ఇండియా అంటే శత్రుదేశమైన చైనా నుండి యూరియా దిగుమతి చేసుకోవడమేనా అని ప్రశ్నించారు. యూరియాను ఉత్పత్తి చేసుకోలేని పరిస్థితిలో కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ ఉందని విమర్శించారు. భారీ వర్షాల వలన ప్రజ్ఞాపూర్ ఊర చెరువు నుండి నీళ్లు రోడ్లపైకి వచ్చాయని, ప్రజ్ఞాపూర్ చెరువు మత్తడి నీళ్లకు ప్రతాప్ రెడ్డికి ఏం సంబంధం లేదని అన్నారు. నిత్యం అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల మధ్యలో ఉంటూ ప్రజల సమస్యలను అధికారంలో ఉన్నప్పుడు పరిష్కరించి, అధికారం లేనప్పుడు సమస్యలపై కొట్లాడుతూ ప్రజల కోసం పరితపిస్తున్న నాయకుడు వంటేరు ప్రతాపరెడ్డిపై బురద జల్లడానికి వేరే అంశం దొరకక ప్రతాప్ రెడ్డి జపం చేస్తూ కాంగ్రెస్, బిజెపి నాయకులు లేనిపోని ఆరోపణలు చేయడాన్నీ తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రజ్ఞాపూర్ మత్తడి ఎక్కడ ఉంది వెంచర్ ఎక్కడ ఉంది, మత్తడికి వెంచర్ కు దాదాపు అర కిలోమీటర్ దూరం ఉందని, మధ్యలో రెండు వెంచర్లు ఉన్నాయని అవగాహన లోపంతో కొంతమంది బిజెపి, కాంగ్రెస్ నాయకులు మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని అన్నారు. ప్రజ్ఞాపూర్ ఊర చెరువు మత్తడి నీళ్లు వెంచర్ లోకి వరద నీళ్లు వెళ్లడం వలన అక్కడ ఇల్లు కట్టుకున్న వారికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కాంగ్రెస్, బిజెపి నాయకులు మాట్లాడేటప్పుడు నిజ నిజాలు తెలుసుకొని మాట్లాడాలని లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతాప్ రెడ్డి వెంచర్ కు ప్రజ్ఞాపూర్ ఊర చెరువు మత్తడి నీళ్లకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. భూకబ్జాలు చేయడం అవినీతి అక్రమాలకు పాల్పడటం స్కాములు, బ్లాక్ మెయిల్స్ చేయడం బిజెపి, కాంగ్రెస్ నాయకులకు వెన్న తో పెట్టిన విద్యాని అన్నారు. రాబోయే రోజులలో బిజెపి, కాంగ్రెస్ నాయకులు చేస్తున్న కబ్జాలు, అవినీతి అక్రమాలు, స్కాములు అన్ని ఆధారాలతో బయట పెడతామని అన్నారు. ఇప్పటికైనా ఏదైనా అంశాన్ని మాట్లాడేటప్పుడు నిజ నిజాలు తెలుసుకొని మాట్లాడాలి లేదంటే చట్టాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, అహ్మద్, స్వామి చారి, హనుమంత్ రెడ్డి, మద్ది నరేందర్ పాల్గొన్నారు.

# ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు

## ఆర్యవైశ్య నాయకుడు నానాజీ ఆధ్వర్యంలో అన్నదానం





**గజ్వేల్ 31 ఆగస్ట్ 2025 విజయభారతి న్యూస్ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణం లోని లోకల్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం నాడు 5వ రోజు విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్తానిక ఆర్యవైశ్య నాయకులు నానాజీ కుటుంబ సభ్యుల సౌజన్యంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్య మహాసభ పట్టణ ఉపాధ్యక్షుడు అయిత సత్యనారాయణ మాట్లాడుతూ అందరికి వినాయక నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఆటో యూనియన్ సభ్యులు గణపతి నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండుగగా నిర్వహించడం అభిందనీయమని, గణపతి అనుగ్రహంతో ఆటో కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని కోరుకుంటూ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసిన నానాజీ కుటుంబ సభ్యులకు స్వామి వారి కరుణ కటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం లోకల్ ఆటో యూనియన్ అధ్యక్షులు కరీం మాట్లాడుతూ అందరికీ గణపతి నవరాత్రి శుభాకాంక్షలు అని, లోకల్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అన్ని పండుగ ఉత్సవాలను జరుపుకుంటామని, కులమత బేధాలు లేకుండా ఉంటామని తెలిపారు. ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# జిజిహెచ్‌లో ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం

## రూ. 5 వేల నగదు అందించిన ట్రస్ట్ అధినేత





**(విజయభారతి ప్రతినిధి, ప్రత్తిపాడు నియోజకవర్గ ఇంచార్జ్ ఎం.రాజశేఖర్) ఆగస్టు,31:** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో కేదార్ శేఖర్ కుమారుడు లోకేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడి కాకినాడ జిజిహెచ్ తరలించడం జరిగినది. విషయం తెలుసుకున్న వెంటనే పత్తిపాడు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి నాయకులు నరసాపురం పార్లమెంటరీ పరిశీలకులు ముదునూరి మురళి కృష్ణంరాజు గాయపడిన వ్యక్తిని పరామర్శించి 5000 రూపాయలు ఆర్థిక సాయం అందించడం జరిగింది. మెరుగైన వైద్యం అవసరమైతే ఎంఎంఆర్ ట్రస్ట్ సభ్యుల ద్వారా తెలియపరిచినట్లయితే కార్పొరేట్ వైద్యం అందేలా చేస్తానని తెలియపరిచారు నియోజవర్గ ప్రజలకు వైయస్సార్సీపి అభిమానులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో నాని పల్లి వెంకన్న, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

# గణనాథుల వద్ద ప్రత్యేక పూజలు

## అన్నదానాల్లో పాల్గొన్న దయాకర్ రెడ్డి





**ఖమ్మం :** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ అలముకుంది. గణనాథుని నామస్మరణతో వీధులు మార్మోగి, మండపాల వద్ద భక్తుల సందోహం ఉత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి నేలకొండపల్లి మండల కేంద్రం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సాయి ప్రభాత్ నగర్-1, సాయి ప్రభాత్ నగర్-2, కేబీఆర్ నగర్, పెద్ద తండా, సింహాద్రి నగర్, ఆర్ఎస్ నగర్, సత్యనారాయణపురం, రాజీవ్ గృహకల్ప, నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించారు. అదేవిధంగా ఖమ్మం నగరంలోని బస్ డిపో రోడ్, ముత్యాలమ్మ గుడి సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన గణపతి మండపాన్ని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయా మండపాల వద్ద ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించి, భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. మండపాల నిర్వాహకులు ముఖ్య అతిథిగా విచ్చేసిన దయాకర్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, గణపతి మండపాల నిర్వాహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందిన కృష్ణ స్వామికి సన్మానం



**భద్రాచలం :** దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భద్రాచలం పుణ్యక్షేత్రంలో ఆదివారం సీనియర్ అసిస్టెంట్ ముద్దసాని కృష్ణ స్వామి పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో దామోదర్ రావు ఆయనని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు భవాని రామకృష్ణ, శ్రావణ్ కుమార్, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా 2-3 గంటల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం

జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ హెచ్చరిక




**భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లా వ్యాప్తంగా వచ్చే 2-3 గంటలపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ హెచ్చరిక మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ సూచించారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని ఆయన సూచించారు. జిల్లాలో ఏదైనా ప్రాంతంలో మూడు గంటలకు పైగా వర్షం నిరంతరంగా కురిస్తే లేదా 100 మిల్లీమీటర్లకు పైగా వం-ర్షపాతం నమోదైతే అక్కడి పరిస్థితులను పరిశీలించి వరద ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజలను తక్షణమే సురక్షిత ప్రదేశాలకు తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా అవసరమైతే సమీపంలోని పునరావాస కేంద్రాలకు ప్రజలను తరలించి, ఆహారం, తాగునీరు, అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఎటువంటి అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కంట్రోల్ రూమ్'ను సంప్రదించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

**జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్లు:08744-241950, 08744-241951**

## డీజేలకు అనుమతి లేదు

కన్నాయిగూడెం ఎస్ఐ ఈనిగాల వెంకటేష్



**కన్నాయిగూడెం :** మండలంలో గల గణేష్ ఉత్సవాల్లో డీజేలకు ఎలాంటి అనుమతులు లేవని, డీజేలను పూర్తిగా నిషేధం విధించినట్లు కన్నాయిగూడెం ఎస్ఐ వెంకటేష్ స్పష్టం చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్నాయిగూడెం మండలంలో గణేష్ మండప నిర్వహకులు ఎట్టి పరిస్థితుల్లో డీజేలను ఏర్పాటు చేయరాదని అన్నారు. డీజేలు పెట్టుకుంటే ఓనర్స్'పై, ఆపరేటర్స్'పై కేసులు నమోదు చేస్తామన్నారు. అనుమతి లేకుండా డీజేలు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## పెన్షన్ విద్రోహ దినం నిరసనలో పాల్గొనండి

పెన్షనర్లకు ఎస్జిపిఏటి విజ్ఞప్తి




**ఖమ్మం :** టిజిఇజెఏసి పిలుపు మేరకు సెప్టెంబర్ 1న ఖమ్మం జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే పెన్షన్ విద్రోహ నరసన కార్యక్రమంలో పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొనాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్జిపిఏటి) ఖమ్మం జిల్లా శాఖ కోరింది. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం(ఎస్జిపిఏటి), పెన్షనర్ల జెఏసి ఎంతోకాలంగా పెన్షనర్లకు పాత పెన్షను విధానం అమలు చేయాలని కోరుతున్నదని, పెన్షన్ విద్రోహ నిరసన కార్యక్రమంలో పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఎస్జిపిఏటి ఖమ్మం జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య, ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్ కోరారు.

## దాదా హాజత్ ఉర్సు ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

సింగూర్ గ్రామంలో ఈ నెల 5వ తేదీ నుంచి 7 తేదీ వరకు ఉత్సవాలు

ఏర్పాట్లు పూర్తి: పీఠాధిపతి





**పుల్కల్ :** పుల్కల్ మండల పరిధిలోని సింగూర్ గ్రామంలో ఈ నెల 5వ తేదీ నుంచి 7 తేదీ వరకు దాదా హాజత్ 80వ ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు దర్గా పీఠాధిపతి మహ్మద్ అబిద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ సహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు. గత 80వ సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఉత్సవాలు కులమతాలతకు అతీతంగా వేలాది మంది భక్తులు హాజరౌతారు. ఉత్సవంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దర్గాను రంగురంగుల దీపాలతో అందంగా అలంకరిస్తారు. ఎంతో పవిత్రత కల్గిన గంధం, చాదర్ ఇంటి నుండి తీసుకొని దర్గాలోకి తీసికెళ్లి కీలక ఘట్టాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. 06వ తేదిన వాలీ బాల్ పోటీలు నిర్వహిస్తారు. సాయంత్రం నాతే మై ఫీల్ సమ, అన్నదాన కార్యక్రమం ఉంటుదన్నారు. ముఖ్య అతిథులు అన్నసాగర్ పీఠాధిపతి హజ్రత్ సూఫీ షా, మహ్మద్ ఖలీల్ హుస్సేన్, ఉర్ఫ్ జహీద్ హుస్సేన్, సత్తరుల్ ఖాద్రీ పాల్గొంటారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## మైలారంలో అన్నదాన కార్యక్రమం



**శాయంపేట :** మండలంలో గల మైలారం గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు పల్లెబోయిన రాజేందర్, ఉపాధ్యక్షులు పల్లెబోయిన తిరుపతి, పల్లెబోయిన రమేష్, పల్లెబోయిన బన్నీ, కుక్కల బాలకృష్ణ, ఏనుగుల దిలీప్, బూతం తిరుపతి పాల్గొన్నారు.

## 15 మందికి అస్వస్థత

కలుపు మందు నీళ్ల తాగిన వైనం



**టేకులపల్లి :** మండలంలోని 09 మైల్ తండా సమీపంలో ఆదివారం విషాదకర ఘటన చోటు చేసుకుంది. మిరప నారు నాటడానికి 15 మంది కూలీలు పనికి వెళ్లారు. ఈ క్రమంలో పనిచేస్తూ వారు కలుపు మందు కలిపిన బిందెలో ఉన్న మంచి నీరు తాగి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కలుపు మందు కలిపిన బిందెను శుభ్రం చేయకుండానే తాగునీరు పోసి కూలీలకు ఇవ్వడంతో ఇలా జరిగిందని స్థానికులు తెలిపారు. వెంటనే స్పందించిన సహ కూలీలు వారిని కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు.

## తెలంగాణ తొలి ఉద్యమ నేత మృతి



**ఆళ్లపల్లి :** తెలంగాణ తొలి ఉద్యమ నేత షేక్ జానీ ఆదివారం తుది శ్వాస విడిచారు. భద్రాద్రి కొత్తగూడెం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా. కాంతారావు ఆదేశాల మేరకు ఆళ్లపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పాయం. నరసింహారావు, కోపరేటివ్ చైర్మన్ గోగ్గల రామయ్య ఈ సందర్భంగా మృతదేహాన్ని సందర్శించి బిఆర్ఎస్ పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గణపయ్య సన్నిధిలో అన్నదాన కార్యక్రమాలు



**ఆళ్లపల్లి :** శ్రీ వరసిద్ధి వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని రామాలయం, కొమ్ముగూడెం, జిన్నెలగూడెంలోని ఏర్పాటు చేసిన గణేశుని మండపాల వద్ద భక్తులు పూజలను ఘనంగా నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. నిర్వహణ ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో గౌరిశెట్టి భారతమ్మ, నాగభూషణరావు, విజయలలిత, శ్రీనివాసరావు, వేమూరి రవికుమార్, మమత దంపతులు కొమ్ముగూడెం ఉత్సాహ కమిటీల ఆధ్వర్యంలో అల్పాహారం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మహిళలు కోలాటాలు నిర్వహించారు. వినాయక విగ్రహదాతలను గ్రామ పెద్దలు వేమూరి రాంబాబు, చిట్టిమల్ల బాబు, వేమూరి సత్యం.. కమిటీ సభ్యుల ప్రోత్సాహంతో రవికుమార్ – మమత దంపతులను ఘనంగా చిరుసత్కారంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సత్యం, నిట్ట వెంకట్రావు, సుధాకర్, రవి, నరసింహారావు, హరిబాబు, బిక్షం, తిరుపతి, వెంకన్న, వసంతరావు, విజయ్, నిఖిల్, నవీన్, సాయి, అరవింద్, అఖిల్, దిలీప్, యశ్వంత్, ప్రవీణ్, నరెడ్ల వెంకన్న, శ్రీనివాస్, నువ్వుల నరసింహులు, తెలగాని శ్రీనివాసరావు, వజ్రేశ్వరరావు, శ్రీకాంత్, శ్రీనాథ్, సతీష్, అబ్బుశ్రీను, తిరుమలేష్, తులం శ్రీను, కృష్ణ, శ్రీనివాస్, సందీప్, చింటూ, చరణ్, అశోక్, జగదీష్, సతీష్, నవీన్, అజయ్, విజయ్, రామలక్ష్మణ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ముండ్లపాటి శ్రీనుని పరామర్శించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)



**పెనుగంచిప్రోలు :** మండలంలోని పెనుగంచిప్రోలు గ్రామంలో గల తూర్పు బజారు ఎస్సీ కాలనీకి చెందిన ముండ్లపాటి శ్రీను అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడ స్వర హాస్పిటల్'లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) స్వయంగా విజయవాడలో హాస్పటల్ కి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ శ్రీను త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యుల నుండి పూర్తి స్థాయిలో ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, అవసరమైన సహాయ సహకారాలు అందించాలని భరోసా కల్పించారు.

## ఘనంగా తిరుపతమ్మ అమ్మవారి రథోత్సవం



**పెనుగంచిప్రోలు :** పెనుగంచిప్రోలు పుణ్యక్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి రథోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్, ఆలయ అర్చకులు మర్రిబోయిన రామకోటి గోపి, కాశిరాజు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ఏపీలో కలకలం రేపుతున్న కానిస్టేబుల్ అదృశ్యం: ఫోన్ సిగ్నల్ కట్!



**చింతలపూడి :** ఏలూరు జిల్లాలో కానిస్టేబుల్ అదృశ్యం కలకలం రేపుతోంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు జంగారెడ్డిగూడెం డివిజన్ కామవరపుకోట, టి.నరసాపు రం పోలీస్‌స్టేషన్ల పరిధిలో స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) కానిస్టేబుల్ బి.సుబ్బారావు విధులు నిర్వర్తిస్తున్నారు. గత రెండేళ్లుగా ఆయన అక్కడ పనిచేస్తున్నారు. కామవరపుకోటలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని అందులో నివాసముంటున్నారు. శుక్రవారం బుట్టాయగూడెం నుంచి వచ్చి ఆరోజు రాత్రి విధులు నిర్వర్తించారు. అనంతరం సుబ్బారావు ఫోన్ సిగ్నల్ కట్ అయింది. అప్పటి నుంచి అతడి నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందుతూ శనివారం సాయంత్రం కామవరపుకోట మండలం తడికలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో కామవరపుకోటకు చెందిన ఓ యువకుడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. సుబ్బారావు ఫోన్ సిగ్నల్ ఆగిపోయిన ప్రాంతాలతో పాటు టి.నరసాపురం, జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.

# ప్రజల సౌకర్యార్థం భద్రాచలం సబ్ కలెక్టర్, కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయాల్లో ప్రజావాణి

జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజల సౌకర్యార్థం భద్రాచలం సబ్ కలెక్టర్, కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఈ సందర్భంగా తెలిపారు. జిల్లాలోని భూసమస్యల పరిష్కారానికి ప్రజలు సుదూర ప్రాంతాల నుండి సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నందున, వారి సౌకర్యార్థం డివిజన్ల వారీగా ప్రజావాణి నిర్వహణకు చర్యలు తీసుకు న్నట్లు ఆయన తెలిపారు. భద్రాచలం డివిజన్ పరిధిలోని ప్రజలు భూసమస్యల పరిష్కారం కోసం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ప్రజావాణి నిర్వహిస్తారు. కొత్తగూడెం డివిజన్ పరిధిలోని ప్రజలు భూసమస్యల పరిష్కారం కోసం కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ప్రజావాణి నిర్వహిస్తారు. జిల్లా ప్రజలందరూ తమ డివిజన్ పరిధి ప్రకారం సంబంధిత కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించి, భూసమస్యల పరిష్కారానికి ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. జిల్లాలో అధిక వర్షపాతం ఉన్నందున ప్రజల సౌకర్యార్థం ఈ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

## అన్నదానానికి విరాళంగా రూ. 101,116/-



**భద్రాచలం :** హైదరాబాద్ హిమాయత్ నగర్ వాస్తవ్యులు వ్యాసబట్టు రామచందర్ ఆదివారం భద్రాచలం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకున్నారు. అనంతరం ఆయన శ్రీ స్వామివారి అన్నదానం నిమిత్తం రూ. 101,116/- విరాళంగా ఆలయ ఈవో దామోదర్ రావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుకు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలి



**కొత్తగూడెం :** జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నాయకుడు జర్నలిస్టుకు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) భద్రాద్రి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూరిబాబు, వెంకటేశ్వర్లు, డిమాండ్ చేశారు. చంద్రుగొండలో ఓ జర్నలిస్టుపై ఓ అధికార పార్టీకి చెందిన నాయకుడు నోటికి వచ్చినట్లు మాట్లాడిన తీరును వారు తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టులపై నోటికొచ్చినట్లు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. మహిళలు వారికి జరిగిన అన్యాయాన్ని పంచాయతీ కార్యాలయం సాక్షిగా మీడియాకు తెలియజేశారు. అదే విషయాన్ని వారు పత్రికల ద్వారా మీడియా ద్వారా ప్రచురించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. దీంట్లో జర్నలిస్టులు చేసిన తప్పేముంది అని ప్రశ్నించారు. బహిరంగంగా జర్నలిస్టులకు క్షమాపణ చెప్పాలన్నారు.

## ఘనంగా గణేష్ నిమజ్జోత్సవం



**ఏదులాపురం :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని తెల్దారుపల్లి గ్రామపంచాయతీలో వినాయక చవితి నవరాత్రుల పర్వదినాలను పురస్కరించుకొని 05వ రోజు కొలువుదీరిన గణనాధులను అంగరంగ వైభవంగా ఊరేగింపుగా గణేష్ నిమజ్జనోత్సవం కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక పంచాయతీ పరిధిలో మొత్తం 22 విగ్నేశ్వరులకు ఘనమైన పూజలను అందించారు. ఆదివారం వినాయకుని ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం నిమజ్జనోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామం వద్ద గణనాథులు ఊరేగింపుతో పండుగ వాతావరణం నెలకొంది. గణేష్ నిమజ్జోత్సవానికి స్థానిక పోలీసులు ప్రత్యేకంగా బందోబస్తు నిర్వహించారు. మండపాల వద్ద అన్నదానాలు, ప్రసాదాల పంపిణీ, గణేష్ లడ్డు వేలం పాటలతో పాటుగా ఊరేగింపుకు డీజే ప్రత్యేకంగా ఆకర్షణగా నిలిచింది. గ్రామంలోని చిన్న, పెద్ద, యువత, మహిళలు నృత్యాలు చేస్తూ గణనాథుడికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.

## ప్రాజెక్టులకు వరద హెచ్చరికలు


**హైదరాబాద్ :** కుంభవృష్టి కారణంగా పలు ప్రాజెక్టులకు వరద ముప్పున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. గోదావరి బేసిన్‌లో పోచారం ప్రాజెక్టుకు ఆదివారం రాత్రి నాటికి 60వేల క్యూసెక్కులకు పైగా వరదవస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. నిజాంసాగర్‌కు 1.80 లక్షల క్యూసెక్కులు వస్తుండగా.. 2.20 లక్షలు దిగువకు వదులుతున్నారు. ఎస్సారెస్పీకి 1.75 లక్షల క్యూసెక్కులు వస్తుండగా.. 2.83 లక్షల క్యూసెక్కులు వదులుతున్నారు. ఎల్లంపల్లికి 7.30 లక్షల క్యూసెక్కులు వస్తుండగా.. 8.07 లక్షల క్యూసెక్కులు వదులుతున్నారు. ఎగువ మానేరుకు 77 వేలు క్యూసెక్కులు, మధ్య మానేరుకు 75 వేల క్యూసెక్కులు వస్తుండగా అంతేమొత్తం వదులుతున్నారు. మేడిగడ్డకు 4.51 లక్షల క్యూసెక్కులు వస్తుండగా అంతే మొత్తం దిగువకు వదులుతున్నారు.

# మహిళా సాధికారికతకు సర్కారు సన్నాహాలు



**గోదావరిఖని :** కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సాధికారికతపై దృష్టి సారించింది. మహిళలను కోటీశ్వర్లను చేస్తామని అధికారంలోకి వచ్చిన పార్టీ అందుకు అడుగులు వేస్తోంది. గ్రామీ ణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ నేతృత్వంలో క్షేత్ర స్థాయి నుంచి మహిళలను సాధికారత వైపు నడిపిం చేందుకు కృషి చేస్తోంది. మహిళా సంఘాల ఆధ్వ ర్యంలో మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు నడిపించేందుకు ప్రయ త్నాలు చేస్తున్నది. 60ఏళ్లు దాటిన మహిళలను కూడా గ్రూపులుగా ఏర్పాటుకు సిద్ధపడుతోంది. ప్రభుత్వమే మహిళలకు అనేక రకాల బీమాను తీసుకు వచ్చేం దుకు కసరత్తులు మొదలు పెట్టింది. ప్రతీ స్వయం సహాయక సంఘాల మహిళ లకు రూ. 10లక్షల ప్రమాద బీమాను వర్తింప చేస్తు న్నది. ఇందిరా మహి ళా శక్తి ద్వారా అనేక ఆర్థిక పథకాలను ప్రవేశపెడుతోంది. పట్టణ ప్రాంతాల్లో ఉన్న మహిళా గ్రూపులన్నింటికి ఒకే పరిపాలన విభాగం నుంచి పనులు జరిగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుం టున్నది. ఇంత కాలం పట్టణ ప్రాంతాల్లో మహిళా సంఘాలు మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మున్సిపల్ ఏరియాన్ (మెప్మా) ఆధ్వర్యంలో, గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్ డీఏ నుంచి కార్యకలాపాలు నడిచేవి. మూడు మాసాలుగా మెప్మాను డీఆర్‌డీఏ కిందకు తీసుకు వచ్చి గ్రామీణ, పట్టణ ప్రాంతాల మహిళ సమాఖ్యలకు ఒకే విధమైన ప్రయోజనాలు అందేలా కార్యాచరణ తీసుకున్నది. జిల్లాల వారీగా మహిళా సంఘాల్లో ఉండే నిరక్ష రాస్యులను వంద శాతం అక్షరాస్యత వైపు తీసుకెళ్లాల నేది ప్రభుత్వం లక్ష్యంగా చేసుకున్నది. జిల్లాలో 1.1లక్షల మహిళలు గ్రామీణ ప్రాంతాల్లో సంఘాలుగా ఉన్నారు. జిల్లాలో మొత్తం 10,750 సంఘాలు ఉన్నా యి. ఇందులో 49500మంది నిరక్షరాస్యులుగా ఉన్నట్లు ప్రభుత్వం తేల్చింది. మొదటి విడుతగా 28326 మం దిని అక్షరాస్యులుగా చేయాలనేది డీఆర్‌డీఏ లక్ష్యంగా పెట్టుకున్నది. వీరిని సంవత్సర కాలంలో అక్షరాస్యు లను చేయాలనేది కాలపరిమితిగా ప్రయత్నాలు చేస్తోంది. నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించేందు కు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఉల్లాస్ యాప్‌లో నమోదు చేసే విషయంలో, గుర్తించే విషయంలో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలో ప్రథమస్థానంలో ఉన్నది. మహిళా సంఘం రుణం పొందితే అందులో ఒక మహిళ చనిపోతే ఆ మహిళపై ఉన్న అప్పు మహిళా సంఘం చెల్లించాల్సి ఉంటుంది. కానీ బీమా వల్ల ఆమెపై ఉన్న అప్పును బీమా సంస్థనే చెల్లించేలా ప్రభుత్వం సహకరిస్తున్నది. స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళలందరికి ప్రమాద బీమా కింద రూ. 10లక్షలు వచ్చేలా చర్యలు తీసుకుంటు న్నది. సంఘాల్లో ఉండే మహిళలు ప్రమాదవశాత్తు చని పోతే రూ. 10లక్షలు వచ్చేలా ఈ పథకం రూపొం దించింది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల మంది స్వయం సహాయక సం ఘాల్లో సభ్యులుగా ఉన్నారు. 18 నుంచి 60ఏళ్ల వయసు ఉన్న వారు మాత్రమే ఈ సంఘాలకు అర్హులు. 60ఏళ్లు దాటిన మహిళలు కూడా గ్రూపు లుగా తయారు చేయాలని, వృద్ధ మహిళలకు కూడా హక్కులు ఉంటాయని ప్రభు త్వం నిర్ణయం తీసుకు న్నది. అంతేకాకుండా 14నుం చి 18ఏళ్ల బాలికలను స్వయం సహాయ సంఘాలుగా ఏర్పాటు చేయాలని చూస్తున్నది. ఎవరికి వారుగా ఉన్న వికలాంగులను కూడా గ్రూపులుగా చేసి అందులో స్త్రీ, పురుష సంఘాలను ఏర్పాటు చేసి ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చుతూ ఆర్థిక స్వయం శక్తివైపు నడిపించేందుకు ప్రభుత్వం యోచిస్తున్నది.

## కూటమి ప్రభుత్వంలో మహిళా వ్యతిరేక పాలన : వరుదు కల్యాణి




**వైయస్సార్ జిల్లా :** కూటమి ప్రభుత్వంలో మహిళా వ్యతిరేక, ప్రజాకంటక పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కల్యాణి మండిపడ్డారు. కడప వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మహిళలతో సమావేశమైన ఆమె తొలుత వైయస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళు లు అర్పించారు. రాష్ట్రంలో పార్టీ మహిళా విభాగం చేపట్టాల్సిన అంశాలు, మహిళా సమస్యలపై జిల్లా కమిటీలతో వరుదు కల్యాణి చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలందరినీ కలుపుకుని మహిళలకు రక్షణ కోసం పోరాటం చేస్తున్నామన్నారు. వైఎస్ జగన్ హయాంలో మహిళా సానుకూల ప్రభుత్వం నడిచిందని, అన్ని విధాలా మహిళలకు న్యాయం చేసిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ నిలిచారన్నారు. జగన్ కంటే ఎక్కువ మేలు చేస్తానని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చేతులు ఎత్తేసిందన్నారు. ఇచిన హామీలు తుంగలో తొక్కారని, అయినా సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. మహిళలకు రూ. 1500 ఎప్పుడిచ్చారని ప్రశ్నించారు. స్త్రీ శక్తి పేరుతో ఐదు బస్సులకే పరిమితం చేశారని ఆమె ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి ఎక్కడకు పోయిందని, రైతులకు అన్నదాత సుఖీభవ పేరుతో బాబు టోపీ పెట్టారని కల్యాణి అన్నారు. వికలాంగుల పింఛన్లలో కోత కోయడానికి కూడా ఈ ప్రభుత్వం వెనుకాడలేదని, తల్లికి వందనం మొదటి ఏడాది ఎగ్గొట్టి సూపర్ సిక్స్ సూపర్ హిట్ అని ఎలా అనగలుగుతున్నారని ఆమె నిలదీశారు. ఏ ఒక్కమహిళపై చేయి వేసినా, అదే వారికి చివరి రోజు అని చంద్రబాబు అన్నారని, అయితే ఆయన సొంత ఎమ్మెల్యేలే అఘాయిత్యాలకు పాల్పడుతుంటే నోరు మెదపడం లేదని కల్యాణి ఎద్దేవా చేశారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, ఎన్నికల సమయంలో బాహుబలి పాలన అని ఇప్పుడు నరబలి చూపిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ కూటమి ప్రభుత్వంలో మహిళా ఎమ్మెల్యేలు ఉన్నా వారు నోరు మెదపరన్నారు. పోలీసులను రెడ్ బుక్ రాజ్యాంగం అమలుకు వినియోగిస్తున్నారన్నారు. మాట్లాడితే రుషికొండ బీచ్ భవనాలు సందర్శించే బదులు సుగాలి ప్రీతి కి న్యాయం చేయవచ్చు కదా? అని ఆమె నిలదీశారు. పోరాటాల నుంచి పుట్టిన పార్టీ వైఎస్సార్‌సీపీ అని, తప్పకుండా మహిళలకు న్యాయం జరిగే వరకు పోరాటాలు సాగుతూనే ఉంటాయన్నారు. మళ్ళీ వైఎస్ జగన్ సీఎం కావాలంటే మహిళలందరూ కంకణం కట్టుకుని ముందుకు నడవాలని పిలుపునిచ్చారు.

## నాంపల్లి బీజేపీ ఆఫీసు వద్ద హైటెన్షన్..



**హైదరాబాద్ :** నాంపల్లిలోని బీజేపీ రాష్ట్రకార్యాలయం వద్ద భారీగా టెన్షన్ వాతావరణం చోటుచేసుకుంది. బీజేపీ మహిళా మోర్చా నేతలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ నేతలు నినాదాలు చేస్తున్నారు. మహిళా నేతలు గేట్లు ఎక్కి బయటకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. వివరాల ప్రకారం.. బీహార్ ఎన్నికల్లో 'ఓటర్ అధికార్ యాత్ర' పేరుతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ యాత్రలో కొందరు వ్యక్తులు ప్రధాని మోదీ తల్లిని దూషిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో తెలంగాణ బీజేపీ నిరసనలకు పిలుపునిచ్చారు. దీంతో, పోలీసులు బీజేపీ కార్యాలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇప్పటికే పలువురు నేతలను హౌజ్ అరెస్ట్ చేశారు పోలీసులు. మరోవైపు.. కాసేపటి క్రితమే బీజేపీ మహిళా మోర్చా నేతలు బీజేపీ ఆఫీసు వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి వారంతా నిరసనలకు బయలుదేరుతున్న సమయంలో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో గేటు మీద నుంచి దూకి నిరసన తెలి పేందుకు బీజేపీ మహిళా నేతలు ప్రయత్నించారు. ఈ సందర్భంగా పోలీసులు, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## ఓటర్ల జాబితా సవరణను మరోసారి నిర్వహించాలి

రాష్ట్ర ఎన్నికల సంఘానికి భారాస వినతి

**హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు, వరదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను తక్షణమే వాయిదా వేయాలని భారాస రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరింది. భారాస ఎమ్మెల్సీలు ఎల్. రమణ, దాసోజు శ్రవణ్ తదితర నేతలు ఆదివారం రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులను వారి కార్యాలయంలో కలిసి తమ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ రాసిన లేఖను అందజేశారు.

## నేడు ప్రజావాణి ఉండదు

జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




భద్రాద్రి కొత్తగూడెం : నేడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యాలయంలో ప్రజావాణి ఉండదని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అత్యధిక వర్షాలు పడే అవకాశం ఉన్నందున కొత్తగూడెం డివిజన్ భూ సమస్యలకు సంబంధించి కొత్తగూడెం ఆర్డిఓ ఆఫీస్'లో, భద్రాచలం డివిజన్ భూ సమస్యలు భద్రాచలం సబ్ కలెక్టర్ ఆఫీసులో ప్రజలు తమ దరఖాస్తులు అందజేయాలని, వేరే ఇతర సమస్యలపై దరఖాస్తులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఇన్ వర్డ్ సెక్షన్లో అందజేసి రసీదు పొందువచ్చని, వారు సంబంధిత అధికారులకు పంపిస్తారని ఆయన తెలిపారు.

## చర్యలన్నీ అప్పుడే.. కాళేశ్వరంపై మంత్రి ఉత్తమ్ ఆసక్తికర వ్యాఖ్యలు



**హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీలో వాడీవేడి చర్చ జరుగుతోంది. పంచాయతీరాజ్, మున్సిపల్ బిల్లుల సందర్భంగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. మరోవైపు.. కాళేశ్వరం రిపోర్టుపై ఈరోజు సాయంత్రం నాలుగు గంటలకు చర్చ జరుగుతుందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. తెలంగాణ అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చిట్ చాట్‌లో మీడియాతో మాట్లాడుతూ.. 'కాళేశ్వరం రిపోర్టుపై సాయంత్రం చర్చ జరుగుతుంది. కాళేశ్వరం కమిషన్ రిపోర్టును హౌస్‌లో ఫ్లోర్ లీడర్లకు హార్డ్ కాపీ ఇచ్చాం. మెంబర్స్ అందరికీ సాఫ్ట్ కాపీనే ఇచ్చాం. సభలో సాయంత్రం చర్చ ఉంటుంది. ఎంత ఆలస్యం అయినా ఈ రోజు సభలో కాళేశ్వరంపై సంపూర్ణ చర్చ జరుగుతుంది. కేసీఆర్ తరఫున హరీష్ రావుకి కాపీ ఇచ్చాం. అన్ని పార్టీల అభిప్రాయాలు తెలుసుకుంటాం. కోర్టు విషయాలపై మాట్లాడను. సభలోనే అన్ని మాట్లాడతాం. చర్చ తర్వాతనే తదుపరి విచారణ ఏంటి దానిపై నిర్ణయం ఉంటుంది' అని చెప్పుకొచ్చారు.

## భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం..



**భద్రాచలం :** ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఆదివారం ఉదయం 9 గంటలకు గోదావరి ప్రవాహం 48 అడుగులు దాటింది. దీంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. స్నాన ఘట్టాల ప్రాంతం వద్ద చాలా మెట్లు, విద్యుత్ స్తంభాలు నీటిలో మునిగాయి. కల్యాణ కట్ట వరకు వరద నీరు చేరింది. నీటిమట్టం పెరగడంతో భక్తులు స్నానాలు చేయడానికి నదిలోకి వెళ్లొద్దని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. తూరుబాక వద్ద ప్రధాన రహదారిపై వరద నీరు చేరడంతో దుమ్ముగూడెం, చర్ల, వాజేడు, వెంకటాపురం మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి వరదతో వీఆర్‌పురం, కూనవరం, చింతూరు మండలాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి.

## సంక్షిప్త వార్తలు

### బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

ఏపీలో 3 రోజుల పాటు భారీ వర్షాలు




**అమరావతి :** పశ్చిమ బెంగాల్ –ఒడిశా తీరాలను ఆనుకుని వాయవ్య బంగాళాఖాతం మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్ట్ ప్రఖర్ జైన్ తెలిపారు. దీనివల్ల వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని పేర్కొన్నారు. దీని ప్రభావంతో రాష్ట్రంలో 3 రోజుల పాటు అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపారు. తీరం వెంబడి గంటకు 40 నుంచి 60 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందన్నారు. బుధవారం వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని సూచించారు. ఇప్పటికే ప్రభావిత జిల్లాల అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు ప్రఖర్ జైన్ వెల్లడించారు. ప్రజలు చెట్ల కింద శిథిలావస్థలో ఉన్న భవనాలు హెూర్డింగ్స్ వద్ద ఉండరాదని హెచ్చరించారు. అప్రమత్తంగా ఉండాలని లోతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రఖర్ జైన్ సూచించారు.

### పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పేరిట ఏపీకే ఫైల్స్

వాట్సాప్‌లో లింకులు పంపుతున్న సైబర్ నేరగాళ్లు

ఒకసారి క్లిక్ చేస్తే ఫోన్‌ను కంట్రోల్‌లోకి తీసుకొని మోసాలు

అనుమానాస్పద మెసేజ్‌లలో లింక్‌లపై క్లిక్ చేయొద్దంటున్న పోలీసులు




**హైదరాబాద్ :** సైబర్ నేరగాళ్లు ఎవరినీ వదలడం లేదు. మోసం చేయడానికి ఏ చిన్న అవకాశం ఉన్నా.. తమదైన స్టయిల్‌లో రెడీ అవుతున్నారు. తాజాగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని తమ మోసాలకు అనుగుణంగా మార్చుకున్నారు. రైతులే లక్ష్యంగా ఈ తరహా కొత్త మోసానికి తెరతీశారు. వాట్సాప్‌లో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పేరిట మెసేజ్‌లు పంపుతూ వాటిలో కొన్ని లింక్‌లు పెట్టి ఏపీకే (ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీ)ఫైల్స్ పంపుతున్నట్టు పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి అనుమానాస్పద మెసేజ్‌లలోని లింక్‌లపై ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయొద్దని సూచిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సైతం ఈ మేరకు కొన్ని సూచనలు చేసింది. సోషల్ మీడియా, ఇతర ప్లాట్‌ఫామ్‌లలో వ్యాప్తి చెందుతున్న నకిలీ సందేశాలు, లింక్‌ల పట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించింది.

#### పీఎం కిసాన్ వాట్సాప్ స్కామ్ అంటే ఏమిటి?

ఈ స్కామ్‌లో సైబర్‌నేరగాళ్లు పీఎం కిసాన్ శాఖ నుంచి ప్రభుత్వ అధికారులమని చెప్పుకుంటూ వాట్సాప్‌లో సందేశాలు పంపుతారు. పథకంలో కొత్తగా నమోదు చేసుకునేందుకు, మీ ఖాతాలో జమైన డబ్బుల వివరాలు పొందేందుకు ఆ సందేశంలోని లింక్‌పై క్లిక్ చేసి కొన్ని వివరాలు నమోదు చేయాలని సూచిస్తారు. దీనిని నమ్మి లింక్‌పై క్లిక్ చేయగానే మన ఫోన్‌ను హ్యాక్ చేస్తారు. ఆ తర్వాత ఆధార్, పాన్‌కార్డు వంటి వ్యక్తిగత సమాచారాన్ని అడుగుతారు. ఆ తర్వాత ఓటీపీ వస్తుంది. సైబర్ నేరగాళ్లు ఆ సమాచారం, ఓటీపీ పొందిన తర్వాత మన బ్యాంక్ ఖాతాకు యాక్సెస్ పొందుతారు. ఫలితంగా ఆర్థిక మోసం జరుగుతుంది. మన వ్యక్తిగత సమాచారం, ఫోన్ గ్యాలరీలోని ఫొటోలు తీసుకొని డేటా థెఫ్ట్‌తోపాటు మన ఫొటోలు, వీడియోలు మార్ఫింగ్ చేసి ఆన్‌లైన్ వేధింపులకు గురిచేస్తూ డబ్బు డిమాండ్ చేసే ప్రమాదమూ ఉంది.

#### ఈ జాగ్రత్తలు మరవొద్దు

ప్రభుత్వ లోగో లేదా సీల్‌తో అవాంఛిత సందేశాలు వచ్చినా.. మన వ్యక్తిగత వివరాలు అడుగుతూ ఎస్ఎంఎస్‌లో పేర్కొన్నా, అది సైబర్ నేరగాళ్ల పని అని అనుమానించాలి. అనుమానాస్పద మెసేజ్‌లలోని ఏ లింక్‌పై క్లిక్ చేయొద్దు లేదా ఏ అటాచ్‌మెంట్‌ను డౌన్‌లోడ్ చేయొద్దు. సందేశం చట్టబద్ధంగా అనిపించినా, మన వ్యక్తిగత సమాచారం లేదా ఓటీపీలను షేర్ చేయొద్దు. ఏ సమాచారం కోసమైనా అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి నిర్ధారించుకోవాలి. ఇలాంటి అనుమానాస్పద లింక్‌లు మనకు తెలిసిన నంబర్ల నుంచి వచ్చినా వాటిని నమ్మి, లింక్‌లపై క్లిక్ చేయొద్దు. నకిలీ లింక్‌లు లేదా ఏపీకే ఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేయడం వల్ల ఫోన్ హ్యాకింగ్ అవడంతోపాటు డేటా దొంగతనం జరిగే ప్రమాదం ఉందని మరవొద్దు.


### వినాయక చవితి ఊరేగింపులో దూసుకెళ్లిన ట్రాక్టర్.. నలుగురు మృతి



**పశ్చిమ గోదావరి జిల్లా :** వినాయక చవితి ఊరేగింపులో అపశ్రుతి చోటు చేసుకుంది. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలలోని తూర్పుతాళ్ళు అనే గ్రామంలో డాన్స్ చేస్తున్న యువకులపై ఓ ట్రాక్టర్ దూసుకెళ్ళింది. ఈ దుర్ఘటనలో ప్రమాదవశాత్తు ట్రాక్టరు క్రింద పడి నలుగురు మృతి చెందారు. ఇద్దరికీ తీవ్ర గాయాలు. బాధితుల్ని అత్యవసర చికిత్స నిమిత్తం నరసాపురం ఆస్పత్రికి తరలించారు. మృతులు తూర్పు తాళ్ళు గ్రామానికి చెందిన తిరుమల నరసింహమూర్తి జి మురళి ఇమన సూర్యనారాయణదినేష్ పోలీసులు గుర్తించారు. గాయపడ్డ మరో ఇద్దరు క్షతగాత్రులను నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసుకున్న మొగల్తూరు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# కాళేశ్వరం నిర్ణయాలన్నీ కేసీఆర్‌వే!

- ఆయనపై చట్టరీత్యా చర్యలు తీసుకునే స్వేచ్ఛ సర్కారుకు ఉంది
- రాజకీయ కార్యనిర్వాహకుడిగా కాకుండా పాలనాధికారిగా వ్యవహరించారు
- మంత్రివర్గ ఆమోదం లేకుండానే బరాజ్‌ల నిర్మాణానికి అనుమతులు
- దురుద్దేశంతో అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు
- నీటి నిల్వకు వాడడంతోనే బరాజ్‌ల వైఫల్యం
- జస్టిస్ పీసీ ఘోష్ నివేదికలో స్పష్టీకరణ.. నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సర్కారు



**హైదరాబాద్ :** ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు రీఇంజనీరింగ్ పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టాలని, అందులో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను నిర్మించాలని తీసుకున్న నిర్ణయం నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక్కరిదేనని జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ తేల్చి చెప్పింది. 'ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు రీఇంజనీరిం గ్‌ను సాకుగా చూపి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాల న్న ఆలోచన ఆయనదే. ప్రాజెక్టు అంకురార్పణ దశ నుంచి ప్రతి నిర్ణయాన్ని ఆయనే స్వయంగా తీసుకు న్నారు. డీపీఆర్‌ల తయారీ వ్యాప్కోస్‌కు అప్పగింత, తుది డీపీఆర్ అందకముందే అంచనాలను తయారు చేసి ఆమోదించడం, బరాజ్‌లలో నీరు నిల్వ చేయాల ని ఆదేశించడం, కాంట్రాక్టర్లకు అనుచిత లబ్ధి కలిగించేలా నిబంధనలు మార్చాలని ఆదేశించడం వెనక ఆయన నిర్ణయాలే ఉన్నాయి. మూడు బరాజ్‌ల నిర్మాణానికి ప్రణాళికలు, నిర్మాణం, నిర్వహణలో నాటి సీఎం సూక్ష్మంగా భాగస్వాములయ్యారు. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు బరాజ్ లొకేషన్ మార్చాలనే నిర్ణయం ఆయనదే. రాజకీయ కార్యని ర్వాహకుడిగా వ్యవహరించాల్సిన నాటి సీఎం.. పాలనాధికారిగా వ్యవహరించి రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు తీవ్ర నష్టం కలిగించారు. చట్ట ప్రకారం ప్రభుత్వం ఆయనపై తగిన చర్యలు తీసుకునే స్వేచ్ఛ సర్కారుకు ఉంది'అని కమిషన్ సిఫారసు చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై విచారణకు ఏర్పాటైన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికను ఆదివారం శాసనసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ నివేదిక 665 పేజీలతో 3 సంపుటిలుగా ఉంది. నాటి ఆర్థిక మంత్రి (ఈటల) తన బాధ్యతలను ఆదమరిచి నాటి సీఎం కోరికలు తీర్చుకునేందుకు సహకరించారని తప్పుబట్టింది.

#### నివేదికలోని ముఖ్యాంశాలు

మంత్రివర్గ ఆమోదం లేకుండానే : మేడిగడ్డ, అన్నా రం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణానికి 2016, మార్చి 1న మూడు జీవోలు (నెం. 231, 232, 233) జారీ చేశారు. ఆ తర్వాతి దశలోనూ మంత్రివర్గం నుంచి ర్యాటిఫికేషన్ పొందలేదు. నాటి సీఎం(కేసీఆర్), మాజీ నీటిపారుదల మంత్రి (హరీశ్) మాత్రమే ఆ మోదించారు. ప్రభుత్వ బిజి నెస్ రూల్స్‌లోని నిబం ధనలను ఉల్లంఘిస్తూ పరిపాలనపర అనుమతుల జారీ చేశారు. టర్న్ కీ విధానంలో కాళేశ్వరం ప్రాజె క్టు నిర్మించాలని వ్యాప్కోస్ చేసిన సిఫారసులను కాళేశ్వరం ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (కైఐపీసీఎల్) విస్మరించింది. ప్రాజెక్టు రూపకల్పన, మదింపు, ఆమోదించడం, నిధుల విడుదల, అమలు బాధ్యత, నిర్వహణ, పర్యవేక్షణ, మూల్యాంకనానికి కేఐపీసీఎల్‌ను ఏర్పాటు చేయగా, ఈ ప్రక్రియల్లో కేఐ పీసీఎల్‌ను ప్రభుత్వం భాగస్వామ్యం చేయలేదు. కేవ లం నిధుల సేకరణ, బ్యాంకులు, ఆర్థిక సంస్థ నుంచి రుణాల సమీకరణ, నిర్మాణ సంస్థలకు బిల్లుల చెల్లిం పులకే కేఐపీసీఎల్‌ను సర్కారు పరిమితం చేసింది. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు అనేక మార్పులు చేసి కాళేశ్వరం ప్రాజెక్టుగా పేరు మార్చారని నీటిపారు దల శాఖ మాజీ ముఖ్యకార్యదర్శి ఎస్‌కే జోషి చెప్పారు. నాటి సీఎం అధ్యక్షతన నిపుణులతో నిర్వహించిన చాలా సమావేశాల్లో కట్టడాల రకం, వాటి సామర్థ్యం, లొకేషన్, ప్లాన్ అలైన్‌మెంట్‌కు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడానికి గూగు ల్ మ్యాప్‌లను విస్తృతంగా వినియోగించారు. '2015, ఫిబ్రవరి 4న మహారాష్ట్ర, ఏపీతో జరిగిన భేటీలో తమ్మిడి హెట్టి బరాజ్ ఎత్తు తగ్గించే అవకాశాలను పరిశీలించాలని నిర్ణయించారు. 2016, ఆగస్టు 23న జరిగిన భేటీలో.. మేడిగడ్డ బరాజ్ ఎత్తు పెంపుపై వాస్తవ ముంపు మేరకు అంత్రరాష్ట్ర బోర్డు తుది నిర్ణయం తీసుకుంటుందని నిర్ణయించారు. 2016, మార్చి 1న మూడు బరాజ్‌ల నిర్మాణానికి జీవోలు జారీ అయ్యాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద బరాజ్‌ల నిర్మాణానికి హైపవర్ కమిటీ సిఫార్సు చేయలేదు. తుమ్మిడి హెట్టి, మేడిగడ్డ వద్ద బరాజ్‌ల నిర్మాణంతో లాభనష్టాలను నిపుణుల కమిటీ అధ్యయనం చేసింది. మేడిగడ్డ వద్ద బరాజ్ నిర్మాణం సరికాదని, ఆర్థికంగా ప్రయోజనకరం కాదని సూచించింది. ప్రాణహిత నదిపై వేమనపల్లి వద్ద నిర్మాణం చేపట్టాలని ప్రత్యామ్నాయం చూపింది. ఈ నివేదికను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకపోగా, కోల్డ్ స్టోరేజీలో పెట్టింది. ఇది ఇప్పటివరకు బహిర్గతం చేయలేదు. 2016, మార్చి 7న జీవో నంబర్ 655 ప్రకారం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ కూడా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద బరాజ్‌లకు ప్రతిపాదించలేదు. 2015, ఏప్రిల్ 13న మేడిగడ్డ నుంచి మిడ్ మానేర్ వరకు డీపీఆర్ రూపొందించే బాధ్యతను వాప్కోస్‌కు అప్పగిస్తూ రూ. 5.94కోట్లతో పరిపాలన అనుమ తులు జారీ చేశారు. ఈ నోట్ ఫైల్‌ను నాటి సీఎం, నీటి పారుదల మంత్రి ఆమోదించారు. అదే ఏడాది జూన్ 3న దీన్ని కేబినెట్ ఆమోదించింది. మంత్రివర్గ ఆమోదం లేకుండానే 2016 జనవరిలో అంచనా లను రూ. 6.77 కోట్లు పెంచారు. ఎల్లం పల్లి–మేడిగడ్డ మధ్య రెండు బరాజ్‌ల నిర్మాణానికి డీపీఆర్ తయారీ కోసం 2016 మార్చిలో రూ. 12.96 కోట్లతో వ్యాప్కోస్‌కు పనులు అప్పగి స్తూ పరిపాలన అనుమతులిచ్చారు. వాప్కోస్ డీపీఆర్ సమర్పిం చిందా? లేదా? అన్నది ఇప్పటికీ స్పష్టత లేదు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు, 3 విద్యుత్ కేంద్రాలకు సంబంధించి డీపీఆర్‌లోని కొంత భాగాన్ని జనవరి, 2016లో.. మార్చి 27న తుది డీపీఆర్ సమర్పించింది. అనుమతులు జారీ చేసి తర్వాతి జులై/ఆగస్టు నెలల్లో కాంట్రాక్టర్లతో ఒప్పందాలు చేసుకున్నారు. 2017 ఫిబ్రవరిలో డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి పంపించారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు నీటిలభ్యతపై 2015 లో, కాళేశ్వరం ప్రాజెక్టుకు నీటిలభ్యత విషయంలో 2017లో సీడబ్ల్యూసీ రాసిన లేఖల్లో అంశాలు ఒకే లా ఉన్నాయి. 2015లో సీడబ్ల్యూసీ రాసిన లేఖ ఆధారంగా తుమ్మిడి హెట్టి వద్ద బరాజ్ నిర్మాణం సాధ్యం కాదని భావనకు వస్తే.. 2017లో రాసిన లేఖ ఆధారంగా మేడిగడ్డ బరాజ్ నిర్మాణం సైతం సాధ్యం కాదు. 2018, మే 1 నాటికి సీడబ్ల్యూసీ కాళేశ్వరం ప్రాజెక్టు ఆర్థిక వ్యయాన్ని ఆమోదించ కుండా అధ్యయనం జరుపుతోంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం 2018, మార్చిలో ప్రాజెక్టు అంచనాలను రూ. 30,623.72 కోట్ల నుంచి రూ. 80,190.46 కోట్లకు పెంచేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణా నికి ముందే సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్స్ రీసెర్చ్ స్టేషన్‌తో అధ్యయనం జరిపించాల్సి ఉండ గా, పనులు తు దిదశలో ఉన్నప్పుడు జరపాల్సిన అవసరం లేదని ఈ విభాగ డైరెక్టర్ 2018, మే 21న లేఖ రాశారు. సీడబ్ల్యూసీ నుంచి అవసరమైన అనుమతులు పొందకుండానే, ప్రాజెక్టు డీపీఆర్ పరిశీలనకు దర ఖాస్తు చేసుకోకుండానే 2016, మార్చి 1న పరిపాలన అనుమతులు మంజూరు చేయడమే కాకుండా ఒప్పందాలు కుదుర్చుకు న్నారు. సవరించిన పరిపాలన అనుమతులపై సీఎం, మంత్రి ముందు నోట్‌ఫైల్ ఉంచడానికి ముందే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ 2018, మే 19న ఆమోదం తెలిపారు. అత్యవసర దృష్ట్యా ఆదేశాలు జారీ చేయవచ్చన్నారు. అదే నెల 27న కేబినెట్ ఆమోదం తెలిపింది. స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ ముందస్తు ఆమోదం లేకుండా అంచనాలు పెంచి అక్రమాలకు పాల్పడ్డారు. నిర్దేశిత గడువుతో పోల్చితే మేడగడ్డ నిర్మాణానికి 6 రెట్లు, అన్నారానికి 5 రెట్లు, సుందిళ్లకు 8 రెట్లు సమయం ఇచ్చారు. సైట్ అప్పగింత, డిజైన్ల కారణంగానే ఆలస్యం జరిగిందని కాంట్రాక్ట్ సంస్థల వాదనకు అధికారులు అంగీకారం తెలిపారు. ఒప్పందంలోని క్లాజ్ 26, 31లను అధికారులు ఉల్లంఘించారు. ఆలస్యమైనా ఎలాంటి జరిమానా విధించలేదు. 2017, మార్చి వరకు నిర్మాణ స్థలాన్ని అప్పగించలేదు. ఫీల్డ్ అధ్యయనాలు, పరిశోధనలు చేపట్టకుండానే బ రాజ్‌ల డిజైన్లను సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ త యారు చేసింది. డిజైన్ల తయారీకి ముందు కనీసం 3డీ, 2డీ మోడల్ స్టడీస్ కూడా నిర్వహించలేదు. బరాజ్‌ల పేరుతో నీటిని నిల్వ చేసే రిజర్వాయర్లు/డ్యామ్స్‌గా నిర్మిం చారు. నీటిని మళ్లించేందుకు విని యోగించే బరాజ్‌లను నీటిని నిల్వ చేసే అవసరాలకు వాడినట్టు అధికారులు అంగీకరించారు. కాని వాటిని రిజర్వాయర్లు/డ్యామ్‌లుగా డిజైన్ చేయలేదు. ఈ కారణంతోనే అవి విఫలమయ్యాయి. క్వాలిటీకి సంబంధించి కమిషన్‌కు సమర్పించిన రిజిస్టర్లు, పుస్తకాల్లో కొన్ని అదనంగా పేజీలు పిన్ చేయడం, కొన్ని టై చేయడం చేశారు. పేజీల సంఖ్య క్రమా నుగుణంగానే లేదు. 2019, ఆగస్టు 6న మేడిగడ్డ 'కంప్లీషన్ సర్టిఫికెట్' జారీ చేయమని ఏజెన్సీ కోరడం.. సర్టిఫికెట్ అధికారులు జారీ చేయడం తప్పు. బాధ్యతాలోపం కా లాన్ని ఏజెన్సీ తప్పుగా ప్రస్తావించింది. ఒప్పందం ముగిసిపోయినట్టు ఎలాంటి సర్టిఫికెట్ జారీ కానందున మేడిగడ్డ నిర్మాణ పనులు ఇంకా పూర్తి కానట్టే లెక్క. దీని కారణంగా లోపాలకు బాధ్యతాకాలం, ఆపరేషన్, నిర్వహణ కాలం నిర్ధారించలేదు. అధికారులు, ఏజెన్సీలు ఒకరితో ఒకరు కుమ్మక్కై దురుద్దేశంతో చెడు మార్గంలో అక్రమ లబ్ధి పొందేందుకు పనిచేశారు. తద్వారా మేడిగడ్డ నిర్మాణానికి ప్రజాధనం భారీగా ఖర్చు చేశారు. డీపీఆర్ తయారీని వాప్కోస్‌కు అప్పగిస్తూ జీవో జారీకి సంబంధించి నోట్‌ఫైల్‌పై నీటి పారుదల మంత్రి , ముఖ్యమంత్రి సంతకా లున్నాయి. జీవో జారీ చేసిన తర్వాత కేబినెట్ ఆమో దించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు పరిపాలన అనుమతిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయగా, నోట్ ఫైల్‌పై వీరి సంతకాలు మాత్రమే ఉన్నాయి. ఆర్థికమంత్రి సంతకం లేదు. పరిపాలన అనుమతి (2016, మార్చి 1) తర్వాతే కేబినెట్ సబ్ కమిటీ (2016, మార్చి 15) ఏర్పాటైంది. 3సార్లు భేటీ అయ్యి నివేదిక అందజేసింది.

### ప్రభుత్వాలకు ఇరిగేషన్ ప్రాజెక్టులు ఎటిఎంలు: అక్బరుద్దీన్ ఓవైసీ



**హైదరాబాద్ :** ప్రభుత్వాలకు ఇరిగేషన్ ప్రాజెక్టులు ఎటిఎంలుగా మారాయని అసెంబ్లీలో అక్బరుద్దీన్ ఓవైసీ ఫైర్ అయ్యారు. ప్రాజెక్టులు మారవు కేవలం పాస్ వర్డ్‌లు మారుతాయి. వైఎస్సార్ మరణం తో జలయజ్ఞం నిర్వీర్యం అయింది. చాలా ప్రాజెక్టులు పెడింగ్‌లో పడ్డాయి. ఉమ్మడి శాసనసభలో ఇరిగేషన్ పై ఆనాడు గంటల పాటు డిబేట్ జరిగేవి. కాళేశ్వరం నుండి చుక్క నీరు తీసుకోలేదు అని మంత్రి ఉత్తమ్ అన్నారు. మెడిగడ్డ అక్కడ కట్టారు... ఇక్కడ నుండి మార్చారు అని సుదీర్ఘంగా చర్చ జరిగింది. కాళేశ్వరం మరమ్మతులు చేస్తారా ఆపేస్తారా క్లారిటీ ఇవ్వండి. వాళ్ళు ఇంత తిన్నారు అంత తిన్నారు నేను వాటి జోలికి పోను. కాలేశ్వరంలోని నీటిని ఏం చేయాలనుకుంటున్నారు. క్యాబినెట్ అప్రూవల్ తోనే సభలో కమిషన్ రిపోర్ట్ టేబుల్ చేశామని ప్రభుత్వం చెప్తుంది..మరి అంతకంటే ముందే కమిషన్ రిపోర్ట్ వివరాలు మీడియాలో ఎలా బహిర్గతం అయ్యాయి. సభలోని సభ్యుల ముందుకు రాకుండానే మీడియాలో రిపోర్టు రావడం సభ సభ్యులను అగౌరపరచడమే. దేశంలో అన్ని రాజకీయ పార్టీలకు కాంట్రాక్టు కంపెనీలు ఎలెక్షన్ బాండ్స్ ఇచ్చాయి. పార్టీ కి మాత్రమే ఇవ్వలేదు. కాంట్రాక్టర్లు పార్టీకి ఫండింగ్ ఇచ్చే సాంస్కృతి మంచిది కాదు. ఏ పార్టీ అధికారంలో ఉన్న ఆ కాంట్రాక్టు కంపనీ అక్కడ ఉంటుంది ఇక్కడ ఉంటుంది. మొత్తం ఘోష్ కమిటీ రిపోర్టు లో కాంట్రాక్టు కంపనీ పేర్లు ఎందుకు పేర్కొనలేదు. అన్ని రిపోర్టులు ఉన్నాయి అంటున్నారు మరి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు. అవినీతి పరులను ఎదో చేసేస్తారు అంటూ ప్రజలు అనుకున్నారు కానీ చేసింది ఏమి లేదు. అవినీతి కాంట్రాక్టు చిన్న పెద్ద అని చూడకుండా ప్రతి ఒక్కరిని శిక్షించండి. పెద్ద కాంట్రాక్టు సంస్థలను ఎందుకు కాపాడుతున్నారు. పెద్ద కాంట్రాక్టు కంపనీలు కాంగ్రెస్ పార్టీకి ఎలెక్షన్ బాండ్స్ ఇచ్చాయి.

### పర్యావరణ పోటీల దరఖాస్తుల్లో జనగామ అగ్రస్థానం

**హైదరాబాద్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న పర్యావరణ పోటీలు–2025 దరఖాస్తుల్లో జనగామ జిల్లా జాతీయ స్థాయిలోనే తొలి స్థానాన్ని దక్కించుకుంది. దేశవ్యాప్తంగా 727 జిల్లాల నుంచి 15.48 లక్షల మంది పాల్గొనగా... జనగామ ఒక్కజిల్లా నుంచే 75,156 మంది విద్యార్థులు పాల్గొనడంతో ప్రథమ స్థానంలో నిలిచింది. పర్యావరణంపై బాధ్యత గల యువ మేధావులను తయారుచేయాలన్న ఉద్దేశంతో అత్యధిక మందిని పాల్గొనేలా ప్రోత్సహించామని ఆ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

### పొన్నం ప్రభాకర్ పుష్కరాల మంత్రి



**హైదరాబాద్ :** పొన్నం ప్రభాకర్‌పై మాజీ మంత్రి గంగుల కమలాకర్ సెటైర్లు వేశారు. పొన్నం ప్రభాకర్ పుష్కరాల మంత్రి అంటూ వ్యాఖ్యానించారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలపై గంగుల చిట్ చాట్ చేశారు. సభలో ఉత్తం, శ్రీధర్ బాబు, సీతక్క బిల్లులను ప్రవేశపెట్టారు. పొన్నం ప్రభాకర్ సభలో ఉండి బిల్లుల పై మాట్లాడం లేదు. పొన్నంతో సంబంధం ఉన్న బిల్లుల గురించి తప్ప..మిగతా విషయాలు మాట్లాడుతున్నారు. పొన్నం ప్రభాకర్ పుష్కరాల మంత్రి. మళ్ళీ 12ఏండ్ల తర్వాతే పొన్నం గెలిస్తే..గెలుస్తారు. కరీంనగర్‌లో నేతలతో పొన్నంకు సఖ్యత ఉండదని ఎద్దేవా చేశారు.

### సంతానం కలుగడంలేదని ఉపాధ్యాయురాలు ఆత్మహత్య



**కాగజ్‌నగర్‌టౌన్/కౌటాల :** సంతానం కలుగడంలేదనే మనస్తాపంతో ఉపాధ్యాయురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల మేర కు కాగజ్‌నగర్ పట్టణంలోని ఎల్లగౌడ్‌తోటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు మిడిదొడ్డి కవిత (41)కు ఐదేళ్లక్రితం చరణతో వివాహమైంది. సదరు ఉపాధ్యాయురాలు కౌటాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్‌గా విధులు నిర్వహిస్తోంది. ఇప్పటి వరకూ సంతానం కలుగకపోవడంతో పాటు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆరోగ్యం నయం కాకపోవడంతో పాటు సంతానం లేకపోవడంతో మనస్తాపం చెందింది. శుక్రవారం రాత్రి భర్త బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. బయట నుండి వచ్చిన భర్త పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి అన్న రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# వీళ్ల బోధనకు... జాతీయ అవార్డు!

**నల్లబోర్డుపై సుద్దముక్కతో చెప్పే పాఠం కంటే ఉదాహరణలతో వివరిస్తే పిల్లలు చక్కగా నేర్చుకుంటారు. ప్రశ్నలడిగి జవాబు చెప్పమనే కంటే వస్తువులు, ఆకృతుల సహకారంతో వివరించమంటే ప్రతి ఒక్కరూ ముందుకొస్తారు... అందుకే దీన్నే మా బోధనా విధానంగా మార్చుకున్నాం అంటారు ఈ ఉపాధ్యాయురాళ్లు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయినులుగా ఎంపికైన ఈ ఇద్దరితో విలేకరులు మాట్లాడగా...**




## గూగుల్ డాక్యుమెంటరీ చేసింది: మాదాబత్తుల తిరుమల శ్రీదేవి



మాది తగరపువలస. బాపట్ల వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ హోమ్‌సైన్స్, ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఏ ఇంగ్లిష్, బీఈడీ పూర్తి చేశా. డిగ్రీ తర్వాత ఐటీడీఏలో ఏడాదిపాటు కమ్యూనిటీ డెవలప్మెంట్ కోఆర్డినేటర్‌గా పనిచేశా. తర్వాత డీఎస్సీ రాసి టీచరుగా ఉద్యోగంలో చేరా. గత 24 ఏళ్లుగా ఉపాధ్యాయవృత్తిలో కొనసాగుతున్నా. ప్రస్తుతం భీమిలిలోని పండిట్ నెహ్రూ పురపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా పనిచేస్తున్నా.

### సాంకేతికతతో...

కొవిడ్‌కు ముందు జీవీఎంసీ, గూగుల్ ఫ్యూచర్ క్లాస్‌రూమ్ ఇనిషియేటివ్‌లు సంయుక్తంగా విద్యార్థుల్లో పఠనా సామర్థ్యాలు పెంచేందుకు విశాఖలోని 147 పాఠశాలల్లో క్రోమ్‌బుక్స్, గూగుల్ వర్క్‌స్పేస్‌లు అమలు చేశాయి. పిల్లలకు అత్యాధునిక సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చారు. అప్పటికి కేడీపీఎం హైస్కూల్‌లో పనిచేస్తున్నా. విద్యార్థులకు సాంకేతికత చేరువ చేయడంతో వారికి అన్ని సబ్జెక్టుల్లో గ్రేడ్‌లు 15 శాతం పెరిగాయి. తర్వాత ఏడాది స్కూల్‌లో ప్రవేశాలు సగటున 12 శాతం పెరిగాయి. అప్పట్లోనే విద్యార్థులకు కాగితరహిత పరీక్షలు నిర్వహించాం. ఇక్కడి ఫలితాలను చూసి దేశంలోని మిగిలిన స్మార్ట్‌సిటీల్లోనూ ఈ ప్రాజెక్టును, మా బోధన విధానాన్ని అమలు చేశారు. దీన్ని మెచ్చిన గూగుల్ మాపై ప్రత్యేక డాక్యుమెంటరీ తయారుచేసింది. నేను జీవశాస్త్రం బోధిస్తుంటా. మూస పద్ధతిలో పాఠాలు చెబితే ఎవరూ ఆసక్తి చూపరు. అందుకే, ఉదాహరణలతో చెబుతున్నాం. వివిధ ప్రాజెక్టులు చేయిస్తూ వారిలో ఆసక్తి పెంచుతున్నాం. మారుతున్న కాలంతో పాటు బోధన విధానాలూ మారాలి. సాంకేతిక సాయమూ అవసరమే. మేం తరగతి గదుల్లో ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టూల్స్ (ఐసీటీ)ను వినియోగిస్తున్నాం. దీని ఫలితంగానే... ఏటికేడు ఫలితాలు మెరుగుపడుతున్నాయి. గతంతో పోలిస్తే మా దగ్గర ప్రవేశాలు 21 శాతం పెరిగాయి. విద్యార్థుల సంఖ్య ఎక్కువై ఒక్కోసారి చేర్చుకోలేమని చెప్పాల్సి వస్తోంది. పాఠశాలలో క్రమశిక్షణ, బోధన విధానాలు చూసి ఇక్కడ చేరేందుకు వివిధ మార్గాల్లో సిఫార్సు చేయించుకుంటారు. మా పిల్లలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని బహుమతుల్నీ సాధిస్తున్నారు. ఏ ఉపాధ్యాయురాలికైనా ఇంతకు మించిన సంతృప్తి ఉంటుందా!

### ప్రాజెక్టులెన్నో...

మా విద్యార్థులతో జల, వాయు కాలుష్యంపై ఇప్పటికే ఎన్నో ప్రాజెక్టులు చేయించాం. అందులో విశాఖ లాసన్స్‌బే కాలనీలో వర్షపు నీటిని ఒడిసిపట్టి, భూగర్భ జలాలు పెంపొందించడానికి చేసిన ఆక్వాకాన్ ప్రాజెక్టు ఒకటి. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా ఆ ప్రాజెక్టుకు జాతీయ స్థాయిలో అయిదో స్థానం లభించింది. యూఎన్‌డీపీ సాయంతో క్లౌడ్‌బరస్ట్‌పైన అవగాహన కల్పించాం. కుటుంబ సభ్యులు, తోటి ఉపాధ్యాయుల సహకారంతో ముందుకు సాగుతున్నా. తొలుత అవార్డుకు దరఖాస్తు చేయలేదు. అన్ని ప్రాజెక్టులు చేసి ఎందుకు చేయకూడదని సహోధ్యాయులు ప్రశ్నించారు. వారు ప్రోత్సహించడంతో.. ముందడుగు వేశా.

## అవార్డులు కొత్తేమీ కాదు: మారం పవిత్ర

నాకు సైన్స్‌పై ప్రేమ కలగడానికీ, ఎన్నో



పురస్కారాలు అందుకోవడానికీ సైన్స్ టీచర్లే కారణం. నా విద్యార్థులకీ అలా సబ్జెక్టు మీద ఆసక్తి కలిగేలా బోధించాలనుకున్నా. నేను జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిని. సూర్యాపేట జిల్లా, పెన్‌పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నా. సాంకేతికతను ఉపయోగించి ప్రయోగాల ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధిస్తున్నా. సత్ఫలితాలూ సాధిస్తున్నా. 2009లో రామన్నగూడెం యూపీఎస్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా నా ప్రయాణం మొదలైంది. 2023లో బదిలీపై పెన్‌పహాడ్ జడ్పీ ఉన్నత పాఠశాలకు వచ్చా. 6 నుంచి 10 తరగతుల విద్యార్థుల కోసం కార్డు, బోర్డు గేమ్స్‌తోపాటు ప్రత్యేకంగా తక్కువ ఖర్చుతో బోధన అభ్యసన సామగ్రిని తయారుచేస్తా. వాటితో ఆడిస్తూ పాఠ్యాంశాలపై అవగాహన పెంచుతున్నా. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయుల్లో నిర్వహిస్తున్న సైన్స్ పోటీలు, ఇన్‌స్పైర్, నేషనల్ చిల్డ్రన్స్ కాంగ్రెస్, అగస్త్య, అన్వేష, జిజ్ఞాస వంటి పోటీల్లో విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నా. తరగతి గదిలో వినూత్నంగా అవలంబిస్తున్న బోధనాభ్యసన ప్రక్రియ ఫలితాలతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించా. దీంతో సెమినార్లలో మాట్లాడే అవకాశాలొచ్చాయి. జీవశాస్త్ర పాఠ్యాంశాల్లో ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీని ఉపయోగించే విధానంపై ఉపాధ్యాయులకు శిక్షణనీ ఇస్తున్నా. నేను తయారుచేసిన 13 రకాల ఎగ్జిబిట్లను జాతీయ స్థాయి పోటీల్లో ప్రదర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దీక్ష పోర్టల్‌లో 99 వీడియో పాఠాలను అప్‌లోడ్ చేశా. ఇన్నేళ్లలో 'విక్రమ్ సారాబాయ్ టీచర్ సైంటిస్ట్' సహా ఎన్నో ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందుకున్నా. తాజాగా కేంద్ర ప్రభుత్వం నుంచి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికవ్వడం నా పట్టుదలకి ఓ గుర్తింపు. నా చిన్నప్పుడే నాన్న చనిపోతే అమ్మే మమ్మల్ని పెంచింది. ఆమె కష్టం వృథా పోవొద్దని కష్టపడి చదివా. పెళ్లైనా కొనసాగించి టీచరయ్యా. సైన్స్ నేర్చుకోవడానికీ, దానిపై ఇష్టం పెంచుకోవడానికీ మా మాస్టార్లే కారణం. వాళ్ల బాటలో నడిచి కష్టమని భావించే సైన్సు పట్ల పిల్లల్లో ఇష్టాన్ని పెంచాలనుకున్నా. అందుకోసమే నా ప్రయోగాలన్నీ. అవన్నీ ఫలించి విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తుండటం నాకు ఎక్కువ ఆనందాన్నిచ్చే అంశం.

# మగువ

## స్వచ్ఛ బీచ్‌ల కోసం!



**ఆమె హంగేరియన్. అయితేనేం, భర్త పెరిగిన నేల ఇది. అందుకే స్వచ్ఛంగా ఉంచాలనుకున్నారు. తనే జుజ్సన్నా ఫెర్రావ్. కుటుంబంతో కలిసి భారత్‌లోని బీచ్‌లను శుభ్రం చేసే బాధ్యతను భుజానకెత్తుకున్నారు. నేడు 20 వేల మంది వాలంటీర్లకు నాయకత్వం వహిస్తున్నారు. వీళ్లంతా కలిసి ఇప్పటికి 850 టన్నుల వ్యర్థాలను తొలగించారు.**




పన్నెండేళ్ల క్రితం ముంబయికి చెందిన వ్యాపారవేత్త లిస్బన్ ఫెర్రావ్‌ను పెళ్లి చేసుకున్నారు జుజ్సన్నా. 2017లో ఓ వారాంతం కుటుంబంతో ముంబయి, వసయీలోని బీచ్‌కి వెళ్లారు. అక్కడంతా ప్లాస్టిక్ బాటిళ్లు, మద్యం సీసాలు, ఇతరత్రా వ్యర్థాలతో నిండిపోవటం చూసి షాకయ్యారట. వీటి కారణంగా పిల్లలు హాయిగా ఆడుకోలేకపోవడాన్ని గమనించారు. దాంతో ప్రతి వారం బీచ్‌కి వెళ్లినప్పుడల్లా సంచీతో వెళ్లి పిల్లలతో సహా చెత్తను ఏరడం ప్రారంభించారు. ఆ ఫొటోలను సోషల్‌మీడియాలో పోస్ట్ చేసేవారు. వాటికి స్పందించిన మరెంతోమంది ఒక్కొక్కరుగా చేతులు కలిపారు. అలా మొదలైంది 'వసయీ బీచ్ క్లీనర్స్' ఉద్యమం. నాటి నుంచి ఆ ప్రాంతంలోని బైనా, భుయిగావ్, సురుచి, రణగావ్... ఇలా ఏడు బీచ్‌ల్లో చెత్తను ఏరుతున్నారు. సేకరించిన వ్యర్థాల్ని రీసైకిల్ చేసేందుకు ఓ స్థానిక సంస్థతోపాటు న్యూజిలాండ్‌కు చెందిన ఎన్జీవోతోనూ ఒప్పందం కుదుర్చుకున్నారు. అలా సుమారు 10 టన్నుల ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేయించారు. వీళ్లను చూసి స్థానిక ఎన్జీవోలూ పాఠశాలలూ కాలుష్యరహిత బీచ్‌లకోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. శుభ్రం చేసేందుకు ముందుకొస్తున్నాయి.

చెత్త తొలగింపుతోపాటు మడ అడవుల్లో మొక్కలను నాటడం, పేదలకు దుస్తుల పంపిణీ... వంటి కార్యక్రమాల్నీ చేపట్టిందీ బృందం. వీళ్ల కారణంగా స్థానికుల జీవన ప్రమాణాలతోబాటు పర్యాటక రంగమూ మెరుగుపడింది. బీచ్‌ల్లో మాదకద్రవ్యాల వాడకం తగ్గింది. 'విదేశీయులైన మీకెందుకీ కష్టం' అని ఎవరైనా ప్రశ్నిస్తే... 'మనది భూగ్రహం. కాపాడాల్సిన బాధ్యత మనందరిదీ. స్థానికతతో సంబంధం లేదు. అయినా ఈ బీచ్‌ల్లో నా భర్త ఆడుకున్నారు. అప్పట్లో స్వచ్ఛంగా ఉండేవని చెబుతుండేవారు. అలా వాటిమీద నాకూ ఇష్టం ఏర్పడింది. ఒక్కోసారి కాలుష్యం బారినపడి చనిపోయిన డాల్ఫిన్లూ తాబేళ్లూ కొట్టుకొస్తుంటాయి. వాటినలా చూసినప్పుడు మనిషి విధ్వంసం వల్లే కదా అనిపిస్తుంది. అందుకే బీచ్‌ల ప్రక్షాళనమీద మరింత దృష్టిపెట్టా' అంటారీమె.


# హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ జోన్

## నెలసరి ఆహారం!

**కొందరు మహిళలు నెలసరి వచ్చినప్పుడు ఉప్పు, చక్కెరతో కూడిన చిరుతిళ్లు ఎక్కువగా తినేస్తుంటారు. కానీ వీటి కన్నా ఐరన్, యాంటీఆక్సిడెంట్లు, పీచు లభించే పదార్థాలు తినటం మంచిది. నిజానికి ఇలాంటివి ఎప్పుడు తిన్నా మంచిదే గానీ నెలసరి సమయంలో తింటే మరింత మేలు. ఇవి నీరసం ఆవహించకుండా, అధికంగా ఉన్న ఈస్ట్రోజన్‌ను శరీరం మరింతగా శోషించుకునేలా, వాపు ప్రక్రియ తగ్గేలా చేస్తాయి.**




కోడి మాంసం, గుడ్లు, బటానీలు, బీన్స్, పప్పులు, టోఫు, అంజీరా, ఎండుద్రాక్ష, బ్రోకలీ, ఆకుకూరలు, పిస్తా, గుమ్మడి విత్తనాల్లో ఐరన్ దండిగా ఉంటుంది. ఇది ఎర్ర రక్తకణాలు ఏర్పడటానికి, నెలసరి సమయంలో కోల్పోయిన రక్తం భర్తీ కావటానికి తోడ్పడుతుంది. ఆరోగ్యంగా, హాయిగా ఉండేలా చేస్తుంది. చిలగడ దుంప, పంపర పనస, స్ట్రాబెర్రీ, కర్బూజా, యాప్రికాట్, బ్రోకలీ, ఆకుకూరలు, నిమ్మకాయ, నారింజ, బత్తాయి వంటి వాటితో యాంటీఆక్సిడెంట్లు లభిస్తాయి. ఇవి వాపు ప్రక్రియను తగ్గించటం ద్వారా పొత్తి కడుపు నొప్పి, కడుపుబ్బరం వంటి ఇబ్బందుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. పాలీఫెనాల్స్ వంటి యాంటీఆక్సిడెంట్లు మూడ్‌నూ మెరుగుపరుస్తాయి. శరీరంలో అధికంగా ఉండే ఈస్ట్రోజన్‌ను తగ్గించే పదార్థాలు.. ముఖ్యంగా పీచు పదార్థాలు తినటం నెలసరి సమయంలో చాలా మేలు చేస్తుంది. కొన్నిరకాల నూనెలు, మాంసంలో ఈస్ట్రోజన్ ఉంటుంది. ఇది గర్భాశయం గోడను మందంగా చేయటం వల్ల నొప్పి తలెత్తుతుంది. పీచు పదార్థాలతో దీన్ని నిలువరించొచ్చు. ఎందుకంటే పీచుతో మల విసర్జన సాఫీగా అవుతుంది. మలంతో పాటు ఈస్ట్రోజన్ కూడా బయటకు పోతుంది. తవుడుతో కూడిన నిండు గింజ ధాన్యాలు, పప్పులు, ఎండు పప్పులు, పండ్లు, గోబీపువ్వు వంటి కూరగాయలు, క్యారెట్, యాపిల్స్‌తో పీచు దండిగా లభిస్తుంది. అలాగే నీరు కూడా తగినంత తాగాలి. టమోటాలు, పుచ్చకాయ వంటి వాటితోనూ నీరు అందుతుంది.






## మధ్యవయసులోనే పేగు క్యాన్సర్లేల?



ఎలాంటి క్యాన్సరైనా గానీ వయసు పెరుగుతున్నకొద్దీ ముప్పు ఎక్కువవుతుంది. అరవై ఏళ్లు పైబడ్డ ప్రతి 100 మందిలో ఒకరు క్యాన్సర్ బారినపడుతున్నారని అంచనా. అయితే ఇటీవల 50 ఏళ్లలోపు వారిలోనూ పెద్దపేగు క్యాన్సర్లు ఎక్కువగా బయటపడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. దీనికి కచ్చితమైన కారణమేంటన్నది తెలియదు గానీ పర్యావరణ అంశాలు, ఆహారం, జీవనశైలి దోహదం చేసే అవకాశమున్నట్టు పలు అధ్యయనాల సమీక్షలో తేలింది. ఆహార ఉత్పత్తులు, మాంసం ఎక్కువగా తినటం.. ఊబకాయం, వ్యాయామం చేయకపోవటం, మద్యం అతిగా తాగటం, తీపి పానీయాలు, సూక్ష్మ ప్లాస్టిక్ రేణువుల వంటివి పేగు బ్యాక్టీరియా మీద విపరీత ప్రభావం చూపుతున్నట్టు ఇది సూచిస్తోంది. రోగనిరోధక వ్యవస్థ వాపుప్రక్రియ అనుకూల ప్రతిస్పందనలను సృష్టించటమూ ముందుగానే క్యాన్సర్ తలెత్తటానికి దారితీస్తోందని పరిశోధకులు చెబుతున్నారు.

# మరణం నుంచి జననం!

**మరణంలో జననం! చావు అనివార్యమై, అచేతనావస్థలో ఉన్నా మరొకరి ప్రాణాలు నిలబెట్టగలిగితే? అంతకన్నా గొప్ప విషయమేముంది? అవయవదానం అలాంటి సదవకాశాన్నే కల్పిస్తుంది. చనిపోయినా మరొకరిలో జీవించే వరాన్ని ప్రసాదిస్తుంది. అవయవాలు విఫలమై, ప్రాణాలు కొట్టుమిట్టాడుతున్న దశలో ఉన్న మరొకరికి పునర్జన్మనిస్తుంది. మరణం నుంచి జననంలోకి అడుగేయిస్తుంది. ఇది ఎప్పటి నుంచో అందుబాటులో ఉన్నా చాలామందికి దీని గురించే తెలియటం లేదు. సరైన అవగాహన లేకపోవటం వల్ల ఎంతోమంది ముందుకు రావటం లేదు. ఈ నేపథ్యంలో అవయవ దానం ప్రత్యేక కథనం మీకోసం...**



కిడ్నీ, గుండె, కాలేయం వంటి కీలక అవయవాలు పూర్తిగా విఫలమైతే ఒకప్పుడు చేయటానికేమీ ఉండేది కాదు. ఇప్పుడు డాక్టర్లు అవయవ మార్పిడితో ఎంతోమందికి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తున్నారు. కానీ అవయవాలు అందుబాటులో లేకపోవటమే పెద్ద అడ్డంకిగా నిలుస్తోంది. మనదేశంలో ప్రతి 10 నిమిషాలకు ఒకరు అవయవ మార్పిడి అవసరమైనవారి జాబితాలో చేరుతున్నారు. అవయవాల కోసం ఎదురుచూస్తూ చూస్తూ రోజుకు 20 మంది ప్రాణాలు విడుస్తున్నారు. అవయవాల కోసం ఏకంగా 3లక్షలకు పైగా మంది కళ్లు కాయలు కాసేలా నిరీక్షిస్తుండగా.. కేవలం 10% మందే సకాలంలో మార్పిడికి నోచుకుంటున్నారు. ప్రతి 10 లక్షల మందికి ఒక దాత మాత్రమే అందుబాటులో ఉంటున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. మరి దీన్ని పరిష్కరించేదెలా? ఇక్కడే జీవన్మృతుల (బ్రెయిన్ డెడ్) అవయవ దానం ప్రాధాన్యం సంతరించుకుంటోంది.

### ఏంటీ అవయవదానం?

అవయవ దానం రెండు రకాలు. 1. సజీవ (లైవ్) దానం. బతికున్నవారు అవయవాన్ని లేదా అవయవ భాగాన్ని దానం చేయటం. కిడ్నీ, కాలేయ, రక్త దానం వంటివి ఇలాంటివే. మనం ఒక కిడ్నీ ఉన్నా జీవించొచ్చు. కొంత భాగాన్ని దానం చేసినా కాలేయం తిరిగి వృద్ధి చెందుతుంది. అందువల్ల బతికున్నవారు ఇలాంటి అవయవాలను దానం చేయటానికి వీలవుతుంది. ఆరోగ్యంగా అన్ని విధాలుగా ఫిట్‌గా ఉండి, గ్రహీతల రక్తం గ్రూపుతో సరిపోయిన వారు అవయవాలను దానం చేయొచ్చు. 2. జీవన్మృతి (కెడావర్) దానం. అంటే మరణించిన తర్వాత అవయవాలను దానం చేయటం. దీనికి సిద్ధపడినవారు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. మరణించిన తర్వాత వారి సన్నిహిత కుటుంబ సభ్యులైనా దానం చేయటానికి అంగీకరించొచ్చు. అవయవ దాతలు ఎలా చనిపోయారన్నదీ కీలకమే. బ్రెయిన్ డెత్ అయినవారి నుంచి గుండె, ఊపిరితిత్తి, కిడ్నీ, కాలేయం, పాంక్రియాస్, పేగుల వంటి అన్ని కీలక అవయవాలనూ గ్రహించొచ్చు. ఒకవేళ సహజ మరణం అయినట్టయితే కంటి కార్నియా, చర్మం, ఎముక, గుండె కవాటాలు, రక్తనాళాల వంటి కణజాలాల దానానికి మాత్రమే వీలుంటుంది. ఎందు కంటే మనిషి మరణించిన తర్వాత ఆక్సిజన్ సరఫరా కాకపోవటం వల్ల కీలక అవయవాలు చనిపోతాయి.

### ఎవరు దానం చేయొచ్చు?

బతికి ఉన్నప్పుడు కిడ్నీ వంటి అవయవాలను 18 ఏళ్లు నిండినవారు ఎవరైనా చేయొచ్చు. జీవన్మృతి అయితే వయసు, ఆరోగ్య చరిత్రతో సంబంధమేమీ ఉండదు. ఆడవారైనా, మగవారైనా, ఏ మతం వారైనా అవయవ దాతలు కావొచ్చు.

### గుండె స్తంభించి మరణించినవారు దానం చేయొచ్చా?

నిజానికి గుండె స్తంభించటం (కార్డియాక్ అరెస్ట్)తో మరణించిన తర్వాతా అవయవాలను తీసుకోవచ్చు. అయితే ఒక తేడా ఉంది. బ్రెయిన్ డెడ్ అయినవారు చాలావరకూ ఐసీయూలో ఉంటారు. వీరి ప్రాణాలు నిలపటానికి కృత్రిమ శ్వాస వంటి చికిత్సలు కొనసాగుతుంటాయి. అందువల్ల తొలగించేంత వరకూ ఆక్సిజన్, రక్తం అందటం వల్ల అన్ని అవయవాలనూ తీసుకోవచ్చు. అదే గుండె స్తంభించటం వల్ల మరణిస్తే అవయవాలు చాలా వేగంగా క్షీణిస్తుంటాయి. కాబట్టి కొద్ది నిమిషాల్లోనే తీసుకోవాల్సి ఉంటుంది. అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో దీన్ని అనుసరిస్తున్నారు. మనదేశంలో ఇంకా పాటించటం లేదు.

### దాతల విశ్లేషణ ఎలా?

అప్పటికే ఉన్న జబ్బులు, వయసు, మొత్తంగా ఆరోగ్యం, అవయవాలు.. కణజాలాల స్థితిని బట్టి దాతలను విశ్లేషిస్తారు. అవయవాలను, కణజాలాలను తొలగించేటప్పుడు వాటి స్థితిని బట్టి మార్పిడికి ఉపయోగపడతాయో లేదో నిర్ణయిస్తారు.

### బ్రెయిన్ డెత్ అంటే?

మెదడుకు తీవ్రంగా, మానటానికి వీల్లేని విధంగా దెబ్బ తగిలినప్పుడు బ్రెయిన్ డెత్ సంభవిస్తుంది. సాధారణంగా రోడ్డు, రైలు ప్రమాదాల్లో బాగా గాయపడినవారు ఇలాంటి స్థితికి చేరుకుంటారు. ఆక్సిజన్ అందకపోవటం వల్ల వీరిలో మస్తిష్క మూలం, మెదడులోని అతిపెద్ద భాగమైన సెరిబ్రమ్‌తో పాటు అన్ని భాగాలూ దెబ్బతింటాయి. ఇలాంటి పరిస్థితిలో తనకు తానుగా మనుగడ సాగించలేరు. జీవానికీ శవానికీ మధ్య కొట్టుమిట్టాడుతుంటారు. కానీ కీలక అవయవాలు పనిచేయటానికి బయటి నుంచి చికిత్స అందించొచ్చు. ఆయా అవయవాలను తొలగించేంతవరకూ వాటికి రక్త సరఫరా జరిగేలా చేయొచ్చు.

### బ్రెయిన్ డెత్‌ను ఎవరు ధ్రువీకరిస్తారు?

బ్రెయిన్ డెత్‌ను నలుగురు డాక్టర్ల బృందం ధ్రువీకరిస్తుంది. ఇందులో న్యూరాలజిస్టు లేదా న్యూరోసర్జన్, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్, చికిత్స చేసే వైద్యుడు, వేరే ఆసుపత్రికి చెందిన డాక్టర్ ఉంటారు. వైద్య, న్యాయ నిబంధనలకు లోబడి మరణాన్ని ధ్రువీకరిస్తారు.

### ఎంత సేపట్లో అవయవాలు తీస్తారు?

బ్రెయిన్ డెత్‌ను ధ్రువీకరించిన తర్వాత కుటుంబ సభ్యుల ఆమోదంతో వెంటనే అవయవాలను తీ యాల్సి ఉంటుంది. ఒకవేళ అవయవాలను తీయ టం ఆలస్యమైనట్టయితే జీవన్మృతుల్లో రక్త ప్రసరణ కొనసాగేలా చూడాల్సి ఉంటుంది. ఇందుకోసం కృత్రిమ శ్వాస కల్పిస్తారు. అవయ వాలను తొలగించిన తర్వాత 4 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలో భద్రపరచి, కొద్ది గంటల్లోనే (కోల్డ్ ఇస్కీమిక్ టైమ్ లోపు) మార్పిడి చేయాల్సి ఉంటుంది. ఈ సగటు సమయం ఆయా అవయవాలను బట్టి ఉంటుంది. ఉదాహరణకు- గుండెను 4-6 గంటల్లోపు.. కాలేయం, క్లోమం 12 గంటల్లోపు.. కిడ్నీ 24 గంటల్లోపు మార్పిడి చేయొచ్చు.

### ఏంటీ ప్రయోజనం?

అవయవాలు విఫలమై, మరణానికి చేరువైనవారి ప్రాణాలను నిలిపే గొప్ప మార్గం అవయవ దానం. జీవితం మీద ఆశ కోల్పోయి, ఎన్ని రోజులు జీవిస్తామో తెలియని నిస్సహాయ స్థితిలో ఉన్నవారికి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తుంది. అప్పటివరకూ బాధలు, ఇబ్బందులతో సతమతమైవారి జీవితం దీంతో గణనీయంగా మెరుగవుతుంది. హాయిగా, ఆనందంగా గడపటం సాధ్యమవుతుంది.

### ఎంతవరకూ సురక్షితం?

కఠినమైన వైద్య ప్రమాణాల మేరకే అవయవ మార్పిడి చేస్తారు. వీటిని గ్రహించినవారు జీవితాంతం రోగనిరోధక శక్తిని అణచిపెట్టే మందులు వేసుకోవాల్సి ఉంటుంది. క్రమం తప్పకుండా డాక్టర్‌ను సంప్రదించాలి. బతికి ఉన్నవారి నుంచైతే అన్ని అంశాలనూ క్షుణ్నంగా పరిశీలించిన తర్వాతే మార్పిడి కోసం అవయవాలను సేకరిస్తారు. ఈ ప్రక్రియలో కిడ్నీ వంటి అవయవాలను దానం చేసినవారు క్రమం తప్పకుండా డాక్టర్‌ను సంప్రదించి, ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. జబ్బుల ముప్పు తగ్గించు కోవటానికి ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించాలి.

# మూవీ జోన్



## ‘ప్రియురాలు పిలిచింది’..

### ఆ పాత్రను స్టార్స్ తిరస్కరించారు..: దర్శకుడు రాజీవ్

2000 సంవత్సరంలో విడుదలై మ్యూజికల్ హిట్‌గా నిలిచిన చిత్రం ‘ప్రియురాలు పిలిచింది’ . తమిళ సినిమా ‘కండుకొండైన్ కండుకొండైన్’ రీమేక్‌గా వచ్చిన ఈ చిత్రంలోని మమ్ముట్టి అజిత్ ఐశ్వర్యారాయ్ టబు అజిత్ వారి నటనతో ఆకట్టుకున్నారు. ఈ సినిమా రోజులను తాజాగా దర్శకుడు రాజీవ్‌మేనన్ గుర్తుచేసుకున్నారు. మమ్ముట్టి పాత్రను చాలామంది స్టార్స్ రిజెక్ట్ చేశారని తెలిపారు. ఇందులో ఐశ్వర్యారాయ్‌కు జంటగా మమ్ముట్టి నటించిన విషయం తెలిసిందే. యుద్ధంలో కాలు కోల్పోయిన మేజర్ బాలా పాత్రలో ఆయన జీవించేశారు. అయితే ఆ పాత్రను చేయడానికి స్టార్స్ ఎవరూ అంగీకరించలేదట. ‘‘ఆ పాత్ర గొప్పతనమంతా అతడి నడకలోనే ఉంటుంది. కాలు కోల్పోయిన వ్యక్తిగా నటించడానికి ఎవరూ అంగీకరించలేదు. ఒక కాలు ఉన్న పాత్రలో నటించడం మాకు ఇష్టం లేదని మొహం మీదే చెప్పారు. కానీ మమ్ముట్టి ఆ పాత్ర గురించి చెప్పగానే అంగీకరించారు. అది లోపంగా ఆయన భావించలేదు’’ అని చెప్పారు. ఇక ఈ సినిమా షూటింగ్ సమయంలోని సరదా జ్ఞాపకాలను కూడా రాజీవ్ పంచుకున్నారు. ‘‘మేజర్ యుద్ధంలో తన కుడి కాలును కోల్పోతారు. మమ్ముట్టి నడుస్తున్నప్పుడు కుడి వైపునకు వంగిఉండాలి. కానీ కొన్నిసార్లు షూటింగ్‌లో మర్చిపోయి ఎడమ వైపునకు వంగి నడిచేవారు. మా అసిస్టెంట్ చెబితే మళ్లీ సరిచేసుకునేవారు. ఒక్కోసారి మామూలుగా నడిచేవారు.. సన్నివేశం అయిపోయాక అందరికీ గుర్తొచ్చేది. ఈ షూటింగ్ అంతా సరదాగా గడిచింది’’ అని దర్శకుడు ఆ రోజులను గుర్తుచేసుకున్నారు. 2000 సంవత్సరంలో విడుదలైన ఈ సినిమా నేషనల్ అవార్డుతో పాటు ఫిల్మ్‌ఫేర్‌లను కూడా సొంతం చేసుకుంది. ఇందులోని పాటలు ఇప్పటికీ సోషల్ మీడియా రీల్స్‌లో ట్రెండింగ్‌లో ఉండడం విశేషం.

## ఆఫ్రికాలో అడ్వెంచర్?



హీరో మహేశ్‌బాబు, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో అంతర్జాతీయ స్థాయిలో ఓ భారీ బడ్జెట్ చిత్రం రూ పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రియాంకా చోప్రా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ఆఫ్రికా లొకేషన్స్‌లోనే జరుగుతోందనే ప్రచారం సాగుతోంది. దానికి కారణం ప్రియాంకా చోప్రా తాజాగా షేర్ చేసిన కొన్ని ఫొటోలు ప్రధానంగా ఫారెస్ట్ లొకేషన్స్‌కు సంబంధించినవి కావడమే. దీంతో ఆమె ప్రస్తుతం ఆఫ్రికాలో ఉన్నారని, ఆమె అక్కడికి వెళ్లింది మహేశ్‌బాబు సినిమా కోసమే అనే టాక్ తెరపైకి వచ్చింది. మరోవైపు మహేశ్‌బాబు భార్య నమ్రత వినాయక చవితి పండగ జరుపుకున్న ఫొటోలను ఇన్‌స్టాలో షేర్ చేసి, మహేశ్‌బాబును మిస్ అవుతున్నట్లుగా పేర్కొన్నారు. సో... మహేశ్‌బాబు కూడా రాజమౌళి సినిమా షూటింగ్ కోసం ఆఫ్రికా వెళ్లారనే ఊహాగానాలు నెలకొన్నాయి. ఇక ఈ షెడ్యూల్‌లో మహేశ్‌బాబుపై ఓ భారీ యాక్షన్ అడ్వెంచరస్ సీక్వెన్స్ చిత్రీకరించడానికి ప్లాన్ చేశారట రాజమౌళి. ఇక కేఎల్ నారాయణ నిర్మిస్తున్న ఈ సినిమాకి ఓ హాలీవుడ్ నిర్మాణ సంస్థ కూడా నిర్మాణంలో భాగస్వామి కానుందనే ప్రచారం జరుగుతోంది.

## స్టార్ హీరోతో నటించే అవకాశం చేజారింది.. ఎంతో ఏడ్చా..

### మమిత బైజు



ప్రేమలు సినిమాతో సెన్సేషన్ అయింది మమిత బైజు. ప్రస్తుతం ప్రదీప్ రంగనాథన్‌తో, దళపతి విజయ్‌తో సినిమాలు చేస్తోంది. అయితే ఓ స్టార్ హీరోతో నటించే అవకాశం చేతికి వచ్చినట్లే వచ్చి చేజారిపోయిందంటోంది బ్యూటీ. నాకు పెద్దగా గుర్తింపు లభించని సమయంలో హీరో సూర్య సర్‌తో కలిసి నటించే ఛాన్స్ వచ్చింది. అప్పుడు ఎగిరి గంతేశాను. కానీ, దురదృష్టవశాత్తూ ఆ అవకాశం చేజారింది. అప్పుడు చాలా బాధపడ్డాను, ఏడ్చాను. కానీ ఇప్పుడు సూర్య సర్‌తో ఓ సినిమా చేస్తున్నందుకు చాలా థ్రిల్ ఫీలవుతున్నాను అని చెప్పుకొచ్చింది.

**అప్పుడు మిస్సయిన ఛాన్స్:** బాలా డైరెక్ట్ చేసిన వణంగాన్ మూవీలో మొదట సూర్య, మమిత బైజును సెలక్ట్ చేశారు. కొన్ని సీన్లు కూడా చిత్రీకరించారు. కానీ పలు కారణాల వల్ల సూర్య, మమిత బైజు ఈ మూవీ నుంచి తప్పుకున్నారు. దీంతో దర్శకుడు బాలా.. అరుణ్ విజయ్‌ను హీరోగా పెట్టి సినిమా పూర్తి చేశాడు. ఇదిలా ఉంటే.. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్య ఓ సినిమా చేస్తున్నాడు. రాధికా శరత్ కుమార్, రవీనా టండన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తోంది.

### టామ్ క్రూజ్ జీవిత సత్యాలు..

## వేల కోట్ల సంపద వెనుక రహస్యమిదే!

**టామ్ క్రూజ్.. హాలీవుడ్ యాక్షన్ సినిమాలను ఆస్వాదించే ప్రేక్షకులకు పరిచయం అక్కర్లేని పేరు. ముఖ్యంగా ‘మిషన్ ఇంపాసిబుల్’ చిత్రాల్లో ఏజెంట్ ఈథన్ హంట్‌గా టామ్ సాహసాలు ప్రతిసారి ఆశ్చర్యపరుస్తూనే ఉంటాయి.**



సినిమా ఇండస్ట్రీలో సక్సెస్ ఒక్కటే మాట్లాడేలా చేస్తుంది. అలాంటిది నాలుగు దశాబ్దాలుగా నటుడిగా కొనసాగడం సాధారణ విషయం కాదు. కొన్ని రోజుల కిందట టామ్ నటించిన ‘మిషన్ ఇంపాసిబుల్: ఫైనల్ రెకనింగ్’ విడుదలై బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో టామ్ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ముఖ్యంగా ఒక సాధారణ నటుడిగా జీవితం ప్రారంభించి ఇప్పుడు 600 మిలియన్ డాలర్లకు పైగా సంపద కలిగిన నటుడిగా నిలవడం క్రమశిక్షణ భయాన్ని ధైర్యంగా ఎదుర్కోవడమే కారణమని తెలిపారు.

‘‘నేను ఏం చేస్తున్నానన్నది ముఖ్యం కాదు. నేనెవరు? అన్నది ముఖ్యం. నన్ను ఎవరినైనా కలిస్తే ‘మీ అభిరుచి ఏంటి. దాన్నే ఎందుకు ఎంచుకున్నారు’ అని అడుగుతా. కొత్త కొత్త ప్రదేశాలను చూడటం జ్ఞానాన్ని సంపాదించడం మానవత్వంతో ఉండటం నా వరకూ ఇవే నా అభిరుచులు. నాలా నేను ఉండటం వల్లే నా సహచర మిత్రులతో కలిసి సృజనాత్మక లక్ష్యాలను సాధించడంలో ఉపయోగపడింది’’ అంటూ టామ్ చెప్పుకొచ్చారు. ఇక సినిమా కోసం రన్నింగ్‌లో ఉన్న విమానాలను పట్టుకుని వేలాడటం కొండలపై నుంచి దూకడం వంటి స్టంట్స్ చేస్తున్నప్పుడు భయపడతారా? అని అడగ్గా ‘నాకెలాంటి భయం ఉండదు. భయమంటే నాకు తెలియదు. నేను ఆ యాక్షన్‌ను ఆస్వాదిస్తా. మనమేదైనా వాస్తవంలో చేయలేమని అనిపిస్తే దాన్ని కచ్చితంగా చేయాల్సిందేనని అనుకుంటాను. అలాగే చేస్తాను కూడా. దాంతో అప్పటివరకూ నాకున్న భయం ఎగిరిపోతుంది. సాహసోపేతమైన జీవితమంటే నాకు ఇష్టం. గదిలో కూర్చొని పేపర్‌పై ‘ఇది చేద్దాం.. అది చేద్దాం’ అని రాసుకుంటూ కూర్చొంటే సరిపోదు. నేను రియల్ స్టంట్స్ చేయడం వెనుక ఎన్నో ఏళ్ల శ్రమ ఉంది. అందుకు శారీరర శిక్షణ కొత్త టెక్నాలజీలను అధ్యయనం చేయడం బృందంతో కలిసి పనిచేయడం. ఇలా ఎన్నో అంశాలు ఉన్నాయి. ఇక్కడ విషయం ఏంటంటే ప్రేక్షకులకు ఇవేవీ కనిపించవు. కేవలం తెరపై నేను చేసే సన్నివేశమే కనిపిస్తుంది’’ ‘‘చిన్నతనం నుంచే నేను చేసే ప్రతి పని అత్యున్నతంగా చేసేందుకు ప్రయత్నించేవాడిని. సినిమాల్లోకి రాకముందు నుంచి ఈ అలవాటు ఉంది. అయితే అన్నిసార్లు అన్ని విషయాలు కచ్చితత్వం ఫలితం వస్తాయని చెప్పలేం. కానీ దానికి దగ్గరగా వచ్చేలా మనం ప్రయత్నించాలి. ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడమే నా అంతిమ లక్ష్యం. అదే ఉత్తమమైనది ఇచ్చేలా నన్ను ప్రోత్సహిస్తుంది. ప్రస్తుతం మనకు ఎంతో సమాచారం అందుబాటులో ఉంది. అందులో ఉత్తమమైన దానిని మన జీవితానికి అన్వయించుకోవాలి. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే కలలు కంటూ ఉండండి.. మీతో పాటు ఇతరులు వారి కలలను సాకారం చేసుకునేలా మీ వంతు సాయం చేయండి. కేవలం నా కోసం మాత్రమే నేను జీవించను. ఇతరుల గురించి కూడా ఆలోచిస్తా. అయితే ఏం చేయాలో ఇతరులకు సలహాలు చెప్పొద్దు. వాళ్లు చేసే పని ఎలా మెరుగ్గా చేయాలో మాత్రమే చెప్పండి’’ అని టామ్ క్రూజ్ జీవిత సత్యాలు చెప్పారు.

## తెలుగు టైటాన్స్‌కు వరుసగా రెండో ఓటమి

### ప్రో కబడ్డీ లీగ్ టైటాన్స్, యూపీ మ్యాచ్‌లో హెూరాహెూరీ



ప్రో కబడ్డీ లీగ్ సీజన్-12లో తెలుగు టైటాన్స్‌కు వరుసగా రెండో ఓటమి. ఆదివారం హెూరాహెూరీగా సాగిన పోరులో యూపీ యోధాస్ 40-35తో టైటాన్స్‌పై నెగ్గింది. విజయ్ మలిక్ మెరుపులతో ఆరంభంలో టైటాన్స్ ఆధిపత్యం ప్రదర్శించింది. యోధాస్ కూడా నెమ్మదిగా పుంజుకుంది. గగన్ గౌడ, భరత్ హుడా రాణించడంతో ఎనిమిదో నిమిషంలోనే టైటాన్స్‌ను ఆలౌట్ చేసింది.

గగన్ ఓ సూపర్ రైడ్ సాధించడంతో విరామ సమయానికి యోధాస్ 21-13తో ఆధిక్యంలోకి వెళ్లింది. బ్రేక్ తర్వాత టైటాన్స్ కాస్త మెరుగ్గా ఆడినా.. యోధాస్ తగ్గలేదు. ఆధిక్యాన్ని కొనసాగిస్తూ వెళ్లింది.

విజయ్ మలిక్ (14 పాయింట్లు) ఒకవైపు రాణించినా.. అతడికి మిగిలిన ప్లేయర్ల నుంచి సహకారం కొరవడడంతో టైటాన్స్‌కు ఓటమి తప్పలేదు. గగన్ గౌడ (14), సుమిత్ (8) యోధాస్ విజయంలో కీలకపాత్ర పోషించారు. యు ముంబా-గుజరాత్ జెయింట్స్ మధ్య మ్యాచ్ టై అయింది. ఫలితం తేల్చేందుకు నిర్వహించిన అయిదు రెయిడ్‌లలో ముంబా 6-5తో గుజరాత్‌ను ఓడించింది. విరామ సమయానికి గుజరాత్ 16-15తో స్వల్ప ఆధిక్యంలో నిలిచింది. ద్వితీయార్ధంలోనూ ఆట నువ్వానేనా అన్నట్లు సాగింది. ఆఖరికి స్కోర్లు సమమయ్యాయి. ముంబా తరఫున రోహిత్ (7), అజిత్ (6).. గుజరాత్ జట్టులో హిమాంశు (7), రాకేశ్ (5) రాణించారు.

## సీఓఈలో శుభ్‌మన్, బుమ్రా

### సీఓఈలో భారత ఆటగాళ్లు



**బెంగళూరు :** ఆసియా కప్ టీ20 టోర్నీకి సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో టీమ్‌ఇండియా ఆటగాళ్లకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించబోతున్నారు. ఇందు కోసం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీఓఈ)కి ఒక్కొక్కరుగా ఆటగాళ్లు చేరుకుంటున్నారు. టీ20 జట్టుకు ఇటీవలే వైస్‌కెప్టెన్‌గా నియమితుడైన శుభ్‌మన్ గిల్‌తో పాటు ఆసియా కప్‌నకు ఎంపికైన జస్‌ప్రీత్ బుమ్రా తదితరులు సీఓఈలో అడుగు పెట్టారు. ఆదివారం వీరితో పాటు పలువురు ఆటగాళ్లకు ఫిట్‌నెస్ పరీక్షలు జరుగుతాయి. వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ, ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో సత్తా చాటిన పేసర్ మహ్మద్ సిరాజ్‌లకు త్వరలో ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించనున్నారు.

# క్రీడా జోన్

## కాంస్యమే..

- సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ ఓటమి
- ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్



**పారిస్ :** ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి పసిడి ఆశలకు తెర. భారత స్టార్ జోడీ పోరాటం సెమీఫైనల్లోనే ముగిసింది. శనివారం అర్ధరాత్రి ఆలస్యంగా ముగిసిన మ్యాచ్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ 19-21, 21-18, 12-21తో 11వ సీడ్ చెన్ బోయాంగ్ - లి యి జంట చేతిలో ఓడిపోయింది. ప్రపంచ బ్యాడ్మింటన్‌లో సాత్విక్ జోడీకి ఇది రెండో పతకం. 2022లోనూ ఈ భారత జంట కాంస్యమే నెగ్గింది. క్వార్టర్స్‌లో రెండో సీడ్‌పై అద్భుత ప్రదర్శన చేసిన భారత జంట.. సెమీస్‌లో విఫలమైంది. మ్యాచ్‌ను దూకుడుగా ఆరంభించినా ఆఖరి వరకు అదే జోరు కొనసాగించలేదు. తొలి గేమ్ ఆరంభంలో సాత్విక్ ద్వయం 6-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 11-5తో విరామానికి వెళ్లింది. సులభంగా తొలి గేమ్ గెలుచుకునేలా కనిపించింది. కానీ.. విరామానంతరం అనవసర తప్పిదాలతో ప్రత్యర్థి జోడీకి పుంజుకునే అవకాశాన్నిచ్చింది. భారత ఆటగాళ్లు కాక్‌ను పదేపదే నెట్‌కు కొట్టడంతో 12-12తో చైనా జోడీ స్కోరు సమం చేసింది. ఆ తర్వాత క్రమంగా ఆధిక్యాన్ని పెంచుకుంటూ సాగింది. ఆఖర్లో సాత్విక్ జోడీ పుంజుకునే ప్రయత్నం చేసినా చెన్ బోయాంగ్ - లి యి జంటనే తొలి గేమ్ గెలిచింది. రెండో గేమ్ కూడా తొలి గేమ్‌నే తలపించింది. సాత్విక్ జోడీ 6-2తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత విరామ సమయానికి 11-9తో ఆధిక్యంలో నిలిచింది. కానీ ఆ తర్వాత అనూహ్యంగా తడబడింది. వరుస తప్పిదాలు చేయడంతో చైనా జంట 16-16తో స్కోరు సమం చేసింది. కీలక సమయంలో సాత్విక్ వరుస స్మాష్‌లతో విరుచుకుపడటంతో భారత జోడీ గేమ్‌లో ఆధిక్యంలోకి వెళ్లింది. అదే జోరులో గేమ్ గెలిచి మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణయాత్మక పోరులో సాత్విక్-చిరాగ్ ద్వయం పూర్తిగా తేలిపోయింది. ఆరంభంలో చైనా జంట 9-0తో మ్యాచ్‌ను శాసించింది. విరామానంతరం సాత్విక్ జోడీ పుంజుకున్నా బోయాంగ్ జోడీ మ్యాచ్‌ను వదల్లేదు. సింధు (5), సైనా (2) తర్వాత ప్రపంచ బ్యాడ్మింటన్‌లో రెండు పతకాలు గెలిచిన భారత షట్లర్లు సాత్విక్, చిరాగ్‌లే. మహిళల సింగిల్స్‌లో అకానె యమగూచి (జపాన్), చెన్ యు ఫై (చైనా) ఫైనల్ చేరారు. పురుషుల సింగిల్స్‌లో టైటిల్ కోసం టాప్ సీడ్ షి యుకి (చైనా), మూడో సీడ్ కున్లావత్ వితిద్‌సరన్ (థాయ్‌లాండ్) తలపడనున్నారు.

## నాయకత్వ నైపుణ్యమే శ్రేయస్‌కు అడ్డంకి: మాంటీ పనేసర్



శ్రేయస్ అయ్యర్.. ఐపీఎల్‌లో ఒక జట్టును విజేతగా నిలిపాడు. మరొక టీమ్‌ను ఫైనల్‌కు తీసుకొచ్చాడు. బ్యాటింగ్‌లోనూ విలువైన పరుగులు చేశాడు. కానీ, ఆసియా కప్‌లో మాత్రం అతడికి చోటు దక్కలేదు. దానికి కారణం ఏంటో ఇంగ్లాండ్ మాజీ ఆటగాడు మాంటీ పనేసర్ విశ్లేషించాడు. సీనియర్ క్రికెటర్‌ను తీసుకోవడం కంటే.. యువ ప్లేయర్‌ను మేనేజ్ చేయడం ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌కు సులువవుతుందని పనేసర్ వ్యాఖ్యానించాడు. శ్రేయస్‌లోని ‘నాయకత్వ స్కిల్స్’ వల్లే అత%డికి టీ20 జట్టులో చోటు దక్కడం లేదని అభిప్రాయపడ్డాడు. ‘‘భారత జట్టులో శ్రేయస్ అయ్యర్‌కు చోటు దక్కకపోవడానికి చాలా కారణాలున్నాయి. అందులో ఒకటి నాయకత్వ పటిమ. సాధారణంగా ఇలాంటి నైపుణ్యం ఉంటే జట్టులోకి తీసుకుంటారు. కానీ, శ్రేయస్‌కు మాత్రం అదే శాపం. ఇప్పటికే టీమ్‌లో సారథి స్థాయి ప్లేయర్లు ఉన్నారు. అదే యువ క్రికెటర్‌ను తీసుకుంటే ప్రధాన కోచ్ గంభీర్ సులువుగా మేనేజ్ చేయగలడు. అందుకే, శ్రేయస్ వైపు మేనేజ్‌మెంట్ మొగ్గుచూపడం లేదు’’ అని పనేసర్ వ్యాఖ్యానించాడు.

**మూడు జట్లను సిద్ధం చేయొచ్చు**

‘‘శ్రేయస్ అయ్యర్ ఐపీఎల్‌లో కెప్టెన్సీ చేపట్టాడు. అదే జాతీయ జట్టుకు అడ్డంకిగా మారింది. నేను మాత్రం అయ్యర్ టీమ్‌ఇండియాకు ఆడాలని బలంగా కోరు కుంటా. అతడి ఫామ్ తప్పకుండా ఉపయోగపడుతుంది. అతడి టాలెంట్ మాటల్లో వర్ణించలేనిది. ప్రస్తుతం టీమ్‌ఇండియా అదృష్టం ఏంటంటే.. ఒకేసారి మూడు టీమ్‌లను సిద్ధం చేసి మిగతా దేశాల జట్లతో పోటీపడొచ్చు. అంతటి మంచి క్రికెటర్లు భారత్ సొంతం’’ అని పనేసర్ వ్యాఖ్యానించాడు.

### టెస్ట్ క్రికెట్‌లో ఆ దశను దాటడంలో

## సిరాజ్ సలహా సాయం చేసింది

### అర్షదీప్ సింగ్



ఇటీవల ముగిసిన ఇంగ్లాండ్ టూర్‌లో భాగంగా టీమ్‌ఇండియా అయిదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడింది. ఈ సిరీస్‌ను భారత జట్టు 2-2తో సమం చేసుకోగలిగింది.

ఈ టూర్‌లో అర్షదీప్ సింగ్ టీమ్‌ఇండియా స్క్వాడ్‌లో భాగమయ్యాడు. కానీ అతడికి బుమ్రా గైర్హాజరీలోనూ మ్యాచ్‌లు ఆడే అవకాశం దక్కలేదు. అలాగే నాలుగో టెస్ట్ మ్యాచ్‌కు ముందు అర్షదీప్ సింగ్ గాయానికి గురయ్యాడు. దీంతో కనీసం చివరి మ్యాచుల్లోనూ భాగం కాలేకపోయాడు.

ప్రస్తుతం అర్షదీప్ సింగ్.. దులీప్ ట్రోఫీలో నార్త్ జోన్ తరఫున పాల్గొంటున్నా డు. క్వార్టర్ ఫైనల్లో నార్త్ జోన్, ఈస్ట్ జోన్ తలపడుతున్నాయి. ఈ మ్యాచ్ విరామ సమయంలో అర్షదీప్ సింగ్ టెస్ట్ మ్యాచుల్లో బోరింగ్ సమయం గురించి మాట్లాడాడు. ఆ దశను ఎలా దాటాలో సిరాజ్ తనకు తెలిపాడని వివరించాడు. ‘గత రెండు నెలల కాలంలో నేను టెస్ట్ క్రికెట్‌లో బోరింగ్ టైమ్‌ను ఎలా ఉత్సాహంగా గడపాలో నేర్చుకున్నాను. రెడ్ బాల్ క్రికెట్‌లో కొన్ని సార్లు పరిస్థితి బోరింగ్‌గా తయారవుతుంది. ముఖ్యంగా లంచ్ తర్వాత సెషన్. అప్పుడు బంతితో మనం పెద్దగా ఏమీ చేయలేం. అప్పుడు కాస్త బోర్‌గా ఉంటుంది. ఈ విషయమై నేను ఇంగ్లాండ్ టూర్ సందర్భంగా మహ్మద్ సిరాజ్‌తో మాట్లాడాను. అప్పు డు అతడు నాకో సలహా ఇచ్చాడు. అలాం టి బోరింగ్ సమయంలోనే నువ్వు ఉత్సా హంగా ఉండగలిగితే, రెడ్ బాల్ క్రికెట్ లో విజయం సాధించగలవు అన్నాడు. అతడు చెప్పిన ఆ చిన్న సలహా నాకు బాగా నచ్చింది’ అని అర్షదీప్ సింగ్ వెల్లడించాడు. ప్రస్తుతం జరుగుతున్న దులీప్‌ట్రోఫీ క్వార్టర్ ఫైనల్స్‌లో నార్త్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండు వికెట్ల నష్టానికి 388 పరుగులు చేసింది. దీంతో ప్రస్తుతం 563 పరుగుల లీడ్‌తో పటిష్టమైన స్థితిలో ఉం ది. అంతకు ముందు నార్త్ జోన్ మొదటి ఇన్నింగ్స్‌లో 405 పరుగులు చేస్తే.. ఈస్ట్‌జోన్ 230 పరుగులకే ఆలౌటైంది.

# తమిళ జాలర్ల దోపిడీ

- కొండూరుపాళెం వద్ద సముద్రం తీరానికి వచ్చి వేట సాగిస్తున్న తమిళ జాలర్ల స్పీడు బోటు
- హద్దులు దాటి సంపదను దోచుకుపోతున్న తమిళ జాలర్లు
- పొరుగు రాష్ట్రంతో సమస్యగా మారిన వేట
- నష్టపోతున్న తిరుపతి జిల్లా మత్స్యకారులు

**ఇరవై ఏళ్లుగా ఆంధ్రా, తమిళనాడు రాష్ట్రాల మధ్య సముద్రంపై వేట పెద్ద సమస్యగా మారింది. తరచూ ఇరురాష్ట్రాల మధ్య ఒప్పందాలు కుదుర్చినా తమిళ జాలర్లు వాటిని లెక్కచేయక హద్దులు దాటి తిరుపతి జిల్లా తీరంలో వేట సాగిస్తున్నారు. దీంతో జిల్లా మత్స్యకారులకు తీరని నష్టం వాటిల్లుతోంది. నిబంధనలకు విరుద్ధంగా వేట చేస్తూ మత్స్య సంపదను పొరుగు రాష్ట్రం జాలర్లు కొల్లగొడుతున్నారు.**



**వాకాడు :** ఆంధ్రా సరిహద్దుల్లో తమిళ జాలర్లు వేట చేయకూడదని రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందాలు జరిగినా హద్దులు దాటి మత్స్య సంపదను తమిళ జాలర్లు దోచుకుపోతున్నారు. ఈ క్రమంలోనే రెండు నెలలుగా తిరుపతి జిల్లా తీరం వెంట తమిళ జాలర్లు తమ స్పీడ్ బోట్లతో నిబంధనలకు విరుద్ధంగా సముద్రంపై జల్లెడ పట్టి సముద్రంలోని మత్స్య సంపదను దోచుకుపోతున్నారు. దీంతో జిల్లాలోని 5 తీర ప్రాంత మండలాల మత్స్యకారులు విలవిలలాడుతున్నారు.

### స్పీడ్ బోట్లతో..

ఏటా జిల్లా మత్స్యకారులకు దక్కాల్సిన సుమారు 15 వేల టన్నుల మత్స్యసంపదను పొరుగు రాష్ట్రాల జాలర్లు ఎత్తుకెళ్లిపోతున్నారు. పాండిచ్చేరి, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన పెద్ద బోట్లు 250 హెచ్‌పీ నుంచి 500 హెచ్‌పీ మెకనైజ్డ్ బోట్లతో ఎంఎఫ్‌ఆర్‌ఐ యాక్ట్ నిబంధనలకు వ్యతిరేకంగా ఆంధ్రా జలాలపై తీర ప్రాంతం దగ్గరగా వేట చేయడమే కాకుండా స్థానిక మత్స్యకారులపై దాడులు చేస్తున్నారు. ఈ విషయమై ఇటీవల కరైకల్, కడలూరు, నాగపట్నం, పాండిచ్చేరి జిల్లాలకు చెందిన 5 స్పీడు బోట్లు వివరాలను ఆయా మత్స్యశాఖ ఉన్నత స్థాయి అధికారులకు మన జిల్లా అధికారులు తెలియజేసి వారిపై చర్యలు తీసుకున్నారు.

### నిబంధనలకు విరుద్ధంగా వేట

సాధారణంగా సముద్రంపై వేట చేసే మత్స్యకారులు 4 అంగులాల పైన రంధ్రాలు కలిగిన వలలను మాత్రమే వేటకు ఉపయోగించాలి. అలా కాకుండా తమిళ జాలర్లు నిబంధనలకు విరుద్ధంగా ఒక ఇంచి సైజు రంధ్రాలతో తయారు చేసిన 100 మీటర్ల వలలతో వేట చేయడంతో చిన్న చిన్న నలక చేపలతో పాటు పెద్ద చేపలు సైతం వలలో చిక్కుకుని జిల్లా మత్స్య సంపద పొరుగు రాష్ట్రాలకు తరలిపోతోంది. వాస్తవానికి స్పీడు బోట్ల జాలర్లు సముద్రంపై అలలు లేని ప్రదేశంలో అంటే 8 నాటికల్ మైళ్ల దూరం పైన వేట సాగించాలి. అయితే అధికార నిబంధనలను భేఖాతరు చేసి 3 నాటికల్ మైళ్ల దూరంలో ఎగసిపడుతున్న అలలు సైతం లెక్క చేయకుండా వేట చేసి మత్స్య సంపదను దోచుకుపోవడంతో స్థానిక మత్స్యకారులు నష్టపోతున్నారు.

### రెండు నెలలుగా జీవన భృతి లేక

తిరుపతి జిల్లాలో 79 కిలో మీటర్ల సముద్ర తీరం విస్తరించి ఉంది. 5 తీర ప్రాంత మండలాల్లో 38 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. అందులో దాదాపు 9 వేల మంది మత్స్యకారులు, 1200 వరకు ఇంజిన్ బోట్లు ఉన్నాయి. రెండు నెలలుగా పొరుగు రాష్ట్రాల జాలర్ల దెబ్బకు స్థానిక మత్స్యకారులు విలవిల్లాడుతున్నారు. చేపల వేటే జీవనాధారంగా జీవించే మత్స్యకారులు రెండు నెలలుగా జీవన భృతిని కోల్పోయారు. ఈసారి వర్షాలు సమృద్ధిగా కురిసి వాగులు, వంకలు, నదులపై ప్రవహించి వరద సముద్రంలో కలిసింది. ఆ మేరకు మత్స్య సంపద పుష్కలంగా దొరుకుతున్న సమయంలో తమిళనాడు, కడూరు, నాగూరు నాగపట్నం, తూత్‌కుడి, తదితర ప్రాంతాలకు చెందిన జాలర్లు స్పీడు బోట్లుతో మత్స్య సంపదను దోచుకుపోతున్నారు.

### చర్చలు జరిగినా ఫలితం లేదు

పొరుగు రాష్ట్రాలకు చెందిన జాలర్లు స్పాడు బోట్లుతో తమ పరిధిలో అక్రమంగా వేట చేయడమే కాకుండా తమపై దాడులు చేసి గాయపరుస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు ఇరు రాష్ట్రాల అధికారులు చర్చలు జరిగినా ఫలితం కనిపించలేదు. ఇకనైనా పొరుగు రాష్ట్రాల స్పీడు బోట్లు దాడుల నుంచి స్థానిక మత్స్యకారులను కాపాడాలి. – పోలయ్య మత్స్యకారుడు, కొండూరుపాళెం

### అధికారులు చొరవ చూపాలి

నిబంధనలను ఉల్లంఘించి తమిళ జాలర్లు మత్స్యసంపదను దోచుకుపోతున్నారు. దీంతో తాము రోజంతా వేట చేసినా ఒక్క చేప దొరక్క పస్తులు ఉండాల్సి వస్తోంది. అధికారులు చొరవ చూపాలి. లేకపోతే జిల్లా మత్స్యకారులకు జీవన భృతి లేకుండా పోతుంది.

**– మునిస్వామి, మత్స్యకారుడు, ఓడపాళెం**

# జాతీయం, అంతర్జాతీయం

## వాణిజ్య చర్చలపై వెనక్కి తగ్గిన భారత్

### ట్రంప్ తీరుపై మాజీ ఆర్థిక కార్యదర్శి ఫైర్



**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై అదనపు సుంకాలు విధించడంతో ఆ దేశంతో భారత్ వాణిజ్య సంబంధాలు దెబ్బతిన్నాయని, అందుకే భారత్.. అమెరికాతో వాణిజ్య చర్చల నుండి వెనక్కు తగ్గిందని మాజీ ఆర్థిక కార్యదర్శి సుభాష్ గార్గ్ వ్యాఖ్యానించారు. ఎన్‌డీటీవీతో సుభాష్ గార్గ్ మాట్లాడుతూ ట్రంప్ ఏకపక్ష సుంకాలు 50 శాతం వరకు ఉండటంతో న్యూఢిల్లీ ఇప్పటికే చర్చల నుండి సమర్థవంతంగా వైదొలిగిందన్నారు. భారత్ ముడి చమురును రష్యా నుంచి కొనుగోలు చేస్తూ, భారీగా లాభాలు పొందుతోందంటూ ట్రంప్ పదేపదే చేసిన వాదనలను సుభాష్ గార్గ్ తీవ్రంగా ఖండించారు. ఈ ఆరోపణ ఆర్థిక వాస్తవికత కాదని, ఇదొక రాజకీయ నాటకమని ఆయన పేర్కొన్నారు. రష్యా ముడి చమురు కొనుగోలు వలన భారత వాస్తవ పొదుపు సంవత్సరానికి 25 బిలియన్ అమెరికన్ డాలర్లు కాదని, 2.5 బిలియన్ అమెరికా డాలర్లకు దగ్గరగా ఉందని గార్గ్ అన్నారు. ఈ విధంగా తప్పుడు సంఖ్యను చెప్పవచ్చుగానీ, ట్రంప్ దీనిని భారతదేశాన్ని శిక్షించడానికి కత్తిగా ఉపయోగిస్తున్నారని గార్గ్ ఆరోపించారు. గార్గ్ తెలిపిన వివరాల ప్రకారం షిప్పింగ్, భీమా, బ్లెండింగ్ ఖర్చులను పరిగణనలోకి తీసుకున్నాక భారత్.. రష్యన్ బారెల్స్ నుంచి అందుతున్న డిస్కౌంట్ బ్యారెల్‌కు కేవలం మూడు నుంచి నాలుగు అమెరికన్ డాలర్లు మాత్రమేనని అన్నారు. భారత్ చమురు కొనుగోలు విషయంలో అంతర్జాతీయ ఒప్పందాన్ని ఉల్లంఘించడం లేదని గార్గ్ స్పష్టం చేశారు. అమెరికా విధిస్తున్న సుంకాల స్థాయిలలో ఎవరూ వ్యాపారం చేయలేదని, అమెరికా ఒత్తిడిని ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధంగా ఉందని, ప్రధాని మోదీ దేశంలోని రైతుల ప్రయోజనాల కోసం ఎప్పుడూ రాజీ పడనని ప్రతిజ్ఞ చేశారని గార్గ్ పేర్కొన్నారు. ట్రంప్ సుంకాలకు ప్రతీకారంగా అమెరికా వస్తువులను బహిష్కరించాలని వస్తున్న పిలుపులపై గార్గ్ మాట్లాడుతూ అది పిచ్చితనమని, అమెరికా– భారత్‌లు వస్తు వినియోగం, సేవారంగాలలో లోతుగా కలిసిపోయాయన్నారు. అందుకే అమెరికా వస్తు బహిష్కరణ సాధ్యం కాదన్నారు.

## భారత్‌ను లక్ష్యంగా చేసుకోండి.. యూరప్ దేశాలను కోరిన వైట్‌హౌస్..!

**రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై భారీగా సుంకాల భారాన్ని మోపిన సంగతి తెలిసిందే.**

ప్రస్తుతం భారత దిగుమతులపై 50 శాతం టారిఫ్‌లు అమలులో ఉన్నాయి. ఈ క్రమంలో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. తమలాగే భారత్‌ను లక్ష్యంగా చేసుకోవాలని యూరప్ దేశాలను వైట్‌హౌస్ కోరినట్లు తెలుస్తోంది. ఈ మేరకు పలు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.



మాస్కో నుంచి చమురు కొనుగోలు చేయడం ఆపకపోతే.. యూఎస్‌లాగానే భారత్‌పై ద్వితీయ సుంకాలను విధించాలని ట్రంప్ యంత్రాంగం కోరినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఆంక్షలు విధించడంతో పాటు ఆ దేశం నుంచి చమురు గ్యాస్ కొనుగోలును నిలిపివేయాలని కూడా కోరినట్లు వెల్లడించాయి. ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపే విషయంపై చర్చించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఇటీవల ట్రంప్ భేటీ అయిన సంగతి తెలిసిందే. యుద్ధం ముగించేందుకు అగ్రరాజ్యాధిపతి తీసుకుంటున్న చర్యలకు కొంతమంది యూరోపియన్ నాయకులు మద్దతు పలికినట్లు తెలస్తోంది. భారత్‌కు వ్యతిరేకంగా ట్రంప్ తీసుకున్న కఠిన నిర్ణయాలపై యూరోపియన్ దేశాలు మౌనంగా ఉన్నాయి. సుంకాలు విధించడాన్ని సమర్థించలేదు. అలా అని తప్పుబట్టలేదు. ఈ క్రమంలో భారత్‌ను లక్ష్యంగా చేసుకోవాలని ట్రంప్ పరిపాలనాధికారులు కోరడం గమనార్హం. ఇదిలా ఉండగా.. భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్తుతం చైనా పర్యటనలో ఉన్నారు. అక్కడ జరిగే 'షాంఘై సహకార సంస్థ' ఎస్‌సీవో వార్షిక శిఖరాగ్ర సదస్సులో ఆయన పాల్గొననున్నారు. భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాలు ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం వంటి కీలక విషయాలపై ఈ సదస్సులో చర్చకు వచ్చే అవకాశం ఉంది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్‌తో కూడా మోదీ సమావేశం కానున్నారు.

# బిజినెస్ జోన్

## లీప్ ఇండియా రూ.2400 కోట్ల ఐపీఓ

### సెబీకి ప్రాథమిక పత్రాలు దాఖలు




**న్యూఢిల్లీ :** సప్లై చైన్ సొల్యూషన్స్ ప్రొవైడర్ లీప్ ఇండియా తొలి పబ్లిక్ ఇష్యూకి ఐపీఓ రాబోతోంది. ఈ ఇష్యూ ద్వారా రూ. 2400 కోట్లు సమీకరించాలని సంస్థ భావిస్తోంది. ఇందుకు అనుమతి కోరుతూ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ప్రాథమిక పత్రాలు దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా రూ. 400 కోట్ల విలువైన షేర్లను తాజాగా జారీ చేయనుంది. ఆఫర్ ఫర్ సేల్ ఓఎఫ్‌సీ కింద ప్రమోటర్లు రూ. 2000 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నారు. ఐపీఓ ద్వారా సమీకరించే నిధుల్లో రూ. 300 కోట్లు రుణ చెల్లింపులకు మిగిలిన మొత్తాన్ని ఇతర కార్పొరేట్ అవసరాలకు కంపెనీ వినియోగించనుంది. ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ సర్వీసెస్ జేఎం ఫైనాన్షియల్ యూబీఎస్ సెక్యూరిటీస్ ఇండియా అవెండస్ క్యాపిటల్ సంస్థలు ఈ ఇష్యూకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి. సప్లై చైన్ రంగ సంస్థలకు అవసరమైన కంటైనర్లు క్రేట్స్‌లాంటి అసెట్స్‌ను లీజుకు అందించే లీప్ ఇండియా 2013లో ఏర్పాటైంది. దేశవ్యాప్తంగా 7747 కస్టమర్ టచ్‌పాయింట్లు 30 ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లు ఉన్నాయి. 2025 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 485 కోట్ల ఆదాయం రూ. 37.5 కోట్లు నికర లాభాన్ని ప్రకటించింది. పానసోనిక్ లైఫ్ సొల్యూషన్స్ ఇండియా మారికో హైయర్ అప్లయిన్సెస్ డైకిన్ డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్ తదితర 900 పైగా కంపెనీలు క్లయింట్లుగా ఉన్నాయి.

## బీఎస్ఎన్ఎల్ పే యూపీఐ వచ్చేస్తుంది!




ప్రభుత్వం టెలికం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ బీఎస్ఎన్ఎల్ ఆన్‌లైన్ సేవల్లో ప్రైవేటు కంపెనీలతో పోటీ పడుతోంది. ప్రిపెయిడ్ పోస్ట్ పెయిడ్ డేటా ప్లాన్లతో ప్రైవేటు సంస్థలకు దీటుగా దూసుకెళుతున్న బీఎస్ఎన్ఎల్ మరో ముందడుగు వేయబోతోంది. వినియోగదారుల కోసం త్వరలో కోసం కొత్త సర్వీసును అందుబాటులోకి తెచ్చేందుకు సన్నద్ధమవుతోంది. స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు ఆర్థిక లావేదేవీలు బిల్లుల చెల్లింపుల కోసం ఫోన్‌పే గూగుల్ పే పేటీఎం లాంటి ప్రైవేటు డిజిటల్ యాప్‌లను ఎక్కువగా వాడుతున్నారు. బీఎస్ఎన్ఎల్ కూడా త్వరలోనే యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ యూపీఐ సేవలను ప్రారంభించనుంది. బీఎస్ఎన్ఎల్ పే పేరుతో దీన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు చేస్తోంది. భారత్ ఇంటర్‌ఫేస్ ఫర్ మనీ భీమ్ యూపీఐ ఆధారంగా బీఎస్ఎన్ఎల్ పే సేవలను వినియోగించుకునేలా దీన్ని రూపొందిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

### దీపావళి నాటికి ప్రారంభం!

బీఎస్ఎన్ఎల్ పే సేవలు వినియోగదారులకు దీపావళి నాటికి అందుబాటులోకి వస్తాయని మీడియాలో వార్తలు వస్తున్నాయి. బీఎస్ఎన్ఎల్ పే అనేది ప్రత్యేకమైన యాప్ కాదు. బీఎస్ఎన్ఎల్ సెల్ఫ్‌కేర్ యాప్‌లో భాగంగానే ఇది ఉంటుంది. భీమ్ యూపీఐ ద్వారా దీని సేవలను యూజర్లు వినియోగించుకోవచ్చు.

### ఎలాంటి సేవలు అందిస్తుంది?

ఫోన్‌పే గూగుల్ పే పేటీఎం మాదిరిగానే బీఎస్ఎన్ఎల్ పే ద్వారా అన్ని రకాల ఆన్‌లైన్ చెల్లింపులు చేయగలుగుతారు. సెల్ఫ్ కేర్ యాప్ వినియోగదారులు సులువుగా ఈ సేవలు ఉపయోగించుకోవచ్చు. యూజర్లకు నాణ్యమైన డిజిటల్ సేవలు అందించడంతో పాటు దేశంలో వేగంగా విస్తరిస్తున్న యూపీఐ చెల్లింపుల మార్కెట్‌లో తమ దైన ముద్ర వేయాలని బీఎస్ఎన్ఎల్ లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలుస్తోంది. బీఎస్ఎన్ఎల్ పే సేవలు అందుబాటులోకి వస్తే ఫోన్‌పే గూగుల్ పే పేటీఎం లాంటి ప్రైవేటు డిజిటల్ యాప్‌లకు గట్టి పోటీ ఎదురవుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# అమెరికన్లపై ధరల పిడుగు

- ట్రంప్ నిర్ణయాలతో ఎగసిన వస్తూత్పత్తుల రేట్లు
- సగటు అమెరికన్ వినియోగదారుని జేబుకు చిల్లు
- మరికొద్ది నెలల్లో మరింత పెరగనున్న అత్యధిక రేట్ల కష్టాలు

**వాషింగ్టన్ :** అమెరికాను మళ్లీ గొప్పగా మార్చుతా(మేక్ అమెరికా గ్రేట్ ఎగేన్) నినాదంతో అధికారంలోకి వచ్చిన ట్రంప్ తర్వాత అవలంభిస్తున్న వివాదాస్పద విదేశాంగ విధానాలతో సగటు అమెరికా పౌరుని జేబుకు భారీ చిల్లు పడుతోంది. దిగుమతి సుంకాలను ఎడాపెడా వాయించడంతో విదేశీ సరకులను అధిక ధరలకు కొనలేక అమెరికాలో సామాన్య తరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారు.

ధరలను నేలకు దించుతానని బీరాలు పలికినట్రంప్ చివరకు ధరలను ఆకాశానికి ఎత్తేసి పలు రకాల సరకులను కొనలేని దుస్థితికి తీసుకొచ్చాడని దేశ వ్యాప్తంగా అమెరికన్లు ట్రంప్‌పై కారాలు మిరియాలు నూరుతున్నారు. విదేశీ సరకులపై ఇలాగే అధిక టారిఫ్‌ల భారం కొనసాగితే అంతకు మించిన ధరల భారం శాశ్వతంగా మోయాల్సి వస్తుందన్న భయాందోళనలు స్థానికంగా అధికమయ్యాయి. మార్కెట్‌రంగ నిపుణులు సైతం ఇదే పాటపాడటం అక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది.

### తొలిరోజే తగ్గిస్తానని చెప్పి..

'అధికారంలోకి రాగానే తొలిరోజే ద్రవ్యోల్బణం తగ్గిస్తా. ధరలను కిందకు తీసుకొస్తా"అని ఎన్నికల ప్రచారంవేళ 2024 ఆగస్ట్‌ర్యాలీలో ట్రంప్ చేసి వాగ్దానాలు నీటిమూటలేనని ఇటీవల ప్రజలకు స్పష్టంగా తెలిసొచ్చింది. "అమెరికా సరకులు అందుబాటు ధరల్లో"అనే నినాదం కాస్తా "కొనలేనంత అధిక ధరలకు అమెరికా సరకులు"అనే పరిస్థితి దాపురించింది. దీనికి తాజా గణాంకాలే తార్కాణంగా నిలుస్తున్నాయి.

జనవరిలో ట్రంప్ అధికారపగ్గాలు చేపట్టినప్పటి నుంచి లెక్కిస్తే ఆర్థిక డేటా, నిపుణుల విశ్లేషణల ప్రకారం గృహోపవస వస్తువులు మరీ ముఖ్యంగా నిత్యావసర సరకులు, విద్యుత్ ధరలు బాగా పెరిగిపోయాయి. ఇవి ఎప్పటికప్పుడు పెరుగుతూ లక్షలాది సగటు అమెరికన్లను మరింతగా ఆర్థిక కష్టాల్లోకి నెట్టేస్తున్నాయి. ఈ ధరల మోతకు పరోక్షంగా 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్'సైతం ఆజ్యంపోసిందని కొందరు ఆర్థికనిపుణులు విశ్లేస్తున్నారు. ఇవిగాక 800 డాలర్ల విలువైన సరకులను ఎలాంటి టారిఫ్, సుంకాలు, డ్యూటీలు, ఫీజులు లేకుండా దిగుమతి చేసుకునే 'డీ మినిమిస్'నిబంధననూ ట్రంప్ సర్కార్ తొలగించింది. దీంతో హఠాత్తుగా డిమాండ్ పెరిగి, ఆన్‌లైన్‌లో దొరికే తక్కువ ధర ఉండే వస్తువుల రేట్లు సైతం పెరిగిపోయాయి.



### పోస్టల్ సేవల నిరాకరణతో రేట్లు పైపైకి..

అమెరికాకు డెలివరీ చేసేందుకు వస్తువుల ఆర్డర్‌లను తీసుకోవడం భారత్‌లో 'ఇండియాపోస్ట్'ఆపేసింది. ఇండియాపోస్ట్ బాటలోనే 25 దేశాల్లోని పోస్టల్ సంస్థలు నడుస్తున్నాయి. దీంతో ఆయా దేశాల నుంచి పోస్టల్ ద్వారా అమెరికాకు డెలివరీ కావాల్సిన సరకుల భట్వాడా పూర్తిగా ఆగిపోయింది. దీంతో ఆయా దేశాల్లోని సంస్థలు ఇతరత్రా కొత్త డెలివరీ సంస్థల సాయంతో అమెరికాలోకి వస్తువులను డెలివరీ చేస్తున్నాయి. కొత్త సంస్థలు కావడంతో డెలివరీ చార్జీల మోత తప్పట్లేదు. ఈ పెరుగుదల చివరకు అమెరికా వినియోగదారునిపై పడుతోంది.

### పచారీ సామాను ధరలు..

అన్నింటికంటే ఎక్కువగా నిత్యావసర సరకుల ధరలు బాగా పెరిగాయి. జూన్–జులైలో అన్ని ఆహారాల వినియోగధరల సూచీ(సీపీఐ) కాస్తంత పెరిగింది. దీంతో రిటైల్ ధరలు అధికమయ్యాయి. గత 20 ఏళ్ల చరిత్రలో సగటున ఆహార ధరలు 2.9 శాతం పెరగ్గా తాజా అంచనాల ప్రకారం ఈ ఏడాది చివరికల్లా ఇది 3.4 శాతానికి చేరుకోనుందని విశ్లేషకులు చెప్పారు. పెరుగుతున్న ధరలకు స్థానిక పరిస్థితులు సైతం తోడయ్యాయి. ఏవియాన్ ఇన్‌ఫ్లూయెంజా వైరస్ దెబ్బకు కోళ్ల పరిశ్రమ కునారిల్లింది. దీంతో గుడ్ల ధరలు పెరిగాయి. గొడ్డుమాంసం ధర సైతం హెచ్చింది. తాజా సర్వే ప్రకారం పెరిగిన ధరలతో సతమతమవుతున్నామని 30వేల డాలర్ల వార్షికాదాయం ఉన్న 64 శాతం మంది కుటుంబాలు చెప్పాయి.

### కెనడా, మెక్సికో, చైనాలపై భారంతో..

చైనా, మెక్సికో, కెనడా ఆహారోత్పత్తులపై అమెరికన్లు బాగా ఆధారపడ్డారు. 2023లో 195.9 బిలియన్ డాలర్ల విలువైన వ్యవసాయోత్పత్తులను అమెరికా దిగుమతి చేసుకుంటే అందులో 44 శాతం దిగుమతులు కేవలం చైనా, కెనడా, మెక్సికో నుంచే వచ్చాయి. ఇప్పుడీ మూడు దేశాలపై అధిక టారిఫ్ మోపడం తో ఆమేరకు దిగుమతి సుంకాల రూపంలో ధరలు పెరిగి అమెరికన్ వినియోగదారుల చిల్లుకు పేద్ద చిల్లుపడుతోందని 'యేల్ బడ్జెట్ ల్యాబ్'సంస్థ పేర్కొంది.

హోల్‌సేల్, రిటైలర్లు ఈ టారిఫ్ భారాన్ని తాము భరించకుండా వినియోగదారులపై పడేయడంతో ఈ సమస్య ఉత్పన్నమైందని 9ఐ క్యాపిటల్ గ్రూప్ సీఈఓ కెవిన్ థాంప్సన్ అన్నారు. అమెరికాలో వినియోగించే రొయ్యల్లో 94 శాతం విదేశాల నుంచి రావాల్సిందే. ముఖ్యంగా భారత్, ఈక్వెడార్, ఇండోనేసియా, వియత్నాం ఈ రొయ్యలను ఎగుమతిచేస్తున్నాయి. 55 శాతం తాజా పండ్లు, 32 శాతం కూరగాయలు సైతం దిగుమతిచేసుకోవాల్సిందే. ఇవన్నీ ఇప్పుడు ధరలు పెరిగిపోయి వినియోగదారుల నడ్డి విరుస్తున్నాయి. గ్వాటెమాలా నుంచి వచ్చే అరటిపండ్లు మొదలు విదేశాల నుంచి వచ్చే కాఫీ, చాక్లెట్, గింజలు, టెక్స్‌టైల్స్, కోకా, వెనిల్లా ధరలు సైతం పెరిగాయి.

### అదే బాటలో విద్యుత్ చార్జీలు

విద్యుత్ చార్జీలు సైతం 2020 ఏడాది నుంచి చూస్తే 34 శాతం పెరిగాయి. 2024 మే నుంచి 2025 మే వరకు గృహవినియోగ విద్యుత్ చార్జీలు 6.5 శాతం పెంచేశారు. విద్యుత్‌రంగంలో వినియోగించే అల్యూమినియం, ఉక్కు, తదితరాలను అత్యధికంగా కెనడా, మెక్సికోల నుంచి దిగుమతిచేసుకుంటోంది. కొత్తగా వీటి దిగుమతి సుంకాలు పెంచేశారు. దీంతో విద్యుత్ గ్రిడ్‌లు, సబ్‌స్టేషన్లు, విద్యుత్ ప్లాంట్లలో వినియోగించే వస్తువుల ధరలు పెరిగాయి.

దీంతో పరోక్షంగా పెరిగిన ఆ ధరల షాక్ విద్యుత్ వినియోగదారులకు తగలనుంది. మరో ఐదేళ్లలో విద్యుత్ చార్జీలు 25 శాతం, మరో పదేళ్లలో 75 శాతం పెరుగుతాయని ఎనర్జీ ఇన్నోవేషన్ స్టడీస్ సంస్థ ఇప్పటికే అంచనావేసింది. "టారిఫ్ పెంచడమంటే అది అమెరికా వ్యాపారులు, వినియోగదారులపై పన్నులను పెంచడమే. అది తుదకు ధరల పెరుగుదలకు అంతిమంగా అధిక ద్రవ్యోల్బణంకు దారితీస్తుంది"అని అమెరికా మాజీ విదేశాంగ మంత్రి, ప్రస్తుత టైమ్ మ్యాగజైన్ ఎడిటర్ రిచర్డ్ స్టెన్‌గెల్ శుక్రవారం 'ఎక్స్'లో ఆందోళన వ్యక్తంచేశారు.

ప్రతికూల ప్రభావంచూపుతున్న 'బ్యూటిఫుల్ బిల్' వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్లు ద్వారా అమెరికన్లపై ఆదాయపన్ను భారాన్ని ట్రంప్ ప్రభుత్వం తగ్గించింది. తక్కువ పన్ను కట్టడం వల్ల పౌరుల వద్ద కొంత సొమ్ము ఆదా అవుతుంది. ఈ ఆదా అయిన సొమ్ముతో సరకుల్ని కొనగలరు అని ట్రంప్ వేసిన లెక్క తప్పు అని తాజా గణాంకాలు చాటుతున్నాయి. బ్యూటిఫుల్ బిల్లు అనేది అత్యధిక పన్నులు కట్టే వ్యాపారులు, సంపన్నులకు మాత్రమే లాభదాయకంగా ఉందని గణాంకాలు చెబుతున్నాయి.

సంపన్న కుటుంబాలు, పెద్ద కంపెనీల పన్ను తర్వాతి ఆదాయం ఈ బిల్లు తర్వాత 2–3 శాతం పెరిగింది. మధ్య, దిగువ తరగతి అమెరికన్లకు ఈ బిల్లుతో కేవలం 1 శాతం మాత్రమే లాభం చేకూరింది. "టారిఫ్‌లు, బ్యూటిఫుల్ బిల్లు కారణంగా నిర్మాణ రంగం, విద్యుత్ రంగంలో నిర్వహణ వ్యయాలు పెరిగాయి. ఇవి చివరకు వినియోగదారుల సొమ్మును లాగేసుకున్నాయి. డేటా సెంటర్ల నుంచి విద్యుత్ డిమాండ్ మరో మూడేళ్లలో మూడు రెట్లు పెరగనుంది. ఇది కూడా ధరల ర్యాలీని కొనసాగిస్తుంది"అని బిజినెస్ మ్యాగజీన్ 'ఫోర్బ్స్'తెలిపింది.

# సంక్షిప్త వార్తలు

## రాష్ట్రంలో రెండ్రోజులపాటు వర్షాలు

రేపు వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం



హైదరాబాద్ : వాయవ్య బంగాళాఖాతంలో మంగళవారం అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్న ట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. రాష్ట్రంలో నైరు తి రుతుపవనాలు చురుకుగా కదులుతుండటంతో ఉపరితల ద్రోణి కొనసాగుతోందని.. దాని ప్రభావంతో పలు ప్రాంతాల్లో వచ్చే రెండ్రోజులపాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లోని కొన్నిచోట్ల భారీ వర్షాలు కురవొచ్చని అంచనా వేస్తూ ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

**26 మండలాల్లో ఇంకా లోటు...**

జూన్, జూలై, ఆగస్టులలో 57.3 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 72.06 సెంటీమీటర్ల మేర వర్షం కురిసింది. జిల్లాలవారీగా చూస్తే 8 జిల్లాల్లో అత్యధిక వం-ర్షపాతం, 10 జిల్లాల్లో అధికం, 15 జిల్లాల్లో సాధారణ వర్షాలు కురిశాయి. అత్యధికంగా మెదక్ జిల్లాలో 90 శాతం అధిక వర్షాలు నమోద య్యాయి. 136 మండలాల్లో అత్యధిక వర్షపాతం, 238 మండలాల్లో అధికం, 221 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదవగా 26 మండలాల్లో లోటు వర్షపాతం ఉన్నట్టు వాతావరణ శాఖ పేర్కొంది.

**నిలకడగా గోదావరి**

కాళేశ్వరం: గోదావరినది నిలకడగా ప్రవహిస్తోంది. ఆదివారం కాళేశ్వరం వద్ద పుష్కరఘాట్లను తాకుతూ 12.500 మీటర్ల ఎత్తులో నీటిమట్టం దిగువకు ప్రవహించింది. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. కాళేశ్వరానికి ఎగువ ఉన్న అన్నారం బరాజ్ నుంచి వద్ద 3.56 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. మొత్తం 66 గేట్లు ఎత్తి ఉంచడంతో అక్కడి నుంచి కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ప్రాణహితనదితో కలిసి పరవళ్లు తొక్కుతోంది. మేడిగడ్డ బరాజ్‌కు 8.19 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 85 గేట్లు ఎత్తి నీటిని అదేస్థాయిలో దిగువకు వదులుతున్నారు.

## తెదేపాలో ఉన్నందుకు గర్విస్తున్నా

- మంత్రి అనిత



అనకాపల్లి: తెలుగుదేశం పార్టీలో ఉన్నందుకు తాను గర్వపడుతున్నానని హోంశాఖ మంత్రి వంగలపూడి అనితఅన్నారు. అనకాపల్లిలో మృతి చెందిన ఇద్దరు పార్టీ కార్యకర్తల కుటుంబ సభ్యులకు రూ. 5 లక్షలు చొప్పున ఇన్సూరెన్స్ నగదు చెక్కును ఆమె అంద జేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి కోటి సభ్యత్వా లు ఉన్నాయని తెలిపారు. దేశంలోని ఏ ప్రాంతీయ పార్టీకి ఇంత అధిక సంఖ్యలో సభ్యత్వాలు లేవన్నారు. పార్టీలో కార్యకర్తల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న ఘనత సీఎం చంద్ర బాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు దక్కుతుందని పేర్కొన్నారు. క్రమశిక్షణ గల తెలుగు దేశం పార్టీలో ఉండటం తనకు ఎంతో గర్వకారణంగా ఉందని వివరించారు. అనంతరం 21 మందికి రూ. 45 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆమె అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌ఎంఎస్ అనుబంధ సంస్థ గౌరవ అధ్యక్షురాలిగా కవిత



శ్రీరాంపూర్/హైదరాబాద్ : హింద్ మజ్దూర్ సభ (హెచ్‌ఎంఎస్)కు సింగరేణిలో అనుబంధ సంస్థగా ఉన్న అఖిల భారత మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ గౌరవ అధ్యక్షురాలిగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంచిర్యాల జిల్లా నస్పూర్ పట్టణంలో రెండు రోజులుగా జరుగుతున్న యూనియన్ 26వ మహాసభలు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి హెచ్‌ఎంఎస్ నేత, మాజీ మంత్రి ఎస్.వేణుగోపాలచారి, హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ హాజరై మాట్లాడారు. పలు తీర్మానాలు చేసి వాటి సాధనకు కార్మికవర్గంతో కలసి పోరాడాలని పిలుపునిచ్చారు. సింగరేణి జాగృతితో కలసి పని చేయడానికి ఇటీవల తీసుకు న్న నిర్ణయం మేరకు ఈ సభలో జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను హెచ్‌ఎంఎస్ అనుబంధ వర్కర్స్ యూనియన్ గౌర వ అధ్యక్షురాలిగా ఏకగీవ్రంగా ఎన్నుకున్నారు. కాగా, అమెరికా పర్యటనకు వెళ్లిన కవిత సోమవారం హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

# కాంగ్రెస్‌కు యువకులే అంబాసిడర్లు

- యువత వారి భవిష్యత్తు కోసం పోరాడాలి
- 2029 రాహుల్ ప్రధానినామ సంవత్సరం కావాలి
- వచ్చే ఏడాది జరిగే కేరళ ఎన్నికలు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తాయి
- కేరళలో ఎంపీ కేసీ వేణుగోపాల్ 'మెరిట్ అవార్డ్-2025'లో సీఎం రేవంత్ వ్యాఖ్యలు

హైదరాబాద్ : 'దేశంలోని యువత హక్కులను బీజేపీ కొల్లగొడుతోంది. యువత హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ పోరాడుతోంది. మీరే మా నమ్మకం. యువకులే కాంగ్రెస్ పార్టీ బ్రాండ్ అంబాసిడర్లు. మీ భవిష్యత్తుతోపాటు దేశం కోసం పోరాడండి'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. దేశంలో ఓట్ చోరీకి వ్యతిరేకంగా తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో పెద్ద ఉద్యమం జరుగుతోందన్నారు. ప్రతి భారతీయుడి ఓటు హక్కును కాపాడేందుకు.. రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు అందరం కలిసికట్టుగా పోరాడాలని కోరారు. కేరళలోని అలెప్పి పట్టణంలో కాంగ్రెస్ ఎంపీ, ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి కేసీ వేణుగోపాల్ ఆదివారం నిర్వహించిన 'ఎంపీ మెరిట్ అవార్డ్-2025'కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పలువురు ప్రతిభావంతులైన టెన్త్, ప్లస్ టూ విద్యార్థులు, యువతకు అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం రేవంత్ మాట్లాడుతూ యువతలో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంతోపాటు వారిలో స్ఫూర్తి నింపేందుకు ఈ అవార్డులు ఎంతో దోహదపడతాయన్నారు. 100 శాతం ఫలితాలు సాధించిన 150 పాఠశాలల్లోని 3,500 మంది విద్యార్థులకు అవార్డులు అందించడం అభినందనీయమన్నారు. దేశంలో విద్యకు, కేరళ రాష్ట్రానికి బలమైన సంబంధం ఉందని.. 100 శాతం అక్షరాస్యత సాధించిన తొలి రాష్ట్రంగా దేశంలోని ఇతర రాష్ట్రాలకు కేరళ ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. కేరళలో అమలవుతున్న వయోజన విద్యా కార్యక్రమం కూడా అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలబడుతోందని చెప్పారు. విద్యకున్న ప్రాధాన్యత గురించి తెలంగాణ సమాజానికి కూడా తాను ప్రతి సందర్భంలో చెప్పడమే కాకుండా తెలంగాణలో విద్యాభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకెళు తున్నామని వివరించారు. తెలంగాణలోని పేదలకు నాణ్యమైన విద్యను అందించాలని సంకల్పించామని చెప్పారు. విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అగ్రస్థానంలో నిలుస్తున్న కేరళపట్ల తనకు ఒకింత అసూయ కలుగుతోందని రేవంత్ వ్యాఖ్యానించారు.




విద్యార్థినికి అవార్డు అందజేస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో కేసీ వేణుగోపాల్

**21 ఏళ్లకే ఎమ్మెల్యే ఎందుకు కాకూడదు?**

దేశంలోని యువత వారిలో అంతర్లీనంగా దాగి ఉన్న శక్తిని గుర్తించాలని సీఎం రేవంత్ కోరారు. 'చిన్న వయసులోనే యువత సివిల్స్‌కు ఎంపికై ఐఏఎస్‌లుగా జిల్లా పాలనా వ్యవస్థను సమర్థంగా నడుపుతున్నప్పుడు 21 ఏళ్లకే యువత ఎమ్మెల్యేలు ఎందుకు కాకూడదు? ఆ దిశగా రాజ్యాంగాన్ని సవరించుకోవాలి. దేశ రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు 21 ఏళ్లకు ఓటు హక్కు ఉండేది. రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉండగా దాన్ని 18 ఏళ్లకు తగ్గించారు. కానీ ఇప్పటికే ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు కనీస వయసు 25 ఏళ్లుగానే ఉంది. ఇకనైనా యువతకు రాజకీయాల్లో అవకాశం కల్పించాల్సిన అవసరం ఉంది'అని రేవంత్ అభిప్రాయపడ్డారు. 2029లో లోక్‌సభ ఎన్నికలు రెండు ప్రధాన శక్తుల మధ్య జరగబోతున్నాయని.. యువత ఈ అంశాన్ని గ్రహించాలని కోరారు. వచ్చే ఏడాది జరిగే కేరళ ఎన్నికలను 2029లో దేశ భవిష్యత్తును నిర్ణయించబోయే ఎన్నికలుగా రేవంత్ అభివర్ణించారు. 2029లో రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలనే సంకల్పంతో ముందుకెళ్లాలని.. ఆ ఏడాదిని రాహుల్ ప్రధానినామ సంవత్సరంగా అందరికీ చాటాలని చెప్పారు. యువతను ప్రోత్సహించేందుకు కేసీ వేణుగోపాల్ చూపుతున్న చొరవను ప్రతి రాష్ట్రంలో, ప్రతి నియోజకవర్గంలో స్ఫూర్తిగా తీసుకొని నాయకులు ముందుకెళ్లాలని రేవంత్ కోరారు.

## 'ప్రొఫైల్ ' నకిలీ.. 'సైబర్' మకిలి

- ఆన్ లైన్ మోసాల్లో ఇలాంటివే ఎక్కువ
- సైబర్ వేధింపులు ప్రొఫైల్ హ్యాకింగ్ కూడా
- నాలుగేళ్లలో మూడురెట్లు పెరిగిన ఫిర్యాదులు
- ఎన్ సీఆర్‌పీలో వెల్లువెత్తుతున్న కంప్లయింట్స్



**నకిలీ ప్రొఫైల్ సైబర్ వేధింపులు ప్రొఫైల్ హ్యాకింగ్.. తీరు ఏదైనా సైబర్ నేరాల సంఖ్య భారత్‌లో ఏటా పెరుగుతూనే ఉంది. జనం డిజిటల్‌కు పెద్ద ఎత్తున మళ్లుతుండడం అదే సమయంలో పూర్తిగా అవగాహన ఉండకపోవడం.. సైబర్ నేరగాళ్లకు కలిసి వస్తున్నాయి. ముఖ్యంగా ఆన్ లైన్ సామాజిక మాధ్యమాల వేదికగా నకిలీ ఆన్ లైన్ ఖాతాలు తెరిచి చేస్తున్న మోసాలే ఎక్కువగా ఉంటున్నాయి.**

హైదరాబాద్ : ఇతర వ్యక్తులు బ్రాండ్ సంస్థలా కనిపించడానికి నకిలీ ఆన్ లైన్ ఖాతా తెరిచి చేస్తున్న మోసాలు దేశంలో అధికంగా ఉంటున్నాయి. అక్రమంగా డబ్బు సంపాదించే లక్ష్యంతో వ్యక్తిగత సమాచారం ఫొటోలు వివరాలను ఉపయోగించి సైబర్ నేరస్తులు ఇతరులను మోసం చేస్తున్నారు. గతేడాది ఇలాంటి ఘటనలు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా 39846 నమోదయ్యాయి. నాలుగేళ్లలో ఈ తరహా మోసాలు మూడు రెట్లు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఎన్ సీఆర్‌పీ వేదిక ద్వారా సైబర్ వేధింపుల ఫిర్యాదులు మూడున్నర రెట్లు పెరిగి 39077కు చేరాయి. ప్రొఫైల్ హ్యాకింగ్ గుర్తింపు చోరీ ఘటనలు మూడింతలకుపైగా అధికమై 38295కు పెరిగాయి. ఆన్ లైన్ జాబ్ మ్యాట్రిమోనియల్ మోసాలు కూడా పెరుగుతూ ఉన్నాయి.

**కేసులు ఎన్నోరెట్లు..**

అధికారిక లెక్కల ప్రకారం గతేడాది దేశవ్యాప్తంగా 22 లక్షలకుపైగా సైబర్ సెక్యూరిటీ ఘటనలు నమోదు కావడం ఆందోళన కలిగించే అంశం. ఆన్‌లైన్ సామాజిక మాధ్యమాల ద్వారా మోసాలు 2020తో పోలిస్తే 2024 నాటికి దాదాపు మూడింతలయ్యాయి. మహిళలు పిల్లలపై జరుగుతున్న సైబర్ నేరాల సంఖ్య రెండింతలకుపైగా పెరిగి గత ఏడాది 48475కు చేరాయి. సైబర్ నేరస్తులు ఇతర దేశాల నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నట్టు వారు ఉపయోగించిన ఇంటర్నెట్ ప్రొటోకాల్ ఐపీ అడ్రస్‌లను బట్టి తెలుస్తోంది. సైబర్ క్రిమినల్స్ చాలా సందర్భాల్లో తప్పుడు లొకేషన్ గుర్తింపుతో తప్పుదోవ పట్టిస్తున్నట్టు హోం మంత్రిత్వ శాఖ వర్గాలు గుర్తించాయి.

**కేటాయింపులు మూడింతలు..**

పౌరులు వ్యాపారాలు ప్రభుత్వానికి సురక్షిత సైబర్‌స్పేస్‌ను నిర్మించడానికి నేషనల్ సైబర్ సెక్యూరిటీ పాలసీ ఎన్ సీఎస్‌పీని కేంద్రం తీసుకొచ్చింది. అలాగే దేశంలోని సైబర్‌స్పేస్‌ను జల్లెడ పట్టేందుకు సైబర్ భద్రతా ముప్పులను గుర్తించడానికి నేషనల్ సైబర్ కోఆర్డినేషన్ సెంటర్ ఎన్‌సీసీసీ ఏర్పాటు చేసింది. డేటా సంరక్షణ కోసం డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ డీపీడీపీ చట్టం-2023 తీసుకొచ్చింది. ఎలక్ట్రానిక్స్ సమాచార మంత్రిత్వ శాఖ సైబర్ సెక్యూరిటీ మౌలిక వసతుల కోసం కేటాయించిన నిధులు 5 ఏళ్లలో మూడింతలకుపైగా పెరగడం గమనార్హం.

## 'ఆత్మగౌరవ సభకు సంపూర్ణ మద్దతు'

హైదరాబాద్ : పాత పెన్షన్ సాధనే లక్ష్యంగా తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నేడు సెప్టెంబరు 1వ తేదీన నిర్వహించనున్న ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యోగుల ఐకాస ఛైర్మన్ వి. లచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం జరిగిన ఐకాస అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ. .ప్రభుత్వ ఉద్యోగులంతా గట్టిగా పోరాడితే మళ్లీ పాత పెన్షన్ విధానం అమల్లోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో ఐకాస నేతలు కె.రామకృష్ణ, ఎస్.రాములు, కె. హన్మంత్‌రావు, నిర్మల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అడ్డదారులు

- రికవరీ చేసిన ఆభరణాలను పరిశీలిస్తున్న సీపీ
- ఎస్‌బీఐ బ్యాంకుకే కన్నం వేసిన క్యాషియర్
- సహకరించిన మేనేజర్..మరో 42 మంది
- 25.17 కిలోల బంగారం, రూ.1.10 కోట్ల నగదు చోరీ
- వివరాలు వెల్లడించిన రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా వెల్లడి



గోదావరిఖని/చెన్నూర్ : ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లో రూ. 40 లక్షలు పోగొట్టుకున్నాడు. ఒకసారికాదు.. అనేకసార్లు అదే ఆట ఆడి డబ్బు పోగొట్టుకున్నాడు. ఆ డబ్బు సంపాదించేందుకు మంచిర్యాల జిల్లా చెన్నూర్ ఎస్‌బీఐలో క్యాషియర్‌గా పనిచేస్తున్న నరిగె రవీందర్ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కోసం 402 గోల్డ్‌లోన్లకు సంబంధించిన 25.17కిలోల బంగారం, రూ. 1.10 కోట్ల నగదు చోరీ చేశాడు. రీజియన్ మేనేజర్ రితేశ్‌కుమార్‌గుప్తా ఆగస్టు 23న ఇచ్చిన ఫిర్యాదుతో చోరీ విషయం వెలుగుచూసింది. రంగంలోకి దిగిన పోలీసులు వారంలో రోజుల్లోనే కేసు ఛేదించారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన చోరీపై పెద్దపల్లి జిల్లా రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆదివారం తన కార్యాలయంలో ఆ వివరాలు వెల్లడించారు. 75 శాతం బంగారం రికవరీ చేశారు. ప్రధాన నిందితుడు బ్యాంకు క్యాషియర్ నరిగె రవీందర్.. బ్యాంక్ మేనేజర్ వెన్నపురెడ్డి మనోహర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి లక్కాకుల సందీప్‌లతో కలిసి ఈ మోసానికి పాల్పడ్డాడు. మంచిర్యాల డీసీపీ భాస్కర్ పర్యవేక్షణలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు కేసు విచారణ జరిపి ఛేదించారు.

**రూ.40 లక్షల నష్టాన్ని పూడ్చుకునేందుకు..**

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌తో రూ. 40 లక్షలు కోల్పోయిన రవీంద ర్.. ఆ నష్టాన్ని పూడ్చుకునేందుకు అదే బెట్టింగ్‌పై దృష్టి సారించాడు. దీనికి బ్రాంచ్ మేనేజర్ మనోహర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సందీప్‌తో కలిసి బంగారం, నగదుకు పక్కా ప్రణాళిక వేశాడు.

**పదినెలలుగా.. పకడ్బందీగా..**

ఏడాది క్రితం చెన్నూర్ బ్రాంచ్-2 ఎస్‌బీఐ క్యాషియర్‌గా బదిలీపై వెళ్లిన రవీందర్.. బ్యాంక్‌లో కుదువ పెట్టిన బంగారాన్ని తీసి వేరే బ్యాంకుల్లో తనఖా పెట్టి రుణాలు పొందాడు. ఆ సొమ్మును బెట్టింగ్‌కు వెచ్చించాడు. గతేడాది అక్టోబర్ నుంచి గోల్డ్‌లోన్ చెస్ట్ నుంచి బంగారం తీసి తన స్నేహితులకు ఇచ్చి, ఆ బంగారాన్ని ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల్లో తాకట్టు పెట్టాడు. ఆ డబ్బును తమ బ్యాంకు ఖాతాల్లో జమచేసిన స్నేహితులకు కొంత కమీషన్ కూడా ముట్టజెప్పేవాడు. ఇలా 10 ప్రైవేట్ గోల్డ్ లెండింగ్ కంపెనీలు (ఎస్ఎఫ్‌సీ, ఇండెల్‌మనీ, ముత్తూట్‌ఫైనాన్స్, గోదావరి అర్బన్, మణప్పురం, ముత్తూట్ ఫైనాన్స్ కార్ప్, ముత్తూట్ మినీ) 44 మంది పేర్లపై 142 గోల్డ్‌లోన్లు తీసుకున్నాడు.

**బంగారం లేకుండానే.. గోల్డ్‌లోన్‌లు..**

నరిగె రవీందర్ బంగారం లేకుండానే గోల్డ్ లోన్‌లు తీసుకున్నాడు. తన భార్య, బావమరిది, స్నేహితుల పేర్లతో 42 గోల్డ్‌లోన్లు మంజూరు చేసి 4.14 కిలోల బంగారం పేరుతో రూ. 1.58 కోట్లు కాజేశాడు. ఏటీఎంలలో నగదు రీఫిల్ చేసే సమయంలో కూడా డబ్బు అపహరించేవాడు. ఈ కేసులో 15.23 కిలోల బంగారం రికవరీ చేశారు. గోల్డ్‌లోన్ మేనేజర్ల పాత్రపై విచారణ జరుగుతోంది.

**15.237 కిలోల బంగారం రికవరీ**

చోరీ కేసులో ప్రధాన నిందితుడు రవీందర్, మేనేజర్ మనోహర్‌తోపాటు మరో 42 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. వీరి నుంచి 15.237 కిలోల బంగారు ఆభరణాలు, రూ. 1.61 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

**44 మంది నిందితుల అరెస్ట్..**

ప్రధాన నిందితుడు నరిగె రవీందర్, బ్యాంకు మేనేజర్ వెన్నపురెడ్డి మనోహర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి, లక్కాకుల సందీప్, ఎస్‌బీఎఫ్‌సీ సేల్స్ మేనేజర్ కొంగొంటి భీరేబ్, కస్టమర్ రిలేషన్ మేనేజర్ కోదాటి రాజశేఖర్, సేల్స్ ఆఫీసర్ బొల్లి కిషన్‌కుమార్‌తోపాటు మరో 38మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్వల్ప వ్యవధిలోనే కేసును ఛేదించిన మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, చెన్నూర్ సీఐ దేవేందర్‌రావు, రూరల్ సీఐ బన్సీలాల్, శ్రీ రాంపూర్ సీఐ వేణుచందర్, మంచిర్యాల రూరల్ సీఐ అశోక్ తదితరులను సీపీ అభినందించి రివార్డులు అందజేశారు.

EDITOR; KOLLURU KUMAR KURUMA H.No. 1-54/10/1 MADINAGUDA, MIYAPUR, HYDERABAD PIN CODE 500049 CELL; 9866222088,9966222088 GMAIL; kumaryadav5861@gmail.com.
RANGAREDDY DIST, CONTACT BY SREENIVAS KURUMA CELL; 9666023180,8096660656, WWW.IN:Vijay Bharathi RNI:TGTEL/25/A1970